



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 57 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 8 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 57 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 8 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



# కొత్త పార్టీ మనుగడ కష్టమే

## కవిత పార్టీపై మండలి చైర్మన్ గుత్తా

- కవిత రాజీనామా, కొత్త పార్టీ ఏర్పాటుపై గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- కవిత తన వద్దకు వచ్చి విజ్ఞప్తి చేయడంతో రాజీనామాను ఆమోదించినట్లు వెల్లడి
- భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచి చూస్తామన్న చైర్మన్
- రాష్ట్రంలో కొత్త పార్టీలు పెట్టాల్సిన అవసరం లేదన్న గుత్తా సుఖేందర్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయటం, ఆమె నూతన పార్టీని స్థాపించనున్నట్లు ప్రకటించటంపై తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కవిత తనను కలిసి విజ్ఞప్తి చేయడంతో రాజీనామాను ఆమోదించినట్లు తెలిపారు. భావోద్వేగంతో రాజీనామా చేసిన సందర్భాలలో కొంతకాలం వేచి చూస్తామని ఆయన అన్నారు. కవిత విషయంలోనూ అదే జరిగిందని పేర్కొన్నారు.కవిత నూతన పార్టీ ఏర్పాటు ప్రకటనపై ఆయన స్పందిస్తూ, రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టవలసిన అవసరం లేదని అన్నారు. కొత్త పార్టీ వచ్చినా మనుగడ సాగించడం కష్టమని అభిప్రాయపడ్డారు. గతంలో అనేక రాజకీయ పార్టీలు కనుమరుగయ్యాయని గుర్తు చేశారు.ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడతారనే దానిపై స్పష్టత లేదని ఆయన అన్నారు. జనాభా ప్రాతిపదికన జరిగినా దక్షిణాది రాష్ట్రాలకు నష్టమే వాటిల్లుతుందని అభిప్రాయపడ్డారు. హిల్ట్ పాలసీ గురించి మాట్లాడుతూ, ఈ విధానం ద్వారా ఎవరికీ ఎలాంటి నష్టం జరగదని హామీ ఇచ్చారు. కాలుష్యం నివారణకు పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయిం తీసుకుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరును తొలగించడాన్ని గుత్తా సుఖేందర్ రెడ్డి తప్పుబట్టారు.




## సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చు

### తెలంగాణతో నీటి వివాదాలపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

- కొందరు మాట్లాడుతున్న మాటలు తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్య
- రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచొద్దని హితవు
- వైసీపీ అక్రమాలపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడి
- రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపాటు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ సీఎం చంద్రబాబు ఈరోజు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ తెలంగాణతో నీటి వివాదాలపై సున్నితంగా, స్పష్టంగా స్పందించారు.గోదావరి నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చని చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పడం సరికాదని, నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దని తెలంగాణను కోరారు. "తెలుగు జాతి ఒక్కటే... ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి.

వివరాలు 2లో..

## కేటీఆర్ ర్యాలీలో జగన్ జెండాలు

- ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో కేటీఆర్ ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న వైసీపీ అభిమానులు, కార్యకర్తలు
- ఇటీవల జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెంలో ర్యాలీ నిర్వహించారు.

వివరాలు 2లో..

## చైనాలో మంచు సునామీ...



**పెన్ పవర్ డెస్క్:**గడ్డకట్టిన నది ఉన్నట్టుండి ఉప్పొంగింది.. మంచు కరిగి ప్రవాహాన్ని ముంచెత్తింది. శీతాకాలం కావడంతో పూర్తిగా మంచు పేరుకుపోయిన నదిని చూసేందుకు వచ్చిన పర్యాటకులు భయాందోళనకు గురయ్యారు. చైనాలోని జిన్ జియాంగ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు దీనిని 'మంచు సునామీ'గా అభివర్ణిస్తూ కామెంట్లు పెడుతున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

- తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు
- విచారణకు రావాలంటూ కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు
- బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేసినట్టు దర్యాప్తులో తేలిన వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత సోదరుడు కొండల్ రెడ్డికి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నోటీసులు పంపింది.

వివరాలు 2లో..

## ఉచితంగా స్నాక్స్

### పదో తరగతి విద్యార్థులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్



**హైదరాబాద్ పెన్ పవర్::** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోన్న టెన్త్ స్టూడెంట్స్‌కు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే

వివరాలు 2లో..

## కుక్క ఏ మూడ్ లో ఉందో ఎవరూ ఊహించలేరు

- వీధి కుక్కల కేసు విచారణలో సుప్రీం కీలక వ్యాఖ్యలు
- కరిచినా, కరవకున్నా కుక్కల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాఖ్య
- వీధుల్లో, స్కూల్స్, విద్యా సంస్థల పరిసరాల్లో కుక్కలు ఉండాల్సిన అవసరమేంటని ప్రశ్న



**హైదరాబాద్ పెన్ పవర్:**వీధి కుక్కలు ఎప్పుడు కరుస్తాయనే విషయం ఎవరూ ఊహించలేరని, వాటి మూడ్ ను అర్థం చేసుకోలేరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధుల్లో సంచరించే కుక్కలు తరచూ వాహనాలకు అడ్డుపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని గుర్తుచేసింది. ఈ మేరకు

వివరాలు 2లో..

## 'ఐబొమ్మ' రవి బెయిల్ పిటిషన్ కొట్టివేత

- బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో రవి పిటిషన్
- రవికి విదేశీ పౌరసత్వం ఉందని కోర్టుకు తెలిపిన పోలీసులు
- బెయిల్ ఇస్తే విదేశాలకు పరారయ్యే అవకాశం ఉందని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన కోర్టు.. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్ ను తోసిపుచ్చింది. సినిమా పైరసీ వెబ్ సైట్ 'ఐబొమ్మ' వ్యవహారంలో సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసిన పోలీసులు.. సైబర్ క్రైమ్ చట్టాల కింద ఐదు కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం జైలులో

వివరాలు 2లో..






## బీఆర్ఎస్‌కు అధికారం ఇక కల..

### ముందు మీ ఇంటి సమస్యలు చక్కబెట్టుకో

### కేటీఆర్‌కు పొంగులేటి కౌంటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** మళ్లీ అధికారంలోకి వస్తానని కేటీఆర్ కలలు కంటున్నాడు.. కానీ బీఆర్ఎస్‌కు అధికారం ఇక కలేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం పర్యటనలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రభుత్వానికి రెఫరెండం అని ఓటమిపాలయ్యారు.. మళ్లీ ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికలు సెమీ ఫైనల్ అంటున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్

వివరాలు 2లో..

## ఖమ్మం జిల్లా మంత్రులపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం



- జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపణ
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లకు సర్పంచ్ ఎన్నికలు జరిగాయని వెల్లడి
- బీఆర్ఎస్ 40 శాతం సర్పంచ్‌లను గెలుచుకుందని వెల్లడి

**ఖమ్మం: పెన్ పవర్:**ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు 30 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

వివరాలు 2లో..

# బీఆర్ఎస్‌కు అధికారం ఇక కల..

- మొదటి పేజి తరువాయి

ఉప ఎన్నిక, లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో ఓటమి పాలైన బుద్ది రాలేదని.. కేటీఆర్ ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. అధికారం తర్వాత.. ముందు మీ ఇంటి సమస్యలు చక్కబెట్టుకో అని కేటీఆర్‌కు చురకలంటించారు. దీపావళి బాంబులు ఏం ఏం పేలుతున్నాయో వాళ్లకు తెలుసని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వాళ్లు మాట్లాడే ప్రతిదానికి స్పందించాల్సిన అవసరం లేదన్నారు.

**ఈ నెల 18న మేడారానికి సీఎం రేవంత్: పొంగులేటి**

ఈ నెల 18న సీఎం రేవంత్ రెడ్డి మేడారం పర్యటన ఖరారైందని తెలిపారు. కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని అక్కడే రాత్రి బస చేస్తారని చెప్పారు. 19న సమ్మక్క సారక్క దేవతలకు సీఎం మొక్కులు చెల్లించుకుంటారు.. అనంతరం జాతర పనులు ప్రారంభిస్తారని తెలిపారు. వరంగల్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో మమునూరు ఎయిర్ పోర్ట్ రాబోతుందని తెలిపారు. మమునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి రైతులను ఒప్పించి భూ సేకరణ చేసిన అధికారులను ఈ సందర్భంగా ప్రశంసించారు.

# సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చు

- మొదటి పేజి తరువాయి

రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచుకుని ఇతరులు ఆనందించే పరిస్థితి రావొద్దు" అని హితవు పలికారు.కొందరు మాట్లాడుతున్న మాటలు వింటుంటే... ఆ రాజకీయాలేమిటో తనకే అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. గోదావరి నది పైభాగంలో దేవాదుల ఉందని... దేవాదుల నుంచి నీళ్లు వస్తే కింద ఉన్న పోలవరానికే వస్తాయని, కిందికి వచ్చే నీళ్లకు అభ్యంతరం చెబితే అర్థమేమీ ఉండదని అన్నారు. తాము ఎప్పుడూ దేవాదులకు వ్యతిరేకం కాదని, తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కడుతున్నప్పుడు కూడా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకూ లాభమేనని, మిగులు నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకోవచ్చని సూచించారు.కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉండటంతో పైన ప్రాజెక్టులు కడితే నష్టమని, కానీ గోదావరి డెల్టాను కాపాడుకుని కృష్ణా-గోదావరి అనుసంధానం చేస్తే ఇబ్బంది ఉండదని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదని, అబద్ధాలను వందసార్లు చెబితే నిజమవుతుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

పోలవరం ఆలస్యంపై గత వైసీపీ ప్రభుత్వాన్ని చంద్రబాబు విమర్శించారు. గత ప్రభుత్వం వల్లే 6-7 ఏళ్లు ఆలస్యమైందని, డయాఫ్రం వాల్ పాడైందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పిన తర్వాతే వాళ్లకు తెలిసిందని

విమర్శించారు. ఇప్పుడు కొత్తగా డయాఫ్రం వాల్ కడుతున్నామని, ఫిబ్రవరి 15లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని, కానీ దర్యాప్తు పేరుతో కాలయాపన చేసుకుంటూ పోతే, పనులు పూర్తి చేయడానికి చాలా కాలం పడుతుందని చెప్పారు. అనుమతులు లేని ప్రాజెక్టులకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారని... ఎన్జీటీకి రూ. 100 కోట్ల జరిమానా కట్టారని దుయ్యబట్టారు.

# కుక్క ఏ మూడ్ లో ఉందో ఎవరూ ఊహించలేరు

- మొదటి పేజి తరువాయి

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్ హోంలకు తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్ ను ధర్మాసనం ఈ రోజు విచారించింది.ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. వీధుల్లో తిరిగే కుక్క కరుస్తుందని భావించినపుడు స్థానికులు అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. అధికారులు ఆ శునకాన్ని తీసుకువెళ్లి స్టెరిలైజ్ చేసి వదిలిపెడతారని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. స్టెరిలైజ్ చేశాక మనుషులను కరవకుండా వాటికి కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పడం మర్చిపోయినట్టున్నారని వ్యాఖ్యానించింది. మనుషులను కరవడం మాత్రమే కాదు.. వీధుల్లో కుక్కలు పరిగెత్తడం వల్ల వాహన ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ధర్మాసనం గుర్తు చేసింది.

ప్రమాదం జరిగాక చికిత్స తీసుకోవడం కన్నా ముందే జాగ్రత్త పడడం మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. వీధుల్లో, స్కూళ్లు, విద్యాసంస్థల

చుట్టుపక్కల కుక్కలు సంచరించాల్సిన అవసరం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. వీధుల్లో సంచరించే ప్రతీ కుక్క మనుషులను కరవకపోవచ్చు కానీ రోడ్లపై అవి అడ్డదిడ్డంగా పరుగులు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం మాత్రం ఉందని ధర్మాసనం పేర్కొంది.

# కేటీఆర్ ర్యాలీలో జగన్ జెండాలు

- మొదటి పేజి తరువాయి

ఈ ర్యాలీలో అనూహ్యంగా ఏపీ మాజీ సీఎం జగన్ ఫొటోలు, వైసీపీ జెండాలు కనిపించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. వైసీపీ కార్యకర్తలు, అభిమానులు కూడా ఈ ర్యాలీలో పాల్గొని జై జగన్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. రెండు పార్టీల మధ్య స్నేహబంధాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి.బీఆర్ఎస్, వైసీపీ పార్టీల మధ్య ముందు నుంచి మంచి సంబంధాలు ఉన్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్, జగన్ మధ్య స్నేహపూర్వక వాతావరణం కొనసాగింది. రాజకీయ విషయాల్లో ఒకరికొకరు మద్దతు తెలుపుకునేవారు. ఇటీవల జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో జగన్ నివాసం వద్ద కేసీఆర్, కేటీఆర్, జగన్ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ సందర్భంగా రెండు పార్టీల సాన్నిహిత్యం మరోసారి బయటపడింది.

# రంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం.. పెళ్లికి ఒప్పుకోలేదని ఆత్మహత్య చేసుకున్న ప్రేమజంట

**రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో దారుణం**

**నిన్న ఉరివేసుకుని ప్రియురాలు, నేడు పెట్రోల్ పోసుకుని ప్రియుడి బలవన్మరణం**

**రెండు కుటుంబాల్లో విషాదం నింపిన ఆత్మహత్యలు**

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా, యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. నిన్న ప్రియురాలు ఉరి వేసుకుని మరణించగా, నేడు ప్రియుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనతో రెండు కుటుంబాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది.



మేడిపల్లి గ్రామానికి చెందిన మహేశ్ (20), ఓ బాలిక (16) గత నాలుగు నెలలుగా ప్రేమలో ఉన్నారు. బాలిక ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మహేశ్‌తో ఆమె ప్రేమలో పడింది. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో వారిద్దరినీ కొంతకాలం పాటు కలవకుండా చేశారు.పెద్దలు తమ ప్రేమను అంగీకరించి పెళ్లి చేయడం లేదని మనస్తాపానికి గురైన ఆ ప్రేమ జంట, గతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇద్దరూ తమ ఇళ్లలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. అయితే, ఇరువురు కూడా ప్రాణాపాయం నుండి సురక్షితంగా బయటపడ్డారు.తాజాగా, సోమవారం మహేశ్ బాలికకు ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. దీంతో మనోవేదనకు గురైన బాలిక మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణించిన విషయం తెలుసుకున్న మహేశ్, ఈరోజు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని మృతి చెందాడు.

# ఉచితంగా స్నాక్స్

## పదో తరగతి విద్యార్థులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్

- మొదటి పేజి తరువాయి

విద్యార్థులకు సాయంత్రం వేళ ఉచితంగా స్నాక్స్ అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ బుధవారం (జనవరి 7) ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిబ్రవరి 16 నుంచి మార్చి 10 వరకు మొత్తం 19 రోజుల పాటు విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నారు. స్నాక్స్ కోసం ప్రభుత్వం రూ.4.23 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాగా, మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు తెలంగాణలో టెన్త్ ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:50 వరకు ఎగ్జామ్ జరగనుంది.

**టెన్త్ ఎగ్జామ్ షెడ్యూల్:**

మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్
మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్
మార్చి 23న థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్ )
మార్చి 28న మ్యాథ్స్
ఏప్రిల్ 2న సైన్స్ పార్ట్ 1, (ఫిజికల్ సైన్స్)
ఏప్రిల్ 7న సైన్స్ పార్ట్ 2( బయోలాజికల్ సైన్స్)
ఏప్రిల్ 13న సోషల్ స్టడీస్
ఏప్రిల్ 15న: ఒకేషనల్ కోర్స్, ఓఎస్ఎస్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 1
ఏప్రిల్ 16న ఓఎస్ఎస్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 2

# ఫోన్ ట్యాపింగ్ కేసులో రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు

- మొదటి పేజి తరువాయి

ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసులో అధికారులు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి విపక్ష నాయకుడిగా ఉన్న రోజుల్లో కొండల్ రెడ్డి ఫోన్‌ను ట్యాప్ చేశారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలం తీసుకోవడం కోసం విచారణకు పిలుస్తున్నారు.

ఇదే కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకూ నోటీసులు వెళ్లాయి. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్యలను కూడా రేపు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పోలీసులు ఆదేశించారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావులకు కూడా ఇలాంటి నోటీసులు జారీ అయ్యాయి.

# ఖమ్మం జిల్లా మంత్రులపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

ఖమ్మంలో నిర్వహించిన సర్పంచ్‌ల సన్మాన కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరిగాయని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 40 శాతం సర్పంచ్‌లను బీఆర్ఎస్ గెలుచుకుందని గుర్తు చేశారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఒక మంత్రి కార్పొరేటర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్పించే పనిలో ఉన్నారని ఆరోపించారు.

## 'ఐబొమ్మ' రవి బెయిల్ పిటిషన్ కొట్టివేత

- మొదటి పేజి తరువాయి

ఉన్న రవి బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు.

ఈ పిటిషన్ విచారణ సందర్భంగా రవిపై నమోదైన కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉన్నాయని పోలీసులు కోర్టుకు వెల్లడించారు. రవికి విదేశాల్లో పౌరసత్వం ఉందని కోర్టు దృష్టికి తీస్కుళ్లారు. బెయిల్ మంజూరు చేస్తే రవి విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని తెలిపారు. దీంతో న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

# ఇకపై పోటీ చేయను.. రాజకీయాల నుంచి తప్పుకుంటా

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ బీజేపీ సీనియర్ నేత, కైకలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని ఆయన ప్రకటించారు. రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఎప్పుడో అనుకున్నానని, కానీ అందరూ కోరుకోవడంతో పాటు బలవంతం చేయడంతోనే 2024 ఎన్నికల్లో పోటీ చేశానని ఆయన అన్నారు. అనూహ్యంగా ఎవరూ ఊహించని విధంగా భారీ మెజారిటీతో విజయం సాధించానని చెప్పారు.తాను కానీ, తన కుటుంబంలో, ఎవరూ కానీ ఇకపై ఎన్నికల్లో పోటీ చేయబోమని కామినేని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా మంచి పనులు చేసి, సమాజానికి ఉపయోగపడేలా పేరు తెచ్చుకుంటానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో... నియోజకవర్గంలో అక్రమాలు, అన్యాయాలు జరిగితే ఎవరినీ ఉపేక్షించబోమని కఠిన హెచ్చరిక కూడా చేశారు. ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.

మరోవైపు, సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు కామినేని శ్రీనివాసరావు మంచి సందేశం ఇచ్చారు. పండుగలో జూదాలు ఆడటం మానేసి, మన సంప్రదాయ క్రీడలే ఆడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 'జూదాలు వద్దు సంప్రదాయ క్రీడలే ముద్దు' అనే నినాదం కూడా ఇచ్చారు.

# ఎడిటర్ వ్యూ

## రాజకీయ మేధావి మధులిమాయె

మధు లిమాయె పూణే పట్టణంలో 1922 మే 1వ తేదీన జన్మించారు. ఆయన పూర్తి పేరు మధుకర్ రామచంద్ర లిమాయే. మధులి మాయె స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న, కాంగ్రెస్ ను ముఖ్యంగా ఇందిరా గాంధీని వ్యతిరేకించిన ప్రముఖ వ్యక్తులలో ఒకరు. ఆయన సోషలిస్ట్ వ్యాసకర్త, సామాజిక కార్యకర్త. పూణే లోని ఫెర్గుసన్ కళాశాల నుండి విద్యను పూర్తి చేసారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం వల్ల చదువుకు అంత రాయం ఏర్పడింది. 1940 నుండి 1945 మధ్య కాలంలో నాలుగు సంవత్సరాల జైలు జీవితం కూడా గడిపారు. గోవా విముక్తి ఉద్యమం లో పాల్గొని చాలాకాలం జైలు జీవితం అనుభవించారు. కాంగ్రెస్ పార్టీలో 1938-1939 లలో సభ్యునిగా ఉన్నారు. తర్వాత రాం మనోహర్ లోహియా సోషలిస్ట్ పార్టీలో ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. సోషలిస్టు నేత రామ్ మనోహర్ లోహియా అనుయాయు లైన జార్జ్ ఫెర్నాండెజ్, మధు లిమాయే, రాజ్ నారాయణ్‌లు ఎప్పుడూ కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ వచ్చారు. సోషలిస్టు ఉద్యమంలో అంబేడ్కర్ ఆవశ్యకతని గుర్తించిన మొదటి వ్యక్తి బహుశ మధు లిమాయే నేమో. 'కమ్యూనిస్టు మానిఫెస్టో' ఎంత ముఖ్యమో అంబేడ్కర్ 'కుల నిర్మూలన' కూడా అంతే ముఖ్యమని లిమాయే ప్రకటించారు. అంబేడ్కర్ కుల నిర్మూలన కోరుకున్నారు. ఎందుకంటే కుల నిర్మూలన జరగకుండా దేశంలో వర్గాలు ఏర్పడవని, వర్గ పోరాటమూ సంభవించదని భావించారు. గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొని చాలాకాలం జైలు జీవితం అనుభవించారు. మధు లిమాయే బీహార్ లోని బంక లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. మధులిమాయే 1964-1979 తన లోక్ సభ పదవి కాలంలో ఉత్తమమైన వక్తగా ప్రజా సమస్యలు తెలుపడంలో చురుకైన పార్లమెంటేరియేన్ గా పేరు గడించారు. అత్యవసర పరిస్థితి సమయంలో 1975 నుంచి 1977 వరకు జైలులో వున్నారు. తర్వాత జయప్రకాశ్ నారాయణ నాయ కత్వంలో ప్రతిపక్ష పార్టీలను సమైక్య పరిచే ప్రయత్నంలో ప్రముఖ పాత్ర పోషించారు. జార్జ్ ఫెర్నాండెజ్ తో పాటు వివిధ అంశాలపై పని చేసేవారు. అత్యవసర పరిస్థితి తర్వాత కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్న జనతా ప్రభుత్వంలో ముఖ్య పాత్రలు పోషించాడు. మొరార్జీ దేశాయ్ నేతృత్వంలో ఏర్పడిన జనతా ప్రభుత్వం 1979 సంవత్సరంలో కూలి పోవడానికి, జనతా పార్టీలో చీలిక రావటంలో ...జనసంఘ్ - రాష్ట్రీయ స్వయం సేవక్ పార్టీ ద్వంద సభ్యత్వాల కారణాలలో మధులిమాయే పాత్ర ప్రధానమైనది.. జనతా పార్టీలో భాగమైన వారు ఇతర పార్టీలలో గాని, రాజకీయ సంస్థలతో గాని భాగస్వామ్యంలో ఉండరాదని, మురార్జీ దేశాయ్ నేతృత్వంలో ఏర్పడిన జనతా సంకీర్ణ ప్రభుత్వం అధికారం నుండి దింపడంలో రాజ నారాయణ్ కృష్ణ కాంత్ తదితర సహచరులతో కలిసి ప్రణాళికలు రూపొందించి సఫలమయ్యారు. జనతా పార్టీలో భాగస్వాములైన జనసంఘ్ నాయకులు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ((ఆరెస్సెస్) సభ్యులుగా ఉండడంతో ద్వంద్వ సభ్యత్వంపై మధులిమాయే లాంటి నేతల అభ్యంతరాలు 1979 లో జనతా ప్రభుత్వం పతనానికి, జనతా కూటమి పతనానికి దారితీసింది. ఇందిరా గాంధీని ఓడించే ఏకైక లక్ష్యంతో, భిన్న భావజాలాలు కలిగిన పార్టీల కలయికతో ఏర్పడిన జనతా పార్టీ కిచిడీలాంటిదేనని ఆయన నొక్కి చెప్పారు. ఇందిర ఓడి పోవడంతో జనతా పార్టీ చీలిపోవడం ప్రారంభమయింది.వాస్తవానికి లోక్‌సభలో మొరార్జీ దేశాయి ప్రభుత్వానికి మద్దతు నివ్వమని జార్జి ఫెర్నాండెజ్‌కు సలహా ఇచ్చింది మధు లిమాయే. అయితే ఇది జరిగిన కొద్ది గంటలకే సోషలిస్టు నాయకులు మొరార్జీ ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించు కున్నారు. మధు లిమాయే రాజకీయ సిద్ధాంతం, లౌకిక జాతీయవాదం, భారత దేశం యొక్క లౌకిక ఆధారాలపై ఆయనది రాజీలేని వైఖరి. ఆయన రాజ్యాంగంలోని లౌకిక పునాదుల పరిరక్షణకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. కుల వ్యవస్థకు తన లాంటి సోషలిస్టు ప్రధాన శత్రువని ప్రకటించారు. కుల వ్యవస్థ, దాని ఆధారంగా ఉన్న అసమానతలను కూల్చివేసే వరకు భారత దేశంలో ఆర్థిక మరియు సామాజిక సమానత్వం ఉండదని దృఢమైన అభిప్రాయమని నొక్కి చెప్పారు. మధు లిమాయే తన జీవితమంతా పౌర స్వేచ్ఛ కోసం పోరాడేవారు. పౌరుల స్వేచ్ఛ కోసం దిగువ కోర్టుల నుండి హై కోర్టులలో, సుప్రీం కోర్టులో తన కేసులను వాదించారు. విజయం సాధించారు. మధు లిమాయే విదేశీ విధానంలో... అలీన దేశాల సూత్రములపై ఆధారం, వలసవాద వ్యతిరేకత, ప్రజలందరికీ స్వేచ్ఛ, నిరాయుధీకరణ, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక ప్రయోజనాల రక్షణ, ప్రపంచ శాంతి మున్నగు వాటిలో గట్టి నమ్మకం ఉండేది. రాజకీయ - ఆర్థిక సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా వలస రాజ్యాల ప్రజల పోరాటం యొక్క పొడిగింపు అయినందున, భారత దేశం తమ విదేశాంగ విధానములో దృఢ వైఖరిని తీసుకోవాలి అని ఆయన పేర్కొనే వారు. మధులిమాయె రాజకీయ నాయకు నిగా కాక రచయితగా ఆంగ్లము, హిందీ, మరాఠి భాషలలో పుస్తకా లను రచించారు. 1997లో భారత ప్రభుత్వం లిమాయే జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. మధు లిమాయే 1995 జనవరి 8 న్యూఢిల్లీలో మరణించారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్




- దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్‌గా మారినా, టౌన్‌ప్లానింగ్‌లో మార్పులేదు..
- బీఆర్ఎస్ నేతల సిఫార్సుల పేరుతో, బౌరంపేట్‌లో మరో రెండు అక్రమ షెడ్లు..
- టౌన్‌ప్లానింగ్ అధికారుల విధులు.. సిఫార్సుల అమలుకే పరిమితం.. చర్యలు శూన్యం..
- సిఫార్సులు అంటే చట్టబద్ధమైనవిగా భావిస్తున్న దుండిగల్ జీహెచ్ఎంసి..!
- అక్రమ నిర్మాణాలు, టౌన్‌ప్లానింగ్ నిర్లక్ష్యంపై.. డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ ఏది..?
- రోజురోజుకు అధికారుల విధుల్లో కనుమరుగు అవుతున్న "పారదర్శకత"..

బౌరంపేట్ సాయిబాబా గుడి సమీపంలో అక్రమ సెల్లార్‌తో, అదనపు అంతస్తులు, పార్కింగ్ స్థలంలో కమర్షియల్ షెట్టర్..

# అక్రమ కట్టడాలకు అండగా..! గల్లీ నాయకుడు..!

- అధికారుల చర్యలు 'సైడై' పోతున్నాయి..! సిఫార్సులే ముఖ్యమై పోతున్నాయి..!
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో 'బికారీ' నేతలు కూడా 'కుబేరులు'గా మారిన వైనం.
- స్టిల్ట్(పార్కింగ్)స్థలం ఆక్రమించి కమర్షియల్ షాపుల నిర్మాణానికి యత్నం..
- బీఆర్ఎస్ సిఫార్సులు అంటూ, కూల్చేసిన అక్రమ కట్టడంలో దర్జాగా రంగుల పనులు..
- బీఆర్ఎస్ చోటా నాయకుని సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తున్న దుండిగల్ టిపిఎస్..?

- బౌరంపేట్ పరిధిలో అక్రమ సెల్లార్‌తో అదనపు అంతస్తుల నిర్మాణం..!
- ఒకసారి కూల్చేసిన టౌన్‌ప్లానింగ్.. గల్లీ నాయకుడి సిఫార్సులకు ప్రాధాన్యత..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 7:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అందరికీ ఆమోదయోగ్యమైనదే అయినప్పటికీ..! అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూములను కొల్లగొట్టి, కొందరు 'బికారీ'లను 'కుబేరు'లుగా చేసింది.. ప్రభుత్వాలు మారినా భూ కబ్జాలు ఆక్రమణలు, అక్రమ కట్టడాలు, అదేవిధంగా కొనసాగుతున్నాయి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో, సొంతపార్టీ నేతలనే తొక్కిపెట్టిన ఘటనలు ఉన్నాయి.. వారి సిఫార్సులకు విలువ లేకుండా చేసిన వైనాన్ని, సన్నిహిత మీడియా మిత్రులతో ఆవేదనను పంచుకున్న బీఆర్ఎస్ గల్లీ నాయకులు.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మాత్రం చక్రం తిప్పడం విశేషం.. అందుకు దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ అధికారులతో పాటు..! దుండిగల్ గండిమైసమ్మ మండలం రెవెన్యూ అధికారులపై కూడా విమర్శలు వస్తున్నాయి.. చోటా నాయకుల సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తూ..! కబ్జాలను ప్రోత్సహించే విధంగా రెవెన్యూ వ్యవహరిస్తుంటే..! అక్రమ కట్టడాలకు సిఫార్సుల పేరుతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ కీలకంగా సహకరిస్తున్నారు.. ఈ సహాయ సహకారాలకు రెండు శాఖల అధికారుల లాభాపేక్ష లేకుండా సాధ్యమేనా..? లేకపోతే నేతల సిఫార్సులకు "చట్టబద్ధత" ఏమైనా కల్పించారా..? దిక్కుమాలిన కొందరు అధికారుల విధుల తీరుపై ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా నిదర్శనాలు ఉన్నప్పటికీ..! ఉన్నతాధికారులు కూడా, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, పరిపాలనా అస్తవ్యస్తంగా తయారై తెలంగాణ ప్రభుత్వం అబాసుపాలు అయ్యే అవకాశం ఉంది..

అటు బౌరంపేట్ సింహపురి కాలనీలోనూ, డిపిఎస్ రోడ్డులో, బీఆర్ఎస్ నాయకులకు చెందిన అక్రమ షెడ్లపై ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు.. భారీ షెడ్లను నిర్మిస్తుంటే టౌన్‌ప్లానింగ్ అధికారి, చైన్‌మెన్, అక్రమ షెడ్ల నిర్మాణ దారులతో కమిట్‌మెంట్‌ల కారణంగా, చర్యలకు దూరంగా ఉంటున్నారని, ఆరోపణలు వస్తున్నాయి.. మరోవైపు కొందరిపైనే చర్యలు ఏంటని, అవికూడా, సహకరించే ధోరణితో మొక్కుబడి చర్యలంటూ ప్రశ్నిస్తున్నారు.. విజిలెన్స్ అధికారులు కూడా నిర్లక్ష్యం వహించడం పలు అనుమానాలను రేకెత్తిస్తుంది..




అదే నిర్మాణం కూల్చేసిన దుండిగల్ టౌన్‌ప్లానింగ్.

## దుండిగల్ సర్కిల్ టిపిఎస్ నిర్లక్ష్యం పతాక స్థాయికి చేరుకుంది..!

దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోఅక్రమ నిర్మాణం ఏదైనా చర్యలు శూన్యం.. టిజి-బిపాస్ చట్టాలు, నిబంధనలు ఏవైనా తుంగలో తొక్కడమే అధికారుల విధులు..! రాజకీయ నేతల ముసుగులో..! అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా, అధికారులను కట్టడి చేస్తున్నారనే విమర్శలు కూడా గుప్పుమంటున్నాయి.. మరోవైపు రాజకీయ పార్టీల కండువాలు కప్పుకుని, అక్రమ నిర్మాణాలకు సిఫార్సులు చేస్తూ, అధికారుల చర్యలను అడ్డుకోవడమే లక్ష్యంగా మారిందనే ఆరోపణలతో ఎద్దేవా చేసేవారు లేకపోలేదు.. అధికారులు కూడా టిజి-బిపాస్ చట్టాన్ని బహిరంగంగానే నిర్వీర్యం చేస్తున్నారు.. నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమార్కులకే ప్రాధాన్యత ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది..

టిపిఎస్ సౌజన్యంతో కూల్చేసిన నిర్మాణం ఇలా రంగులు వేసిన వైనం..




## గల్లీ నాయకుని సిఫార్సులతో.. టిపిఎస్ చర్యలకు దూరం..

దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ బౌరంపేట్ పరిధిలోని గండిమైసమ్మ-మియాపూర్ రహదారిపై సాయిబాబా ఆలయం సమీపంలో, అక్రమంగా సెల్లార్‌తో, అనుమతులకు మించి అదనపు అంతస్తుల నిర్మాణంపై ఇటీవల దుండిగల్ మున్సిపల్ అధికారులు బ్రేకర్‌లతో కూల్చివేసిన భవన నిర్మాణంలో యధావిధిగా పనులు చేపట్టడానికి, ఓ గల్లీ నాయకుని సిఫార్సులు అంటూ, చర్యలు తీసుకోకుండా జీహెచ్ఎంసి పట్టణ ప్రణాళిక అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.. ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు ముట్టాయనే ఆరోపణలు ఉండగా..! అధికారులకి తెలియకుండా సాధ్యమేనా అంటూ విమర్శించే వారు ఉన్నారు..! మరోవైపు టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో సిబ్బంది నిత్యం పర్యవేక్షణ ఉన్నప్పటికీ, అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా, టిపిఎస్ సంజునా, కమిషనర్ వెంకటేష్ నాయక్ చర్యలకు ఆదేశించడం లేదని, తాము చిన్న ఉద్యోగులమని చైన్‌మెన్ పొంతనలేని సమాధానంతో దాటవేయడం, అలవాటుగా మారింది.. సిఫార్సులు ఉన్నాయని, తాము ఔట్ సోర్సింగ్ సిబ్బంది అంటూ, టిపిఎస్ మేడమ్ చర్యలకు ఆదేశిస్తే కూల్చేస్తామని చెప్పడం విశేషం.. మేడమ్ చెప్పరు, చైన్‌మెన్ కూల్చివేయరు.. ఒకవేళ కూల్చేసినా..! బ్రేకర్‌ల హంగామాతో "ఫోటోషూట్" చర్యలతో మమః అనిపించడం కొత్తేమికాదు.. హాస్యాస్పద విషయం ఏమిటంటే, ఈ అక్రమ నిర్మాణాన్ని రెండు సార్లు కూల్చేశామని చైన్‌మెన్ కితాబివ్వడం బాధ్యతా రహితం.. మరి కూల్చేసిన నిర్మాణంలో రంగులు కూడా వేశారు ఎందుకు.. ముడుపులతో సక్రమం అయిందా..?






# గ్రేటర్ హైదరాబాద్ నాలుగు కమిషనరేట్ల పరిధిలో భారీగా డీసీపీల బదిలీలు


**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీగా డీసీపీలను బదిలీ చేస్తూ తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సిటీలోని నాలుగు కమిషనరేట్ల పరిధిలో పలువురు డీసీపీలు బదిలీ అయ్యారు. కొత్తగా ఏర్పాటైన జోన్లు, ఇతర విభాగాలకు ఐపీఎస్ లను బదిలీ చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ సౌత్ రేంజ్ అడిషనల్ కమిషనర్‌గా తస్వీర్ ఇక్బాల్, హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ సీపీగా శ్వేత, కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీగా కోటిరెడ్డి, మహేశ్వరం జోన్ డీసీపీగా నారాయణరెడ్డి, సికింద్రాబాద్ జోన్ డీసీపీగా రక్షితామూర్తి, ఉప్పల్ జోన్ డీసీపీగా సురేష్, చార్మినార్ జోన్ డీసీపీగా కిరణ్ ఖరే, ఎల్బీనగర్ జోన్ డీసీపీగా అనురాధ, ఖైరతాబాద్ జోన్ డీసీపీగా శిల్పవల్లి, గోల్కొండ జోన్ డీసీపీగా చంద్రమోహన్, జూబ్లీహిల్స్ జోన్ డీసీపీగా రమణారెడ్డి, శంషాబాద్ జోన్ డీసీపీగా రాజేష్, షాద్‌నగర్ జోన్ డీసీపీగా శిరీష్, చేవెళ్ల జోన్ డీసీపీగా యోగేష్ గౌతం, కూకట్ పల్లి జోన్ డీసీపీగా రితిరాజ్, శేర్లింగంపల్లి జోన్ డీసీపీ గా చింతమనేని శ్రీనివాస్ , బేగంపేట్ డీసీపీ గా రక్షితమూర్తి, రాజేంద్రనగర్ డీసీపీ గా శ్రీనివాస్, ఉప్పల్ జోన్ డీసీపీ గా సురేష్ బదిలీ అయ్యారు. మొత్తం నాలుగు కమిషనరేట్ల పరిధిలో వివిధ జోన్లకు 20 మంది ఐపీఎస్ లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# హైదరాబాద్‌ఎలో ఏసీబీ రైడ్స్..

## రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ దేవాదాయ శాఖ ఇన్‌ఎస్పెక్టర్






**హైదరాబాద్ పెన్ పవర్:** అవినీతి నిరోధక శాఖ అధికారులు (ఏసీబీ) బుధవారం (జనవరి 07) పలు చోట్ల నిర్వహించిన రైడ్స్ లో అధికారులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. హైదరాబాద్ బాగ్ అంబర్ పేట్ లో దేవాదాయ శాఖ ఇన్‌ఎస్పెక్టర్ ను అక్కవరపు కిరణ్ కుమార్ ను అదుపులోకి తీసుకున్నారు. బాగ్ అంబర్ పేట్ లోని దేవాదాయ శాఖ తరపున భూమికి చెందిన సర్వే రిపోర్ట్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు నిఘా ఉంచి పట్టుకున్నారు. బాధితుడి నుంచి లక్షా 50 వేలు డిమాండ్ చేసి.. ముందుగా 50 వేల రూపాయలు తీసుకుంటుండగా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు.

**రంగారెడ్డి జిల్లాలో ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ సెక్రెటరీ:**

రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలో ఒకేసారి ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ

-4 లో

# రూ.1 లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి జిల్లా అధికారులు




- ఏసీబీకి చిక్కిన నందిగామ ఎంపీడీవో, ఏపీవో, ఈదులపల్లి కార్యదర్శి
- ఇంటి నిర్మాణానికి సంబంధించి రూ.3.5 లక్షలు డిమాండ్ చేసిన అధికారులు
- రెండోసారి రూ.1 లక్ష చెల్లిస్తుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా నందిగామ ఎంపీడీవో కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. భవన నిర్మాణానికి సంబంధించి ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటుండగా ఎంపీడీవోను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో

-4 లో

# ఖమ్మంలో బీఆర్ఎస్‌కు మరో షాక్..

## రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు



-4 లో

- ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు కార్పొరేటర్లు
- తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. ఈరోజు మరో ముగ్గురు కార్పొరేటర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# సమృద్ధిగా అందుబాటులో యూరియా నిల్వలు.. ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**అందుబాటులో 10,345 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 7**
యూరియా స్టాక్ పై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్జిల్లాలో యాసంగి సాగు అవసరాలకు సమృద్ధిగా యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేసేందుకు అన్ని మండలాల్లో సమగ్ర చర్యలు చేపట్టామని, ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 10 వేల 345 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని అన్నారు. ఇందులో 83 పిఏసిఎస్ కేంద్రాల్లో 1169.10 మెట్రిక్ టన్నులు, 100 ప్రయివేటు షాపుల్లో 525.70 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. ఇప్పటి వరకు రైతులకు 28 వేల 128 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. యూరియా పంపిణీ సంబంధిత అంశాలలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, జిల్లా యంత్రాగం, జిల్లా వ్యవసాయ శాఖ యూరియా సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఎటువంటి సమస్యలు ఉన్నా, మీ మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## రైతు మేళాలో జిల్లా రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 7**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతుల అభివృద్ధి లక్ష్యంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాజమాన్య నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతు మేళా" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ రైతు మేళా జనవరి 9, 2026 తేదీన ఉదయం 9.00 గంటలకు అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఉపయోగపడే ఆధునిక వ్యవసాయ యంత్రాలు, వివిధ పంటల్లో మెరుగైన సాగు పద్ధతులు, సహజ వ్యవసాయం, శాస్త్రీయ పద్ధతులతో ముళ్ళిముడి సాగు వంటి అంశాలపై నిపుణులచే అవగాహన కల్పించబడుతుందని తెలిపారు.
రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను స్వీకరించి, ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. ఈ రైతు మేళా ద్వారా రైతులకు అవసరమైన సమగ్ర సమాచారం ఒకే వేదికపై అందుబాటులోకి వస్తుందని చెప్పారు.
కావున జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రైతు మేళాలో రైతులు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులుపెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ ముఖ్య మంత్రి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే







ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 7:హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ని వారి నివాసం లో మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరావు తో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి సత్తుపల్లి నియోజకవర్గం లోని పలు అభివృద్ధి మరియు పలు సమస్యలు పై మరియు సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు పై మాట్లాడిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు మరియు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఏమ్మెల్యే తో రాష్ట్ర యువ నాయకులు తుమ్మల యుగంధర్ మరియు సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు మరియు సత్తుపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు....

## ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షున్ని మర్యాదపూర్వం గా కలిసిన ఆనంద్ గౌడ్



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 7**
ఖమ్మం జిల్లా డీసీసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గౌడ జర్నలిస్టుల అధ్యక్షులు.. భద్రాద్రి కొత్తగూడెం మోకు దెబ్బ ప్రెసిడెంట్. కేహెచ్ 9 న్యూస్ అధినేత.. డాక్టర్ కందుల ఆనంద్ గౌడ్... వీరితోపాటు... వైరా మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావు ... కొంతమంది సర్పంచులు... సీనియర్ జర్నలిస్ట్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు... వేల్పుల మురళి .. తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాద్‌ఎలో ఏసీబీ రైడ్స్..

-3 పేజి తరువాయి
సెక్రెటరీలు లంచం తీసుకుంటూ పట్టుబడటం సంచలనంగా మారింది. ఎంపీడివో సుమతి, ఎంపీఓ తేజ్ సింగ్, ఈదులపల్లి గ్రామ కార్యదర్శి చెన్నయ్య, ఓ భవన నిర్మాణానికి సంబంధించి రూ. లక్ష రూపాయలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. శంషాబాద్, నందిగామ గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించి రూ. లక్ష లంచం తీసుకుంటుండగా పంచాయితీ సెక్రెటరీ, వీణా, వీణా లను పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. ఓ వ్యక్తి నుండి 2.5 లక్షల లంచం డిమాండ్ చేసిన అధికారులు.. మెదట రూ. 1.5 లక్షలు తీసుకుని.. బుధవారం మరో లక్ష రూపాయలు తీసుకుంటుండగా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు.

## రూ.1 లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి జిల్లా అధికారులు

-3 పేజి తరువాయి
బొబ్బిలి ప్రవీణ్ అనే వ్యక్తి చేపట్టిన భవన నిర్మాణానికి ఎంపీడీవో సుమతి, ఏపీవో తేజ్ సింగ్, ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్యలు రూ. 3.5 లక్షల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ప్రవీణ్ గతంలో రూ. 1 లక్ష చెల్లించాడు. మిగిలిన సొమ్ము కోసం అధికారులు తన నుంచి లంచం డిమాండ్ చేస్తున్నారని అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఈరోజు ఎంపీడీవో కార్యాలయంలో మరో రూ. 1 లక్ష లంచం ఇస్తుండగా ముగ్గురినీ ఏసీబీ డీఎస్పీ పట్టుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు ని మర్యాదపూర్వకంగా కలిసిన తాటి





**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 7:**ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఐటీ & మున్సిపల్ శాఖ మంత్రివర్యులు శ్రీ కల్వకుంట్ల తారక రామారావు ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసిన లిబూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమం లో మాజీ పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు పువ్వాడ అజయ్ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు...

## బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్పవర్ జనవరి 7** :బుధవారం ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ సర్పంచుల ఉప సర్పంచుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైరా నియోజకవర్గ స్థితిగతులు, కాంగ్రెస్ పార్టీ పాలన పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత, ముఖ్యంగా రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులు, పార్టీ చేస్తున్న పోరాట కార్యక్రమాలు వారికి వివరించినట్లు తెలిపారు. రాబోయే మున్సిపాలిటీ, స్థానిక ఎన్నికలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ పార్టీ గెలుపు కోసం అనుసరించవలసిన వ్యూహాలను కేటీఆర్ సూచించారని, ప్రజా వ్యతిరేకతను ఓటుగా మలుచుకుంటే బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికలలో జడ్పీటీసీ,ఎంపీటీసీ అత్యధిక స్థానాల్లో గెలుస్తుందని గిరిబాబు తెలిపారు.

## హైదరాబాద్ ముఖ్య మంత్రి నివాసం లో సత్తుపల్లి ఎమ్మెల్యే



**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 7** లిసత్తుపల్లి ని నూతన జిల్లా గా ఏర్పాటు చెయ్యాలి అని తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం అందించిన.....సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మరియు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్

## ఖమ్మంలో బీఆర్ఎస్‌కు మరో షాక్.. రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు

-3 పేజి తరువాయి
కార్పొరేటర్లు ధనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవిలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదివరకే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు సీహెచ్ లక్ష్మీ, జి. చంద్రకళ, డి. సరస్వతి, అమృతమ్మ, ఎం.శ్రావణి కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

# కేటీఆర్ బాష మార్చుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** రాహుల్ గాంధీ ని ఆ భాష లో విమర్శిస్తున్నారంటే కేటీఆర్ సహనం పరాకాష్ట కి చేరిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. అసహనం లో మీ ఓపికను కోల్పోయి మీ ఓటముల పరంపర కొనసాగుతున్న సందర్భంలో రాహుల్ గాంధీ ని విమర్శించడం ద్వారా పెద్దోడు అయిత అనుకుంటున్నావ్. రాహుల్ గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబం. స్వేచ్ఛ,స్వాతంత్ర్యం కోసం , అనంతరం దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన కుటుంబం. రాహుల్ గాంధీ మనసు కి సంబంధించిన విషయంలో ఇటువంటి భాషా వాడితే గొప్ప వాడివి కావు.. నీ యొక్క గౌరవాన్ని పోగొట్టుకుంటున్నావ్ కేటీఆర్. రాహుల్ గాంధీ ని ఈవిధంగా విమర్శించడం మానుకో. రాజకీయాల్లో విమర్శలు ,ప్రతి విమర్శలు ఉంటాయి.. కానీ ఈవిధంగా భాషను ఉపయోగించి మీకు ఉన్న అసహనాన్ని ఫ్రస్టేషన్ చూపించే ప్రయత్నం చేస్తున్నారు దానిని మానుకోవాలి. జాగ్రత్త.. రాహుల్ గారిని ఈవిధంగా విమర్శిస్తే ప్రజలే మీకు బుద్ధి చెబుతారు. ఇప్పటికే ప్రజలు అనేకసార్లు బుద్ధి చెప్పారు కేటీఆర్ అని హెచ్చరిస్తున్ననని అన్నారు...

## షాపుల్లో లేని యూరియా యాప్ లలో ఎలా వస్తుంది

## కమీషన్లకు కక్కుర్తి పడుతున్న ముగ్గురు మంత్రులు

**ఖమ్మం: పెన్ పవర్:** ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ నూతన సర్పంచులు, ఉప సర్పంచుల అభినందన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, హరిప్రియ నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు దిండిగల రాజేందర్, ఖమర్, మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎండగట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాలు లేవు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్లలో చెప్పులు కనిపిస్తున్నాయి. షాపుల్లో లేని యూరియా యాప్లలో ఎలా వస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలు. కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇచ్చారా? ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చారా? రెండేళ్లలో ఏం అభివృద్ధి జరిగింది? కూల్చివేతలు, ఎగవేతలే కనిపిస్తున్నాయి. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ పని చేశారు. ఇప్పుడు ఇదే జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. కనీసం రైతులకు యూరియా ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నారు. కమీషన్ల కోసమే ఆ ముగ్గురు పని చేసేది. 30 శాతం ట్యాక్స్ నడిపిస్తున్నారు వాళ్లు. ఆరు గ్యారెంటీలు భద్రంగా పెట్టుకోండని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆనాడు ఎన్నికల ప్రచారంలో చెప్పారు. ఇప్పుడు రెండేళ్లు అయినా గ్యారెంటీలు అమలు కాలేదు. దీనికి భట్టి ఏమి సమాధానం చెబుతారు? అని అన్నారు. ఆనాడు కేసీఆర్ ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో సీతారామ సాగర్ ప్రాజెక్టు పనులను 90% పూర్తి చేశారు. కానీ ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు కమీషన్ల కోసం కక్కుర్తి పడి ఆ ప్రాజెక్టును పక్కన పెట్టేశారు. 30% కమిషన్ వసూలు చేసి జేబులు నింపుకోవడమే తప్ప.. జిల్లాకి పనికొచ్చే పనులు చేయడంలేదు. ఆనాడు కాంగ్రెస్ గ్యారెంటీ కార్డును అత్యంత భద్రంగా దాచి పెట్టుకోమన్నాడు భట్టి విక్రమార్క. హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు.. మరి రెండేళ్ళు అవుతుంది మీ హామీలు ఎక్కడ పోయాయి? ఇప్పుడు గ్యారెంటీ కార్డు ఎక్కడ పెట్టాలని అన్నారు.

# అది జరగాలంటే చైనా, రష్యాతో సంబంధాలు తెంచుకోవాలి..

### వెనెజువెలాకు ట్రంప్ టీమ్ షరతులు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండో దఫా పాలనలో విదేశాంగ విధానం ద్వారా తన ఆకాంక్షలను తీర్చుకునే పనిలో పడ్డారు. రాత్రికి రాత్రి వెనెజువెలా పై కమాండో దాడి జరిపి ఆ దేశ అధ్యక్షుడిని, ఆయన భార్యను బందీలుగా అమెరికాకు తరలించి ట్రంప్ తన పంతం నెరవేర్చుకున్నారు. అంతటితో ఆగని ట్రంప్.. దక్షిణ అమెరికా దేశాన్ని మొత్తం తానే నియంత్రిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రభుత్వానికి ట్రంప్ కీలక హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. వెనెజువెలా కొత్త నాయకత్వం చైనా, రష్యా, ఇరాన్, క్యూబాలతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం. అంతేకాదు, చమురు ఉత్పత్తిలో అమెరికాతో మాత్రమే భాగస్వామ్యం చేయాలని, ముఖ్యంగా హెవీ క్రూడ్ ఆయిల్ విక్రయాల్లో అమెరికాకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. వెనెజువెలా చమురు ఉత్పత్తిని పెంచుకోవాలంటే తాను పెట్టిన ఈ షరతులు పాటించాలని ట్రంప్ టీమ్ స్పష్టం చేసినట్లు ఏబీసీ న్యూస్ నివేదిక వెల్లడించింది. 'మొదట ఆ దేశం (వెనెజువెలా) చైనా, రష్యా, ఇరాన్, క్యూబాతో ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలి. రెండోది.. వెనెజువెలా చమురు ఉత్పత్తిలో అమెరికాతో ప్రత్యేక భాగస్వామిగా ఉండేందుకు, భారీ ముడి చమురు విక్రయాల్లో అమెరికాకు అనుకూలంగా ఉండేందుకు అంగీకరించాలి' అని ట్రంప్ టీమ్ షరతులు పెట్టినట్లు సదరు నివేదిక పేర్కొంది.

# కొడుకు కాదు కిరాతకుడు..

**మెదక్ జనవరి 7, పెన్ పవర్:** :డబ్బుపై మోజుతో ఓ కొడుకు కన్న తండ్రినే హత్య చేసిన ఘటన మెదక్ జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే పాపన్న పేట (మం) సీతానగర్ గ్రామానికి చెందిన లంగాడి లక్ష్మయ్య అనే వ్యక్తి వ్యవసాయంతో పాటు ఓ లైన్‌మెన్ వద్ద ప్రైవేటు సహాయకుడిగా పని చేస్తున్నాడు. లక్ష్మయ్యకు భార్య శేఖమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పెద్దకుమారుడు శ్రీకాంత్ వివాహం, వ్యవసాయం కోసం పొలం వద్ద వేసిన బోర్లు కారణంగా తండ్రి అప్పులు పాలయ్యాడు. ఇదిలా ఉండగా అటు పెద్ద కొడుకు శ్రీకాంత్ సైతం తరచూ తనకు డబ్బులు కావాలని తండ్రి లక్ష్మయ్యతో గొడవపడేవాడు. డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని తండ్రిని బెదిరించిన దాఖాలు కూడా ఉన్నట్టు శ్రీకాంత్‌పై ఆరోపణలు ఉన్నాయి. అయితే సోమవారం రాత్రి లక్షయ్య ఇంటికి రాగా,ఆయను కుమారుడు మళ్లీ డబ్బులు అడిగాడు. తన దగ్గర డబ్బులు లేవని తండ్రి చెప్పడంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగి గొడవ జరిగింది. ఈ క్రమంలోనే శ్రీకాంత్ సుత్తితో తండ్రి పై దాడి చేశాడు. గమనించిన తల్లి అడ్డు వచ్చి శ్రీకాంత్ చేతిలో ఉన్న సుత్తి లాక్కుంది. దీనితో అక్కడే ఉన్న కర్రతో మళ్లీ తండ్రిపై దాడి చేశాడు శ్రీకాంత్. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్య.. హాస్పిటల్‌కు తరలించేలోపే మృతి చెందాడు. ఇక సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భూపాలపల్లి జిల్లాను తీసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి..


**వాడలో తిరిగితే మున్సిపల్ అధికారుల అలసత్వం కనిపిస్తుంది... మాజీ ఎమ్మెల్యే గండ్ర**

**జయశంకర్ భూపాలపల్లి. పెన్ పవర్:** బస్తీబాటకార్యక్రమంలో భాగంగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు కార్లమార్క్స్ కాలనీ లో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బస్తీ బాట కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ...భూపాలపల్లి ప్రాంతంలో గతంలో మంచినీటి సమస్య ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలుసు. ఆ పరిస్థితిని గమనించి, పూర్తి స్థాయిలో సమస్యకు పరిష్కారం చూపిన నాయకత్వం కేసిఆర్ దే అని చెప్పక తప్పదు. ఈరోజు భూపాలపల్లి నియోజకవర్గం లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన గోదావరి జలాలు అందుతున్నాయంటే, అది కేసిఆర్ దూరదృష్టి గల పాలన ఫలితం. అదే విధంగా, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాను ప్రతి ఇంటికీ అందించిన ఘనత కూడా కేసిఆర్ ప్రభుత్వానికే దక్కుతుంది. కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేసిన ప్రభుత్వం ఇది. ఒకప్పుడు చిన్న గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న భూపాలపల్లి ఈరోజు జిల్లా స్థాయికి ఎదగడం, ఒక ఎస్పీ, ఒక కలెక్టర్‌తో పరిపాలన కొనసాగించగలగడం ఇవన్నీ కేసిఆర్ పాలనలో సాధ్యమయ్యాయి. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విజ్ఞులైన భూపాలపల్లి పట్టణ ప్రజలు, జిల్లా ప్రజలు గమనించాలి. ఇలాంటి ప్రజావిరుద్ధ నిర్ణయాలకు భూపాలపల్లి ప్రజలు గట్టి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఈరోజు ఎంతైనా ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 33 జిల్లాలు ఏర్పాటు చేసి ఇప్పటికే పది సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇంత కాలం తర్వాత మళ్లీ జిల్లాలపై కొత్త ముచ్చట్లు ఎందుకు తెరపైకి తెస్తున్నారు? దీని వెనుక ఉద్దేశ్యం ఏమిటి? అనే ప్రశ్నలకు ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేయాల్సిన అవసరం ఉందని భూపాలపల్లి ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో గెలవడం కోసం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ ఈరోజు అమలయ్యాయా అని ప్రజలు ఆలోచించాలి. ఇక్కడ ఉన్నా ఆడబిడ్డలను అడుగుతున్న నెలకు రూ. 2500 ఇస్తామని చెప్పిరు కదా, ఇప్పటివరకు ఆ హామీ నెరవేరిందా? వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ. 4000 పెన్షన్ ఇస్తామని ప్రకటించారు, అది ఎక్కడ అమలైంది...?
హామీలు ఇవ్వడం కాదు వాటిని అమలు చేయడమే అసలైన పాలన. భూపాలపల్లి ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు, అవసరమైతే సరైన సమయం లో సరైన సమాధానం ప్రజాస్వామ్య బద్ధంగా బదులు ఇస్తారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేను ఇక్కడ మాటలతో కాలయాపన చేయడానికి రాలేదు. వాస్తవాలను మీకు చెప్పడం కొరకు వచ్చా..మన ముందే మీడియా మిత్రులు ఉన్నారు. ప్రజల గొంతును బయటకు తీసుకెళ్లే బాధ్యత ఈరోజు మీడియాపై కూడా ఉంది. ఈరోజు ప్రజల సమస్యలకు ఏ విధమైన పరిష్కారం చేయకుండా, అహంకారంతో, దురహంకార ధోరణితో పాలన సాగిస్తే ఈ నియోజకవర్గంలో వ్యవస్థ నడవదు అని స్పష్టంగా హెచ్చరిస్తున్నాం.
ప్రజలను నిర్లక్ష్యం చేసి పాలన కొనసాగించడం ఇక సాధ్యం కాదు. రేపో మాపో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి ఇక్కడ ఉన్నా కొంతమంది నాయకులు ఇందిరమ్మ ఇళ్ళ లిస్ట్, పెన్షన్ లిస్ట్ తయారు చేసుకోని ఇగో ఎమ్మెల్యే సార్ సంతకం పెట్టిండు ఇగ మాకు ఓటు వేస్తె ఈ లిస్టులో పేరు ఉంటది లేదంటే నీకు ఏ పథకం రాదు అని బెదిరిస్తారు. మీరు భయపడవద్దు వచ్చిన వాళ్ళని గల్లా పట్టి గత రెండు ఏండ్లుగా ఎందుకు చేయలేదని మీరు ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. అందుకే సోదర సోదరీమణులు ఈ విషయంపై ఆలోచన చేయాలి. ఈ 24వ వార్డులో గతంలో సీలింగ్ సర్ప్లస్ భూముల్లో మీరు అందరూ ఇళ్లను నిర్మించుకున్న సమయంలో, నేను ప్రభుత్వంతో పోరాడి మీ అందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ జరిగేలా చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాం.
ఆ పోరాటాల ఫలితంగానే ఈ రోజు మీ హక్కులు మీకు వచ్చాయి, ఈ కాలనీలో మంచి అభివృద్ధి చెందడంతో పాటు మీ భూములకు మంచి ధరలు ఉన్నాయి. కాబట్టి అందరూ ఈ విషయాన్ని గుర్తుంచుకుని ఆలోచన చేయాలి. కేసీఆర్ తెలంగాణ హక్కుల కోసం, తెలంగాణ అభివృద్ధి కోసం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేసి భూపాలపల్లి వంటి మారుమూల ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా అభివృద్ధి చేశారు. ఈ రోజు భూపాలపల్లి జిల్లాలో అభివృద్ధి ఎలా ఉందో ప్రతి ఒక్కరూ వచ్చి చూడవచ్చు. కలెక్టర్ కార్యాలయం కావచ్చు, డిగ్రీ కళాశాల కావచ్చు, జూనియర్ కళాశాల కావచ్చు, అంతేకాదు ఒక మెడికల్ కాలేజ్ కూడా భూపాలపల్లి వంటి మారుమూల ప్రాంతానికి రావడం అంటే ఇది చిన్న విషయం కాదు. గతంలో కేవలం ఒక సెంటర్‌గా ఉన్న భూపాలపల్లి, ఈ రోజు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లతో కూడిన వైద్య సేవలు అందించే స్థాయికి ఎదిగింది. ఇలాంటి గొప్ప విద్యా వైద్య సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమయ్యాయి అనే విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.
కాబట్టి మీరందరూ కూడా ఒకసారి ఆలోచన చేయాలి. గతంలో మొదలై ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మీకందరికీ తెలుసు. ఈ రోజు అంబేద్కర్ సెంటర్‌లో జరుగుతున్న కార్యక్రమాలను, అలాగే ఈనాడు పత్రికలో వచ్చిన వార్తలను గమనించాలి. భూపాలపల్లి పట్టణాభివృద్ధి కోసం నేను తెచ్చిన నిధులకు శంకుస్థాపనలు వేస్తావ్, టెండర్ పిలిచి పనులు ప్రారంభం అయిన వాటిని నీకు కాంట్రాక్టర్ మర్యాద చేయలేదని ఆ పనులు క్యాన్సిల్ చేసి నీ ఊరికి తీసుకెళ్ళి పట్టణాభివృద్ధిని అడ్డుకుంటున్నావ్. నిజంగా భూపాలపల్లిని అభివృద్ధి చేయాలనే సంకల్పం ఉంటే, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కొత్త నిధులు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్. ఈ రోజు ఈ ప్రభుత్వంలో రైతులు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయం చేసుకునే రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారు. సాగునీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు కూడా రైతులను వేధిస్తున్నాయి. ఈ కష్టాలు పోవాలంటే రైతుబంధు పథకం మళ్లీ అమలులోకి రావాలి అంటే, ఈ రోజు అధికార పార్టీ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు కాబట్టి రైతులకు న్యాయం జరగాలంటే అధికార పార్టీకి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
అందుకే ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్‌ను, కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలపరచాలి.
అప్పుడే రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.
అదే విధంగా మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి మెడలు వంచి ఇచ్చిన హామీలు అమలయ్యేలా చేసేందుకు భారత రాష్ట్ర సమితి పార్టీ ఎప్పుడు ప్రజలకి అండగా ఉంటుంది అని అన్నారు.

# ప్రభాస్, చిరంజీవి నిర్మాతలకు హైకోర్టులో ఊరట..

# టికెట్స్ పెంపుపై నిర్ణయం ఏంటంటే..

**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:**
రెండు బడా సినిమాలే. రెండూ కూడా సంక్రాంతి బరిలో దూసుతున్నవే. అయితే, టికెట్ రేట్లు పెరుగుతాయా? బెనిఫిట్ షోలు ఉంటాయా? ఈ అభ్యర్థనపై హైకోర్టు ఏం చెప్పబోతోంది? అనేది గత నిన్నటి నుంచి నెలకొన్న సందేహం. తాజాగా ఈ విషయంలో ది రాజాసాబ్, మన శంకరవరప్రసాద్ గారు సినిమా నిర్మాతలకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల విషయంలో గతంలో సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు పుష్ప 2, ఓజీ, గేమ్ ఛేంజర్, అఖండ 2 సినిమాలకే పరిమితం చేసింది. దీంతో ఇప్పుడు సంక్రాంతికి విడుదలయ్యే సినిమా నిర్మాతలుక ఊరట లభించినట్టైంది ఈసారి సంక్రాంతి పండక్కి భారీగానే సినిమాలు విడుదలవుతున్నాయి. అయితే రాజాసాబ్, మన శంకరవరప్రసాద్ గారు సినిమా టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇప్పించాలంటూ ఈ రెండు సినిమాల నిర్మాతలు వేరు వేరుగా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. గతంలో టికెట్ ధరలపై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈ రెండు సినిమాల నిర్మాతలు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ వేర్వేరుగా పిటిషన్ వేశారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల కోసం హోంశాఖ కార్యదర్శికి దర్ఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా



హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. అయితే దీనిపై బుధవారం విచారణ జరిగింది. ఈ విచారణలో గతంలో ఇచ్చిన తీర్పును ఆ చిత్రాల వరకే పరిమితం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది న్యాయస్థానం. దీంతో ఈ రెండు సినిమాలకు టికెట్ ధరలు పెంచుకునే అవకాశం లభించింది. కానీ హోంసెక్రటరీకి ఎలాంటి డైరెక్షన్ ఇవ్వలేమని తేల్చింది హైకోర్టు. ఇప్పుడు హోంశాఖ అనుమతి ఇస్తుందా లేదా అనే ఉత్కంఠ నెలకొంది. ఇదివరకే టికెట్ రేట్ల పెంపు కోసం తమ దగ్గరకి రావొద్దన్న మంత్రి కోమటిరెడ్డి.. ఇప్పుడు సంక్రాంతి సినిమాలపై ఫైనల్‌గా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఆసక్తి నెలకొంది

# వంట చేయలేదని... విడాకులు

**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:**
తన భార్య వంట చేయట్లేదని.. తన తల్లికి ఇంటి పనుల్లో సహకరించట్లేదని.. దీనిని పరిగణలోకి తీసుకుని.. విడాకులు మంజూరు చేయాలంటూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో హైకోర్టు షాకింగ్ తీర్పు ఇచ్చింది. ఈ ఘటన హైదరాబాద్లోని ఎల్బీనగర్ పరిధిలో జరిగింది. భార్యవల్ల హింసకు గురవుతున్నాంటూ హైదరాబాద్ ఎల్బీనగర్కు చెందిన వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దానిని కింది కోర్టు కొట్టేయడంతో హైకోర్టులో అప్పీలు చేసుకున్నాడు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టి తీర్పు ఇస్తూ భర్త అప్పీలును కొట్టేసింది. భర్త మధ్యాహ్నం 1 నుంచి 10 వరకు.. భార్య 9 నుంచి 6 వరకు ఉద్యోగంలో ఉంటే.. ఉదయాన్నే ఆమె వంట చేయలేదనే కారణంతో విడాకులు కోరడం సరికాదని తెలిపింది. భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్న పరిస్థితిలో వంట చేయకపోవడాన్ని 'క్రూరత్వం'గా పరిగణించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. భార్య, భర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు వంట చేయకపోవడం, తల్లికి సహకరించలేదన్న కారణంతో విడాకులు ఇవ్వడం కుదరదని తెలిపింది తెలంగాణ హైకోర్టు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు జాబ్ చేసే భార్య వంట చేయకపోవడం, అత్తకు వంట పనుల్లో హెల్ప్ చేయకపోవడం హింస కిందకి రాదని తెలిపింది. ఈ కారణాల వల్ల వివాహాన్ని రద్దు చేయలేమని తీర్పు ఇచ్చింది. ఈ మధ్యకాలంలో భార్య భర్తలు ఇద్దరూ జాబ్స్ చేస్తేనే కుటుంబం ఆర్థికంగా ముందుకు వెళ్తుంది. అలాంటప్పుడు ఆమె జాబ్ చేసి.. ఇంటిపనులు చేయట్లేనదని.. వంట చేయట్లేదని అనడం సరికాదనే వాదనను తెలంగాణ హైకోర్టు మరోసారి ఈ తీర్పుతో స్పష్టం చేసింది.

### రంగారెడ్డి జిల్లాలో దారుణం

రంగారెడ్డి జిల్లా, యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రేమ వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. నిన్న ప్రియురాలు ఉరి వేసుకుని మరణించగా, నేడు ప్రియుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనతో రెండు కుటుంబాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది. మేడిపల్లి గ్రామానికి చెందిన మహేశ్ (20), ఓ బాలిక (16) గత నాలుగు నెలలుగా ప్రేమలో ఉన్నారు. బాలిక ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మహేశ్‌తో ఆమె ప్రేమలో పడింది. ఈ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో వారిద్దరినీ కొంతకాలం పాటు కలవకుండా చేశారు. పెద్దలు తమ ప్రేమను అంగీకరించి పెళ్లి చేయడం లేదని మనస్తాపానికి గురైన ఆ ప్రేమ జంట, గతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇద్దరూ తమ ఇళ్లలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. అయితే, ఇరువురు కూడా ప్రాణాపాయం నుండి సురక్షితంగా బయటపడ్డారు. తాజాగా, సోమవారం మహేశ్ బాలికకు ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. దీంతో మనోవేదనకు గురైన బాలిక మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణించిన విషయం తెలుసుకున్న మహేశ్, ఈరోజు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని మృతి చెందాడు.

# విద్యార్థినిపై ప్రిన్సిపాల్ రేప్

**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:** సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన విద్యాసంస్థ అధినేతే కీచకుడిగా మారిన ఘటన హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో కలకలం రేపింది. పదో తరగతి చదువుతున్న ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రైవేట్ పాఠశాల యజమానిని పోలీసులు అరెస్ట్ చేశారు. చంద్రగిరినగర్‌లోని 'నిస్సీ స్వాతి' ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, అదనపు తరగతుల సాకుతో ఓ విద్యార్థినిని పాఠశాల భవనంపైనే ఉన్న తన నివాసానికి పిలిపించుకునేవాడు. అక్కడ సదరు బాలికతో ఇంటి పనులు చేయించుకోవడమే కాకుండా, ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేసేవాడు. కొన్ని రోజులుగా బాలిక ప్రవర్తనలో మార్పును గమనించిన తల్లిదండ్రులు ఆరా తీయగా, ప్రధానోపాధ్యాయుడి అకృత్యం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, బంధువులతో పాటు విద్యార్థి సంఘాల నేతలు మంగళవారం పాఠశాల వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. ఘటనపై విజయ్‌కుమార్‌ను నిలదీయగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఆందోళనకారులు అతడికి దేహశుద్ధి చేశారు. సమాచారం అందిన వెంటనే సీఐ వెంకటేశం ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. దీనిపై స్థానిక ఎంఈవో జెమినీ కుమారి స్పందిస్తూ.. ఈ ఉదంతాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎన్నికలకు సిద్ధమవుతున్న పురపాలికలు

**రంగారెడ్డి, జనవరి 7, పెన్ పవర్:** మేడ్చల్ జిల్లాలో మున్సిపాలిటీలలో ఎన్నికల కొలాహలం మొదలైంది. జిల్లాలో ఎన్నికలు జరుగుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నప్పటికీ అధికారులు ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తుండడంతో ఆశావహులు సైతం సిద్ధమవుతున్నారు. జిల్లాలో కేవలం మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా ప్రత్యేక పరిస్థితుల్లో ఇటీవల ఏర్పడ్డాయి.గతంలో జిల్లాలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్ లు, 9 మున్సిపాలిటీలో ఉండేవి. ఇవి రింగురోడ్డు లోపల, రింగ్ రోడ్డు ని ఆనుకొని ఉండడంతో ప్రభుత్వం ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. అంతకుముందు జిల్లాలోని గ్రామపంచాయతీలన్నీ మున్సిపాలిటీలలో విలీనం చేసింది. రింగ్ రోడ్డు బయట ఉన్న గ్రామాలను కలిపి ఎల్లంపేట, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలు ఏర్పాటు చేసింది. జిల్లాలో మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నందున ఇవి కూడా జిహెచ్ఎంసి లో కలుస్తాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండడంతో పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మూడు మున్సిపాలిటీలలో ఓటరు జాబితా ముసాయిదాలు వెల్లడించారు. ఓటరు జాబితా పై ఈ నెల 5 వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి అదే రోజు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలలో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీల గుర్తులతో జరుగుతాయి. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు బీఫామ్ అవసరం. దీంతో ఆయా పార్టీల నియోజకవర్గ బాధ్యులను కలిసి తమ అంతరంగాన్ని వెల్లడిస్తున్నారు. ఈ మూడు మున్సిపాలిటీలు మేడ్చల్ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఎల్లంపేట, మూడు చింతలపల్లి లలో 24 వార్డులు చొప్పున, అలియాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి.పోటీ చేయాలనుకునేవారు గ్రౌండ్ వరకు కూడా చేసుకుంటున్నారు. పార్టీల నాయకులు సైతం కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు హరి వర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ నిర్వహించారు. వీరు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల క్రితం ఎంపీ ఈటెల రాజేందర్ బిజెపి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి అందరూ ఐక్యంగా ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో రిజర్వేషన్లపై ఉత్కంఠ ఏర్పడింది. ఈ మూడు కొత్త మున్సిపాలిటీలలో చైర్మన్ పదవి, వార్డ్ మెంబర్ పదవులు ఏ కేటాగిరికి రిజర్వేషన్ అవుతుందనే విషయంలో ఆశావాహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్ సస్పెన్స్ ఉన్నప్పటికీ ఆశావహులు పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని భావిస్తున్నారు.

# కార్నర్ లో కార్...




**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:** నిన్నమొన్నటి వరకు ఆమె టార్గెట్ హరీశ్‌రావు. అప్పుడప్పుడు కేటీఆర్‌పై అటాక్. మధ్యలో సంతోష్‌పై సెటైర్లు. కానీ ఇప్పుడు అక్క..డైరెక్ట్‌గా గులాబీ బాస్‌పైనే బాణాలు ఎక్కు పెడుతోంది. పెద్ద సార్ టార్గెట్‌గానే..ఇంకా చెప్పాలంటే కల్వకుంట్ల ఫ్యామిలీ లక్ష్యంగానే ఆమె రాజకీయ పోరాటం ఉండబోతుందన్నది చెప్పకనే చెప్పేస్తోంది. కానీ కవిత కామెంట్స్‌పై కల్వకుంట్ల ఫ్యామిలీ నుంచి మాత్రం నో రియాక్షన్. కవిత రోజు రోజుకు డోస్ పెంచుతున్నా బీఆర్ఎస్ కీలక నేతలెవరూ స్పందించడం లేదు. ఇదే ఇప్పుడు కారు పార్టీలో హాట్ టాపిక్‌గా మారుతోంది.కారులో ఉన్నప్పుడే అందరినీ కార్నర్ చేసింది. ఒక్క అధినేతను వదిలిపెట్టి..హరీశ్, కేటీఆర్, సంతోష్‌ను..వరుసపెట్టి అటాక్ చేస్తూ వచ్చింది కవిత. ఇక బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాక..ఆమె విమర్శల దాడి ఇంకా ఎక్కువైంది. ఎక్కడికెళ్లినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులే టార్గెట్ గా ఆరోపణలు చేస్తూ వస్తున్నారు కవిత.అయినా హరీశ్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్యనేతలెవరూ ఆమె కామెంట్స్‌పై అస్సలు రియాక్ట్ కావడం లేదు. లేటెస్ట్ మండలి వేదికగా కవిత మాట్లాడిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకు హరీష్ రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ముఖ్యనేతలందరిపైనా విమర్శలు చేస్తూ వస్తున్న కవిత ఇప్పుడు మరింత స్పీడ్ పెంచారు. మొన్నటివరకు కేసీఆర్ దేవుడని, తన హీరో అని చెప్పిన కవిత..ఇప్పుడు ఆయనపైన ఇండైరెక్ట్ అటాక్ చేయడం చర్చకు దారితీస్తోంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు నేరుగా తీసుకోకపోయినా ఆయనపై విమర్శలు చేశారు కవిత. శాసనమండలి సాక్షిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనపై సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయం అంటూ పరోక్షంగా కేసీఆర్‌ను కార్నర్ చేసే ప్రయత్నం చేశారు కవిత. తెలంగాణను ఏం ఉద్దరించామని టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాలకు వెళ్లారంటూ మండలిలో ఉచ్చరించకూడని భాషతో తండ్రి కేసీఆర్‌ను ప్రశ్నించారామె.కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ, పాలనపై కవిత చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు, విమర్శలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముందు హరీశ్‌రావు, తర్వాత కేటీఆర్, ఇప్పుడు నేరుగా అధినేత కేసీఆర్‌ను అంటే మొత్తం కేసీఆర్ ఫ్యామిలీనే కవిత టార్గెట్ చేస్తున్నా..వాళ్లేవరు ఆమె కామెంట్స్‌పై ఎందుకు స్పందించడం లేదన్నది బీఆర్ఎస్ వర్గాల నుంచి ఎదురవుతున్న ప్రశ్న.కవిత వ్యాఖ్యలు, ఆమె చేసిన ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీకి ఎంతో కొంత నష్టాన్ని కలిగిస్తాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారట. ఆమె శాసన మండలిలో కన్నీళ్లు పెట్టుకుని మరీ అధినేత కేసీఆర్ సహా పార్టీపై, తొమ్మిదిన్నరేళ్ల పాలనపై ఆరోపణలు చేయడంపై గులాబీ లీడర్లు ఆందోళన చెందుతున్నారట. కవిత ఇంతలా సీరియస్ కామెంట్స్ చేసినా..అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎందుకు రియాక్ట్ కావడం లేదన్నది బీఆర్ఎస్ నేతలకు, క్యాడర్‌కు అంతుచిక్కడం లేదట.కవిత వ్యాఖ్యలపై పార్టీ నుంచి ఎంత మంది మాట్లాడినా ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు స్పందిస్తే ఎఫెక్ట్ వేరేగా ఉంటుందని చర్చించుకుంటున్నారట. లేకపోతే బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ఇదే సమయంలో కవిత ఆరోపణలను అధినేత కేసీఆర్ కాకపోయినా కనీసం కేటీఆర్, హరీశ్‌రావు ఖండించకపోతే పార్టీకి నష్టం జరగడంతో పాటు ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు అస్త్రాలుగా మారతాయన్న ఆందోళన వ్యక్తమవుతోందటపార్టీ మహిళా నేతలతో కవితకు కౌంటర్ ఇప్పించినా అది ప్రజల్లోకి వెళ్లదని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై ఆమె ఆరోపణలు చేస్తున్నారు కాబట్టి వాళ్లు సమాధానం చెప్తేనే బాగుంటుందన్న ఒపీనియన్స్ వస్తున్నాయట. అయితే కవిత అంతలా ఫ్యామిలీ మెంబర్స్‌ను టార్గెట్ చేస్తున్నా వాళ్లు మౌనంగా ఉండటం వెనుక ఆంతర్యం వేరే ఉందన్న టాక్ వినిపిస్తోంది. కవిత ఎంత కాదనుకున్నా తమ కుటుంబ సభ్యురాలేనని, అధినేత కేసీఆర్ కూతురు కాబట్టి..ఆమె ఎన్ని ఆరోపణలు చేసినా కేటీఆర్, హరీశ్‌రావు మౌనంగా ఉండాల్సి వస్తోందట.కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో లేకున్నా తమ ఫ్యామిలీ మెంబరే కావడంతో ఆమెపై తాము మాట్లాడటం సరికాదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కవిత ఇలా అధినేత కేసీఆర్‌పైనా తీవ్ర ఆరోపణలు చేస్తున్నా మౌనంగా ఉంటే బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌తో పాటు జనంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో కవిత దూకుడు ఎలా ఉంటుందో..బీఆర్ఎస్ రియాక్షన్ ఇంకెలా ఉంటుందో వేచి చూడాలి.

# రబ్బీ సాగుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**జయశంకర్ భూపాలపల్లి. పెన్ పవర్:** :రబీ సాగుకు నీటి లభ్యత, ఎరువుల సరఫరాపైఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో బుధవారం ఐడీఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మొక్కజొన్న 29 వేల ఎకరాలు, వరి 97,570 ఎకరాల్లో సాగవుతున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. యూరియా కొరత లేదని స్పష్టం చేస్తూ, ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచే యూరియా విక్రయాలు ప్రారంభించాలన్నారు. విత్తనాలు, ఎరువుల అందుబాటును నిరంతరం తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,600 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని, అవసరాన్ని బట్టి ఎప్పటికప్పుడు ఇండెంట్లు పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు

ఇబ్బందులు లేకుండా రద్దీ నియంత్రణకు అదనపు యూరియా కౌంటర్లు ఏర్పాటు చేయాలని, అలాగే ఒకేసారి కాకుండా విడతల వారీగా యూరియా పంపిణీ చేయాలని తెలిపారు.

వేసవి కాలంలో మైనర్, మేజర్ నీటి వనరుల కింద పంటల సాగు, నీటి లభ్యత తదితర అంశాలపై వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఇరిగేషన్ అధికారులు బసవ ప్రసాద్, తిరుపతిరావు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఇరిగేషన్ డీఈలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డిపై విమర్శలను ఖండించిన బీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:** అల్వాల్ బీజేపీ నాయకులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అల్వాల్ బిఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.

అల్వాల్ బీజేపీ నాయకులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై చేసిన విమర్శలను ఖండిస్తూ అల్వాల్ బిఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం నుండి నిధుల సమీకరణకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఎంతగానో ఉందని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యల పై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విక్రమార్కుడిలా నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. రైల్వే వలయంలోని సమస్యల పరిష్కారానికి ఆర్ యూ బి కోసం కృషి చేసారని కేంద్రం నుండి నిధులు సమీకరించి అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఏదైనా అనుమానం ఉంటే డిబేట్ కి సిద్ధం అని తెలిపారు.బీజేపీ నాయకులు నిజాలు తెలుసుకోకుండా ఏది పడితే అది మాట్లాడొద్దని హెచ్చరించారు. ఎమ్మెల్యే గురించి తప్పుగా మాట్లాడితే దేనికైనా సిద్ధం అని బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన అజారుద్దీన్

**హైదరాబాద్ పెన్ పవర్:** :దేశంలో క్రికెట్ ఉన్నంత మోజు చెప్పలేనిది. అజారుద్దీన్ లాంటి గొప్ప వ్యక్తిని ఇండియా క్రికెట్ కు హైదరాబాద్ అందించిందని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. వి హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన రాజీవ్ గాంధీ ఆల్ ఇండియా అండర్ 19 టీ-ట్వంటీ క్రికెట్ ఛాంపియన్షిప్ ను క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అంబర్పేట్ వాటర్ వర్క్స్ గ్రౌండ్ లో టోర్నమెంట్ కు మహ్మద్ అజారుద్దీన్ హజరై హైదరాబాద్, బెంగళూరు టీంలకు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి అజారుద్దీన్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, అంబర్పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రోహిన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతా రోహిత్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా మహేష్ కుమార్ గౌడ్ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్, ఎమ్మెల్యే శ్రీ గణేష్, రోహిన్ రెడ్డి కొద్దిసేపు క్రికెట్ ఆడి సందడి చేశారు.

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్, వి హనుమంతరావు మాట్లాడుతూ ఆటలకు ఆదరణ చాలా ఉందనీ, ఆటల పట్ల సీఎంకు చాలా మక్కువ ఉందన్నారు. సీఎం ఆటలకు ఎక్కువ ఆదరణ ఇస్తున్నారు విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ముఖ్యమని, విద్యార్థులకు శారీరక శ్రమ లేక మానసికంగా ఎదగలేకపోతున్నారన్నారు. క్రీడలు ఆడితేనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

# సీఎస్కే ల్యాబ్ పై అధికారుల దాడి పరారీలో ల్యాబ్ ఓనర్




**హైదరాబాద్ పెన్ పవర్:** మంగళవారం అర్ధరాత్రి కాచిగూడ లోని సీఎస్కే ల్యాబ్స్ పై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు, ఈస్ట్ జోన్ పోలీసులు, క్లూస్ టీమ్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ల్యాబ్ లోని సిబ్బందిని ప్రశ్నించి మేకలు, గొర్రెల రక్తం నిల్వలు, కొనుగోలు పత్రాలు, ఇతర రికార్డు లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ దందాలో కీలక సూత్రధారిగా భావిస్తున్న సీఎస్కే ల్యాబ్ ఓనర్ నికేశ్ రెండు రోజుల ముందే పారిపోయాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నికేశ్ దొరికితే ఈ దందాలో ఇంకా ఎవరెవరున్నారనేది బయటపడే అవకాశం ఉంది.

## వికారాబాద్ లో 25 నుంచి 31 వరకు అతి రుద్ర మహా యజ్ఞం సప్తాహ మహోత్సవం



**వికారాబాద్: పెన్ పవర్:** విశ్వకళ్యాణమే లక్ష్యంగా గత 15 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక సేవా మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏటా పవిత్ర కార్తీక మాసంలో రుద్రాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పార్వతీ పరమేశ్వరుల ప్రీత్యర్థం, సనాతన వైదిక ధర్మ వైభవాన్ని చాటే విధంగా స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా తేది 25 ఆదివారం నుంచి 31 శనివారం వరకు అతి రుద్ర మహా యజ్ఞం సప్తాహ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ మహోత్సవంలో మహాగణపతి హోమం, శతచండీ యాగం, రాజశ్యామల హోమం, మహాసుదర్శన చతుర్వేద స్వాహాకార సహిత అతిరుద్ర స్వాహాకార యాగం, సంకల్పిత హవనాలు నిర్వహించనున్నారు. అలాగే మహామంగళహారతి, వేదసేవఆశీర్వచనాలు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైదీక బ్రహ్మశ్రీ శ్రీరామశర్మ (స్మార్తాగ్నితపది) పాల్గొననున్నారు.అలాగే ఈ విశేష ఆధ్యాత్మిక కార్యక్రమంలో పీఠాధిపతులు శ్రీమన్ని రంజన ప్రణవస్వరూప డా. చెన్నబసవ ప్రభు మహాస్వాములు (ఆలంపల్లి & దుధని కంపిన మఠం), వైరాగ్యశిఖామణి అవధూత గిరి మహారాజ్, శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం, బర్దీపూర్ పీఠాధిపతులు, మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్, ఆదిత్య పరాశ్రీ స్వామివారు (అంబాత్రయ క్షేత్రం), పూజ్యశ్రీ భిక్షమయ్య గురూజీ శ్రీ సత్యసాయి ధ్యాన మండలి, విజయవాడ పాల్గొని భక్తులను ఆశీర్వదించనున్నారు.ఈ కార్యక్రమ నిర్వహణలో భోగేష్ పంతులు, జ్యోషి సుభాష్ చంద్రకాంత్ శర్మ, మ్యాడం వెంకటేశం, కౌకుంట్ల రామకృష్ణ, తాండూరి రాజు, చిగుళ్ళపల్లి రమేష్ ముఖ్య నిర్వాహకులుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అతి రుద్ర మహా యజ్ఞ ఫలితాన్ని పొందాలని నిర్వాహకులు కోరారు.

## ఆలయ చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

**హైదరాబాద్ పెన్ పవర్:** సర్దార్ పటేల్ నగర్ లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన దొంగతనం కేసులో దర్యాప్తు ప్రారంభించామని కూకట్ పల్లి ఏసిపి రవికిరణ్ రెడ్డి వెల్లడించారు. కేపి.హెచ్.బి సీఐ రాజశేఖర్ రెడ్డి, డి ఐ రవితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు యాక్టివ్ ద్వారా వచ్చి గుడి లోనికి ప్రవేశించి మూలవిరాట్ కు సంబంధించిన వెండి బంగారు ఆభరణాలు దొంగలించారని వెల్లడించారు. ఇప్పటికే ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని అన్నారు. అలాగే నిర్వాహకుల ప్రకారం సుమారు 40 లక్షల రూపాయల విలువచేసే వస్తువులు దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారని వాటిపైన దర్యాప్తు కొనసాగించామన్నారు.

## వృద్ధురాలిపై దాడి పది తులాల బంగారం దోపిడి




**హైదరాబాద్ పెన్ పవర్:** సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్మాన్ఘాట్ లో ఒంటరిగా నివసిస్తున్న సుగుణ అనే 68 ఏళ్ల వృద్ధురాలిపై స్ప్రే తో దాడి చేసి సుమారు 10 తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన సంఘటనర్ పోలీస్ స్టేషన్లో జరిగింది. వృద్ధురాలికి పరిచయస్తురాలైన సుమిత్ర అనే మహిళ మరో ఇద్దరితో కలిసి ఒంటరిగా ఉన్న వృద్ధురాలు ఇంటికి వెళ్లి ముఖంపై స్ప్రే తో దాడి చేసి అపస్మారక స్థితిలోకి చేరిన తర్వాత తన ఒంటిపై ఉన్న పది తులాల బంగారంతో ఉదాయించారు .వృద్ధురాలు ఫిర్యాదు మేరకు సుమిత్ర ను అదుపులోకి తీసుకున్న సరూర్నగర్ పోలీసులుచ ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు...

## ఏడు గేదేల చోరీ

**హైదరాబాద్ పెన్ పవర్:** పరిగి మున్సిపల్ పరిధిలో పశువుల దొంగలు రెచ్చిపోయారు. మల్కాపూర్ శివారులో ఒ పొలం వద్ద ఉన్న షెడ్డులోంచి ఏకంగా ఏడు గేదేలను చోరీ చేసారు. బుధవారం ఉదయం పాలు పితకడానికి వచ్చి చూడగా గేదేలు లేకపోవడంతో రైతు అవాక్కైయాడు. ఓ భారీ వాహనం ఆ ప్రాతంలో తిరిగినట్టు ఆనవాళ్లు గుర్తించారు. పశువుల మెడలకు ఉన్న తాళ్ళను కోసి చోరీ చేసినట్లు గుర్తించారు. పాడి రైతు శివానంద్ పోలీసులు ఫిర్యాదు చేసాడు. గేదేల విలువ దాదాపు ఏడు లక్షలు ఉంటుందంటున్నాడు.

## దాసారం బస్తీలో ఎమ్మెల్యే తలసాని పర్యటన

**హైదరాబాద్ పెన్ పవర్:** మీరు ఎవరికి భయపడొద్దు. మీకు అండగా ఉంటామని మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ దాసారం బస్తీ గుడిసె వాసులకు భరోసా ఇచ్చారు. ఇటీవల సనత్ నగర్ లోని దాసారం బస్తీలో గుడిసె వాసులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి తమ గుడిసెలు ఖాళీ చేయాలని కొంతమంది వ్యక్తులు భయబ్రాంతులకు గురి చేస్తున్నారని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి దాసారం బస్తీలో పర్యటించి స్థానిక గుడిసె వాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం బ్రతుకు దెరువు కోసం నగరానికి వచ్చి ఈ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరు నగరంలోని వివిధ ప్రాంతాలలో చెత్తను సేకరిస్తూ పారిశుధ్య నిర్వహణ తో పాటు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. గుడిసెలు ఏర్పాటు చేసిన స్థలం మాది అని ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు వారు, మాదే ఈ స్థలం అంటూ కొందరు ప్రయివేట్ వ్యక్తులు గుడిసె వాసులను ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. 2014 లో తాను ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యే గా ఎన్నికైన తర్వాత గుడిసె వాసులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వచ్చామని గుర్తు చేశారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో విద్యుత్, త్రాగునీటి సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటూ స్థానికంగా ఓటు హక్కును కూడా కలిగి ఉన్నారని వివరించారు. మీరు అంతా ఐక్యంగా ఉండాలని, ఎవరికి భయపడాల్సిన పని లేదని స్పష్టం చేశారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అవసరమైతే మీ తరపున న్యాయపోరాటం కూడా చేస్తామని ప్రకటించారు. మీ ఇల్లు, మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా మీతో పాటు మీ పరిసరాలలోని ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

# 8 వేల కోట్లతో మంచినీటి సరఫరాకు ప్రణాళికలు

**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:** హైదరాబాద్ సిటీలో తాగునీటి ఎద్దడి లేకుండా, అన్ని ప్రాంతాలకు నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు జలమండలి రూ. 8,000 కోట్ల భారీ వ్యయంతో ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. హైదరాబాద్ నగరానికి నీటిని అందించే కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా మరియు జంట జలశయాల (ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్) వనరులను ఒకే గొడుగు కిందకు తెస్తూ, నగరం చుట్టూ 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ప్రధాన పైపులైన్లు వేసి, దానికి అనుసంధానంగా మరో 96 కిలోమీటర్ల మేర అంతర్గత నెట్‌వర్క్‌ను నిర్మించడం ద్వారా నగరం నలుమూలలకూ నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారుగతంలో కేవలం జంట జలశయాలపై ఆధారపడిన నగరం, ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల నుండి నీటిని పొందుతోంది. అయితే, ఏదైనా ఒక ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు జరిగినా లేదా సాంకేతిక సమస్యలు తలెత్తినా ఆయా ప్రాంతాల్లో సరఫరా పూర్తిగా నిలిచిపోతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు 'రింగ్ మెయిన్' వ్యవస్థ కీలకం కానుంది. దీనివల్ల ఒక మార్గంలో అంతరాయం కలిగినా, ఇతర వనరుల నుండి నీటిని మళ్లించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయవచ్చు. రాబోయే రెండేళ్లలో గోదావరి 2, 3 దశలు కూడా అందుబాటులోకి రానుండటంతో, ఈ రింగ్ మెయిన్ ద్వారా 24 గంటల పాటు సమాన ఒత్తిడితో నీటిని అందించడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.హైదరాబాద్ సిటీకి అంతరాయం లేని తాగునీటి సరఫరాను అందించేందుకు ప్రతిపాదించిన అత్యంత కీలకమైన పైపులైన్ నెట్‌వర్క్‌ను 'రింగ్ మెయిన్' అని పిలుస్తారు. ప్రధానంగా హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ ప్రధాన పైపులైన్‌ను ఒక వలయంలా ఏర్పాటు చేస్తారు. ఇది నగరంలోని పలు ప్రాంతాలను కలుపుతూ ఉండే ప్రత్యేక పైపులైన్లతో అనుసంధానమై ఉంటుందిసాధారణంగా ఏదైనా ఒక ప్రధాన పైపులైన్ దెబ్బతింటే ఆ ప్రాంతానికి నీటి సరఫరా నిలిచిపోతుంది. కానీ, ఈ రింగ్ మెయిన్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే, ఒక దిశలో మరమ్మతులు జరుగుతున్నప్పటికీ, వలయంలా ఉన్న ఇతర పైపులైన్ల ద్వారా నీటిని మళ్లించి నిరంతరాయంగా సరఫరా చేయడానికి వీలుంటుందని అధికారులు ప్లాన్ చేశారు. దీనివల్ల నగరవ్యాప్తంగా నీటి పంపిణీలో ఎలాంటి అవాంతరం లేకుండా నియంత్రించవచ్చు.హైదరాబాద్ నగరానికి ప్రస్తుతం రోజుకు సుమారు 600 మిలియన్ గ్యాలన్లు పైగా నీటి అవసరం ఉంది. కృష్ణా (మూడు దశలు), గోదావరి (మొదటి దశ) ద్వారా మెజారిటీ అవసరాలు తీరుతున్నాయి.రిజర్వాయర్లు నిర్మాణం: రింగ్ మెయిన్ ప్రాజెక్టులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి కీలక ప్రాంతాల్లో భారీ స్టోరేజ్ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. ఇది భవిష్యత్తులో పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది.డిజిటల్ మానిటరింగ్: ఈ కొత్త పైపులైన్ వ్యవస్థలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నా లేదా నీటి ఒత్తిడి తగ్గినా వెంటనే గుర్తించేలా అత్యాధునిక స్కాడా టెక్నాలజీని ఉపయోగించే అవకాశం ఉంది. భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని తగ్గించి, ఉపరితల జలాలను (నదీ జలాలు) శాస్త్రీయంగా వినియోగించుకోవడం ఈ ప్రాజెక్ట్ మరో ముఖ్య ఉద్దేశ్యం.

# వేములవాడలో సంచార జాతుల సమ్మేళనం

**వేములవాడ: పెన్ పవర్:** సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో వేములవాడ పద్మావతి కల్యాణ మండపంలో వేములవాడలోని 12 సంచార జాతి కులాల కుటుంబాల సమ్మేళనం జరిగింది. దీనికి అఖిల భారత సమరసతా కళా విభాగం రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యంత నిరుపేదలు,రాజ్యాంగ ఫలాలు అందకుండా నిర్లక్ష్యం చేయబడిన ఈ సంచార జాతి కులాల పట్ల తరతరాలుగా వివక్షతకొనసాగుతున్నదని,అందువల్ల తెలంగాణాలో సంచార జాతి ప్రజల మధ్య సమరసాతా వేదిక సర్వే నిర్వహించి వారి సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తుందని చెప్పారు. సంచారా జాతి పిల్లలకు హైదరాబాద్ లో ఉచిత విద్య అందిస్తున్నామని తెలిపారు. చదువుకున్నప్పుడే సంచార జాతర కుటుంబాల్లో సరియైన జీవన వికాసం పెంపొందించుకుంటారని, సంచార జాతులకు నిజమైన రిజర్వేషన్లు ప్రతీక ఆర్థిక బడ్జెట్ రాష్ట్రం కేటాయించాలని పేర్కొన్నారు.
అనంతరం రాష్ట్ర వైద్యుల సంఘం కార్యదర్శి డా సురేంద్ర బాబు మాట్లాడుతూ పిల్లల్ని చదివించాలని, బిక్షాటన మానెయ్యాలని,స్వాభిమానంగా బ్రతకాలని చెప్పారు. అనంతరం సంచార కుటుంబాలకి చలికాలం నుండి రక్షించుకోవడానికి 200 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేందర్ బాబు, కొల్లూరి రామారావు, బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సంటి మహేష్, రాష్ట్ర నాయకులు గోపు బాలరాజు, సంతోష్ కుమార్, సామాజిక సమరసత కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనవరి 9వ తేది నుండి ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్లు జారీ

**హైదరాబాద్ పెన్ పవర్:** భక్తుల సౌకర్యార్థం, పరిపాలనా అవసరాల దృష్ట్యా టీటీడీ శ్రీవాణి దర్శన టికెట్ల జారీ విధానంలో మార్పులు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు తిరుమలలో ఆఫ్‌లైన్ కౌంటర్ల ద్వారా జారీ చేస్తున్న టికెట్లను జనవరి 9 నుండి రోజువారి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో కేటాయించనున్నారు.

ఈ మేరకు తిరుమలలో రోజువారి విధానంలో ఆఫ్‌లైన్ ద్వారా జారీ చేస్తున్న 800 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్‌లైన్ ద్వారా రోజూవారి కరెంట్ బుకింగ్‌లోకి మార్చనున్నారు. ఈ టికెట్లను ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసి, మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. టికెట్ పొందిన భక్తులు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.
ఒక్క కుటుంబానికి 1+3 సభ్యులు (మొత్తం నలుగురు) మాత్రమే టికెట్ బుకింగ్‌కు అనుమతి ఉంటుంది. టికెట్ల బుకింగ్ లో దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఆధార్ ధృవీకరణ, మొబైల్ నంబర్ వంటి వివరాలు తప్పనిసరి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ విధానంలో భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. తద్వారా ఆఫ్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్ల కోసం భక్తులు క్యూలైన్ లో నిరీక్షించే సమస్య తొలగిపోతుంది. ఈ నూతన విధానాన్ని నెల రోజులపాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.అదేవిధంగా రోజుకు 500 శ్రీవాణి దర్శన టికెట్లను ఆన్ లైన్ అడ్వాన్స్ బుకింగ్ విధానంలో ఇప్పటికే విడుదల చేయడం జరిగింది. మూడు నెలల అనంతరం ఈ విధానంపై సమీక్షించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.తిరుపతి విమానాశ్రయంలో ప్రతిరోజూ భక్తులకు ఆఫ్ లైన్ విధానంలో జారీ చేస్తున్న 200 టికెట్ల జారీ విధానం కూడా యథావిధిగా కొనసాగనుంది.అన్ని వర్గాల భక్తులను దృష్టిలో ఉంచుకుని టీటీడీ తీసుకున్న నిర్ణయాన్ని గమనించి భక్తులు తమ దర్శన ప్రణాళికలను రూపొందిచుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది.

# జిఎస్టి ఎగవేత కేసులపై చర్యలను ముమ్మరం చేసిన డిజిజిఐ

**హైదరాబాద్ పెన్ పవర్:** జీఎస్టీ ఎగవేత కేసులపై అధికారులు చర్యలు వేగవంతం చేసారు. ఆరెంజ్ ట్రావెల్స్, ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు జీఎస్టీని వసూలు చేసి ప్రభుత్వానికి అందజేయలేదని నిర్ధారించారు. ఆరెంజ్ ట్రావెల్స్ 28.24 కోట్లు, ట్రిలియన్ లీడ్ రూ.22 కోట్ల వరకు వసూలు చేసినట్లు గుర్తించారు. గడువు ముగిసిన మూడు నెలలైనా ఆరంజ్ ట్రావెల్స్, ట్రిలియన్ లీడ్ జీఎస్టీ కట్టలేదు. ఈ నేపధ్యంలో ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని సునీల్ కుమార్,ట్రిలియన్ లీడ్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చేతన్ ను పోలీసులు అరెస్టు చేసారు. సిజిఎస్టి చట్టం 2017 నిబంధన కింద సునీల్ కుమార్, శ్రీ చేతన్ ఇద్దరిని అరెస్టు చేశారు

# తెలంగాణలో మరో ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

### మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన 8 మంది విద్యార్థులు

**నిజామాబాద్: పెన్ పవర్:** తెలంగాణలో మరో ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ నమోదయింది. నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద గ్రామంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పితో బాధపడుతున్న విద్యార్థులను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పంతం నెగ్గించుకున్న కవిత



**హైదరాబాద్, జనవరి 7 పెన్ పవర్:**
నిజామాబాద్ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజీనామా చేసిన విషయం తెలిసిందే. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసి నాలుగు నెలలు గడిచింది. ఎట్టకేలకు ఆమె రాజీనామాను ఆమోదించారు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి. అసెంబ్లీ సమావేశాలు నిరవదిక వాయిదా పడిన కొద్ది కాసేపట్లోనే కవిత రాజీనామాకు ఆమోదం తెలుపుతున్నట్లు నోటిఫికేషన్ జారీ చేశారు లెజిస్లేటివ్ సెక్రటరీ. 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి శాసనమండలి సభ్యురాలిగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు. బీఆర్ ఎస్ పార్టీతో అంతర్గత విభేదాల కారణంగా గత ఏడాది సెప్టెంబర్ 3వ తేదీన ఆ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. గడచిన సోమవారం శాసనమండలికి చివరిసారిగా హాజరై, తన రాజీనామాను ఆమోదించాలంటూ శాసన మండలి చైర్మన్ ను విజ్ఞప్తి చేశారు.చివరిసారి తాజాగా తెలంగాణ శాసన మండలిలో భావోద్వేగంగా ప్రసంగించిన కల్వకుంట్ల కవిత , తన రాజీనామా విషయంపై స్వయంగా చైర్మన్ కోరినా వినలేదు. తొందరపడకండి, ఆవేశంలో నిర్ణయాలు తీసుకోవడం సరికాదు, మీరు బాధలో ఉన్నారు. మరోసారి రాజీనామాపై పునరాలోచించండి అంటూ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కవితకు చివరిసారి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆమె వినలేదు. తాను రాజకీయాల్లోకి అమెరికా నుంచి ఎందుకు వచ్చాను, తెలంగాణ ఉద్యమ సమయంలో జాగృతి ఏర్పాటు చేయడంతోపాటు, ఉద్యమానికి , బీఆర్ ఎస్ పార్టీకి జాగృతి చేసిన కృషి గురించి మండలిలో చివరి ప్రసంగంలో మాట్లాడారు కవిత. తన తండ్రి స్థాపించిన బీఆర్ ఎస్ పార్టీలో తాను మొదటి నుంచి ఎదుర్కొంటున్న అవమానాలను ప్రస్తావిస్తూనే, బీఆర్ ఎస్ ప్రభుత్వంలో భారీ అవినీతి జరిగిందంటూ మండలిలో సంచలన ఆరోపణలు చేశారు. కుటుంబ సభ్యుల నుంచి మద్దతు లేకుండా ఇన్నాళ్లు తాను ఎదుర్కొన్న సవాళ్లను సభలో ప్రస్తావిస్తూ ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు కవిత. ఉబికి వస్తున్న కన్నీళ్లతో తన ప్రసంగం ఆద్యంతం కొనసాగింది. ఇంతలా అవమానాలు ఎదుర్కొన్న తాను ఇక బీఆర్‌ఎస్ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిలో కొనసాగలేనని, తన రాజీనామా వెంటనే ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరారు కవిత. కవిత మాటకు స్పందించిన చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారించే ప్రయత్నం చేసినా కవిత వినలేదు. ఇప్పటికే నాలుగు నెలలు రాజీనామా ఆమోదం కోసం ఎదురు చూశానని, అన్ని విషయాలు ఆలోచించిన తరువాతే ఈ నిర్ణయం తీసుకున్నానని, వెనక్కు తగ్గబోనని స్పష్టం చేశారు. కవిత రాజీనామా విషయంలో నిర్ణయం మార్చుకోవడం కష్టమని భావించిన శాసన మండలి చైర్మన్ తాజాగా ఆమె రాజీనామాకు తెలుపుతూ నోటిఫికేషన్ విడుదల చేయడంతో కవిత పంతం నెగ్గించుకున్నట్లైంది.

### మరో ఉపఎన్నిక...

ఉత్కంఠకు తెరపడింది. జాగృతి అధ్యక్షురాలు కవిత రాజీనామాకు ఆమోద ముద్ర పడింది. కవిత రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదించారు. గతేడాది సెప్టెంబర్ 2న బీఆర్‌ఎస్ పార్టీ కవితను సస్పెండ్ చేసింది. ఆ వెంటనే 3వ తేదీన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కవిత ప్రకటించారు. 2022 జనవరిలో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో బీఆర్‌ఎస్ కు ఫుల్ మెజార్టీ ఉంది. నాడు కాంగ్రెస్ పోటీ చేయలేదు, బీజేపీ కూడా అభ్యర్థిని నిలపలేకపోయింది. ఆ పరిస్థితుల్లో కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2028 వరకు కవిత పదవీ కాలం ఉంది. అయితే రెండున్నర సంవత్సరాల పదవీ కాలం ఉండగానే ఆమె రిజైన్ చేసేశారు. ఇప్పుడు కవిత రాజీనామాకు ఆమోద ముద్ర పడటంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. తెలంగాణలో మరో ఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. కవిత రాజీనామాకు ఆమోదం లభించడంతో కౌన్సిల్‌లో ఓ స్థానం ఖాళీ అయినట్టు ఎన్నికల కమిషన్‌కు చైర్మన్ కార్యాలయం నుంచి సమాచారం వెళ్లింది. దీంతో ఆ స్థానం భర్తీ కోసం కొన్ని రోజుల్లోనే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందికవిత రిజైన్ తో ఉపఎన్నిక అనివార్యమే అయినా స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాకే బైపోల్ జరిగే అవకాశం ఉంటుంది. ప్రజాప్రతినిధులు ఓటు వేయాలంటే మొదట స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎంపిక కావాల్సి ఉంటుంది.ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది రాష్ట్ర ప్రభుత్వం. త్వరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కోసం సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ లెక్కన నిజామాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఓటర్లు లేరు. దీనివల్ల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఇప్పుడే నిర్వహించడం సాధ్యం కాదు. మున్సిపల్ కార్పొరేటర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటు వేయాల్సి ఉంటుంది కాబట్టి..
పరిషత్ ఎన్నికలు ముగిశాకేడ పాలక మండళ్లు కొలువుదీరిన తర్వాతే ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కనీసం మూడు, నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.బీఆర్‌ఎస్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న కవిత.. తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, ఈ ఎన్నికల్లో ఆమె పోటీ చేయకపోవచ్చనే విశ్లేషణ వినిపిస్తోంది.డిసెంబర్ నెలలో పంచాయతీ ఎన్నికలు ముగియడంతో రాష్ట్రంలో మిగతా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రెడీ అవుతోంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు ముగియగానే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

# ఆత్మగౌరవ నినాదం - తెలంగాణ సెంటిమెంట్

**హైదరాబాద్, జనవరి 7, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత శాసనమండలి వేదికగా కన్నీరు పెట్టుకోవడం, ఆ వెంటనే తెలంగాణ జాగృతి ని రాజకీయ శక్తిగా మారుస్తానని ప్రకటించడం వెనుక అత్యంత పకడ్బందీగా రూపొందించిన ఎమోషనల్ పొలిటికల్ స్ట్రాటజీ కనిపిస్తోంది. కుటుంబ బంధాలను తెంచుకున్నట్లు ప్రకటించడం ద్వారా ఆమె ఒక రకమైన సానుభూతి వాతావరణాన్ని సృష్టించుకునే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో సానుభూతి అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. కవిత తన ప్రసంగంలో పుట్టింటి నుంచి అవమానభారంతో బయటకు వచ్చాను అని చెప్పడం ద్వారా తనను ఒక బాధిత ఆడబిడ్డ గా చిత్రించుకున్నారు. తెలంగాణ సమాజంలో ఆడబిడ్డలకు, సెంటిమెంట్‌కు ఇచ్చే ప్రాధాన్యతను ఆమె సరిగ్గా వాడుకున్నారు. ముఖ్యంగా కుటుంబ పెద్దల నుంచి లేదా సొంత పార్టీ నుంచి తనకు అన్యాయం జరిగిందని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన పట్ల ఒక రకమైన సానుభూతి కలిగేలా చేయడంలో ఆమె ప్రాథమికంగా విజయం సాధించారుకవిత తన పోరాటాన్ని నేరుగా బీఆర్‌ఎస్ నాయకత్వంపైకి మళ్లించడం ద్వారా ఆ పార్టీలో ఉన్న అసంతృప్త నేతలకు, క్యాడర్‌కు ఒక దిక్సూచిగా మారాలని చూస్తున్నారు. ప్రశ్నిస్తే కక్షగడతారా అనే ప్రశ్న వేయడం ద్వారా బీఆర్‌ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని ఆరోపించారు. ఇది కేవలం పార్టీపై కోపం మాత్రమే కాదు, బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకును లేదా అసంతృప్త నాయకత్వాన్ని తన వైపు తిప్పుకోవడానికి వేసిన ఒక వ్యూహాత్మక అడుగు. కవిత కొత్త పార్టీ పెడుతున్నట్లు ప్రకటించడం హఠాత్తుగా జరిగింది కాదు. చాలా కాలంగా ఆమె జాగృతి ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు దానికి రాజకీయ రంగు అద్దడం ద్వారా, తనకంటూ ఒక సొంత సైన్యం ఇప్పటికే సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చారు. కేవలం సెంటిమెంట్‌తోనే కాకుండా, గత పదేళ్లుగా తాను చేసిన సామాజిక సేవను ఓట్లుగా మలుచుకోవడానికి ఆమె ఈ వేదికను వాడుకున్నారు.తెలంగాణ రాజకీయాల్లో ఆత్మగౌరవం అనేది ఎప్పుడూ కీలకం. కవిత గారు తన నిర్ణయాన్ని తన వ్యక్తిగత గౌరవానికి మించి, తెలంగాణ ఆడబిడ్డల పౌరుషానికి, ఆత్మగౌరవానికి ముడిపెట్టారు. ఇది ఆమెకు కేవలం సానుభూతిని మాత్రమే కాదు, ఒక పోరాట పటిమ గల నాయకురాలిగా గుర్తింపును తెస్తుంది. బంధనాలు తెంచుకున్నాను అని చెప్పడం ద్వారా తాను ఎవరికీ లొంగని, స్వతంత్ర
రాజకీయ శక్తిగా ఎదగబోతున్నానని ఆమె ప్రకటించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది, బీఆర్‌ఎస్ , బీజేపీలు ప్రతిపక్షంలో ఉన్నాయి. అయితే, ఒక బలమైన ప్రాంతీయ గొంతుక లేదా ప్రత్యామ్నాయ శక్తి కోసం చూస్తున్న వర్గాలను ఆకర్షించడానికి కవిత ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా సామాజిక తెలంగాణ కోరుకునే వారు, సెక్యులర్ భావజాలం ఉన్నవారు, యువతను లక్ష్యంగా చేసుకుని ఆమె తన అజెండాను ప్రకటించారు.కవిత ప్రాథమికంగా సానుభూతి వాతావరణాన్ని సృష్టించుకోవడంలో విజయవంతమయ్యారు. కానీ, రాజకీయాల్లో కేవలం కన్నీళ్లు లేదా ఎమోషనల్ స్పీచ్‌లు మాత్రమే గెలుపును అందించవు. ఆ సానుభూతిని క్షేత్రస్థాయిలో ఓట్లుగా మార్చగలిగే బలమైన కేడర్ , స్పష్టమైన రాజకీయ కార్యాచరణ ఆమెకు అవసరం. మె ఒంటరి పోరాటం ఎంతవరకు సఫలమవుతుందనేది రాబోయే రోజుల్లో ఆమె ప్రకటించే పార్టీ విధివిధానాలపై ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు.

# చంపేస్తున్న చలి



**వరంగల్, జనవరి 7, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అయితే తెలంగాణ రాష్ట్రంలో చలి పులి చంపేస్తోంది. రాగల రోజుల్లో చలి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ.. రోజురోజుకీ పెరుగుతున్న చలి తీవ్రతకి వృద్ధులు, చిన్న పిల్లలు అధికంగా అనా రోగ్యానికి గురవుతున్నారు. చలి అంటే అందరికీ సహజసిద్ధమైన ఋతువు. కానీ చల్లని గాలులు, ఉదయాన్నే కమ్మేసే పొగమంచు, రాత్రివేళల్లో చలికాలం తెచ్చే వణుకు ఇవన్నీ శరీరానికి కొంత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. సాధారణంగా చలి కాలం ఆనందదాయకమైనదే అయినా, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోకపోతే పులిలా దాడి చేసే ప్రమాదం ఉంటుంది.అందుకే ఈ సీజన్ను సరిగ్గా ఎదుర్కోవడం చాలా అవసరం. అయితే ములు గు జిల్లాలో ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాం తం కాబట్టి చుట్టూ పక్కన పల్లెల్లో చలి తీ వ్రత రోజురోజుకు చలి విపరీతంగా పెరిగిపోతోంది. ప్రతిరోజు తెల్లవారుజామున పొగ మంచు విపరీతంగా పడుతోంది. ఈ పొగమంచుకి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ చలి తీవ్రతకి మండలంలోని గ్రామాల ప్రజలు బయటికి రావడం లేదు. వృద్ధులు, చిన్నారులు మాత్రం అనారోగ్యబారిన పడుతున్నారు.చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్న పిల్లలపైనే అధిక ప్రభావం పడే అవకాశాలు ఎక్కువగా ఉంది. వృద్ధులు, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు చలి ప్రభావానికి ఎక్కువగా గురవుతారు. శరీర ఉష్ణోగ్రత త్వరగా తగ్గిపోవడం వల్ల వారిలో శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, దమ్ము వంటి వ్యాధులు తలెత్తే అవకాశం ఉంది. చలికాలంలో బిగుతైన, వేడిగా ఉంచే దుస్తులు ధరించడం తప్పనిసరి. చిన్నపిల్లల్లో గురక, ఎగశ్వాస, జలుబు, డబ్బు వంటి లక్షణాలు అధికంగా ఉంటుంది. శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడతారు. ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారు చల్లని వాతావరణంలో ఎక్కువసేపు ఉండకూడదు. బయటకు వెళ్లేటప్పుడు ముక్కు, చెవులు, మెడ కప్పుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోరువెచ్చని నీటిని తరచూ త్రాగడం, పొడి వాతావరణంలో తేమను నిలుపుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.చలికాలంలో శరీరం వేడిని కోల్పోతుంది. అందుకే వేడి పానీయాలు, సూపులు, గోరువెచ్చని నీరు తాగడం శరీర రక్షణకు ఉపకరిస్తుంది. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

# వైసీపీలో అమలాపురం ఫైట్

**కాకినాడ, జనవరి 7, పెన్ పవర్:** సాధారణంగా ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీట్లు దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు.. దానికోసం ప్రచార అస్త్రాలతోపాటు ప్రజలతో మమేకమవ్వడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. అధినేతలను, ముఖ్యనేతలను కలుసుకుని తన గుర్తింపును పదిలపరచుకోవడం వంటివి చూస్తుంటాం.. కానీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ సీపీ లో పరిస్థితి దీనికి భిన్నంగా మారింది.. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల కాలం ఉన్నా వైసీపీ నాయకులు వైసీపీ అసెంబ్లీ సీటు కోసం నానా హైరానా పడుతున్నారు.. బరిలో మేమున్నామంటే మేమున్నామంటూ నియోజకవర్గ సమన్వయకర్తతో సంబంధం లేకుండా ఎవరికివారు తమ ఉనికిని చాటుకునేందుకు కాపాడుకునేందుకు వీర ప్రయత్నాలు చేస్తున్నారు.. 2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాజయం తరువాత చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు.. ఇదే తీరు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలోకూడా కనిపించింది.. అయితే వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మార్పు తరువాత అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది.. అమలాపురం నియోజకవర్గంలో తిరుగులేని పాత్ర పోషించిన మాజీ మంత్రి విశ్వరూప్ నియోజకవర్గానికి దూరమవ్వడం.. ఆయన కుమారుడు శ్రీకాంత్ నాయకత్వాన్ని అంగీకరించని కొందరు పార్టీ నేతలు పక్కచూపులు చూడడం.. మొత్తం మీద నియోజకవర్గంలో వైసీపీ ఐక్యతా రాగం బీటలువారి రిజర్వుడు కేటగిరిలో ఉన్న కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.. ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన జగన్ జన్మదిన వేడుకలో ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ అసహనం వ్యక్తం చేస్తూ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయముందని, అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.. అంటే అమలాపురం వైసీపీలో సీటు కోసం హీటు పెరిగిందా అన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.. అమలాపురం పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా పోటీచేసి విజయం సాధించిన మాజీ ఎంపీ చింతా అనురాధ ఇటీవల కాలంలో తన స్పీడు పెంచారు.. మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో నియోజకవర్గానికి చాలా కాలం దూరమయ్యారు.. అయితే ఎన్నికల సమయంలో మాత్రం అడపా



దడపా ప్రచారంలో పాల్గొన్న అనురాధ మొత్తం మీద సీఈసీ సభ్యురాలిగా పదవిని తెచ్చుకోగలిగారు. దీంతో అప్పటి నుంచి స్పీడు పెంచిన అనురాధ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.. ఓ పక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రత్యేకంగా తన వర్గంతో పరామర్శల నుంచి పలుకరింపుల వరకు ఒక్క రోజులో అనేక చోట్ల చుట్టేస్తున్నారు.. అంతటితో ఆగక సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎంపీ అనురాధ వెంట నడుస్తున్నవారిలో ఎక్కవ మంది గతంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గమే ఉండడం కనిపిస్తోంది.. ఉప్పలగుప్తంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలో మాజీ మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఫోటోలు లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అక్కడి వారు చింతా అనురాధా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు చెప్పకనే చెప్పినట్లయ్యింది.. గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని తరచూ కలవడం, ఇటీవల జరిగిన జగన్ జన్మదిన వేడుక సందర్భంగా భారీ స్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటిలానే కనిపించినా ఈ ఏడాది అయితే మరింత జోరు పెంచినట్లు కనిపిస్తోంది.. అయితే గత కొన్ని నెలలుగా ఒకప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిలో కొంత మంది రమణారావు వెంట కనిపిస్తున్నారు.. జగన్ అజెండాతో కొంత మంది పార్టీ యువత చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం, నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేయడంతోపాటు ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఉనికిని చాటుకునేందుకు మరింత స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది.. ఇదిలా ఉంటే మాజీ ఎంపీ అనురాధ, రమణారావు పలు కార్యక్రమాలకు కలిసి పాల్గొనడం ఆ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇంచార్జ శ్రీకాంత్ కానీ, ఇతర ముఖ్యనేతలు కనిపించకపోవడంపై చర్చ సాగుతోంది..నియోజకవర్గంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గంలో చాలా మంది పక్కచూపులు చూడడం ఇంతకాలం అసంతృప్తితోనే ఆయన వెంట నడిచారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఓటమి తరువాత అందులోనూ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాధ్యతల మార్పు తరువాత వర్గీయులకు వంక దొరికిందా అన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆశపడి భంగపడ్డ వారు, అధికారంలో ఉన్నప్పుడు తమకేమీ ఉపయోగపడలేదన్న అసంతృప్తితోనే దూరమవుతున్నట్లు కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది.. అయితే ముఖ్య అనుచరగణంలో కొందరు మాత్రం విశ్వరూప్ వెంటే ఉండగా విశ్వరూప్ స్థానికంగా పెద్దగా ఉండకపోవడంతో వారు ఇటీవలకాలంలో సైలెంట్ అవుతున్నారు.. ఇక తప్పక నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ పిలుస్తున్నప్పుడు వెళ్లి హాజరవుతున్నట్లు తెలుస్తోంది.. రాబోయే ఎన్నికల పండుగ కోసం ఎదురు చూస్తున్న కొందరు వైసీపీ నాయకులు ముందే కూసిన కోయిల చందంగా ప్రచారార్భాటాలతో దూసుకుపోతుండగా మీరు కోనసీమకు మళ్లీ రావాలంటూ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుకు కొందరు వైసీపీ నాయకులు స్వాగతం పలుకుతున్నారని తెలుస్తోంది.. సోషల్ మీడియా వేదికగా కూటమి నేతలపై విరుచుకుపడుతున్న బొజ్జా ఐశ్వర్యకు వైసీపీ బెర్త్ ఖాయం అంటూ మరికొందరు జోష్యం చెప్పడం నియోజకవర్గంలో కనిపిస్తోంది.. ఎన్నికలకు చాలా సమయం ఉన్నా మొత్తం మీద అమలాపురం వైసీపీలో మాత్రం సీట్ కోసం హీట్ కనిపిస్తోంది..

# టీడీపీ గూటికి సిద్ధా...

**ఒంగోలు, జనవరి 7, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్(పార్టీకి గుడ్ బై చెప్పారు ఒక మాజీ మంత్రి. అయితే ఏడాది కిందట ఆయన రాజీనామా చేశారు. కానీ ఇంతవరకు ఏ పార్టీలో చేరలేదు. ఇష్టమైన పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదు. మరో పార్టీలో చేరే ఉద్దేశం లేదు. దీంతో గత ఏడాదికాలంగా ఆయన భగీరథ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయితే అధినేత చంద్రబాబును కలిశారు. కానీ లోకల్ నాయకత్వం నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఇప్పుడు స్థానిక నేతలను సముదాయించారు చంద్రబాబు. దీంతో ఆ నేతకు పార్టీలో చేర్పించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఆ మాజీమంత్రి తెలుగుదేశం పార్టీలో చేరుతారని సొంత జిల్లాలో ప్రచారం జరుగుతోంది.మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అలానే ఆ పార్టీకి రాజీనామా చేశారు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన తరువాత రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరారు. అలా చేరిన క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకత్వం ఆయనకు ఒక హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే దర్శి టికెట్. గతంలో అదే నియోజకవర్గంలో నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అందుకే ఆ టికెట్ తనకు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ జగన్మోహన్ రెడ్డి అందుకు అంగీకరించలేదు. మొన్నటి ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు అయితే అయిష్టంగానే ఆ పార్టీలో కొనసాగారు రాఘవరావు. ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోయిన వెంటనే రాజీనామా ప్రకటించారు. చంద్రబాబుతో ఉన్న తన పాత సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తూ పార్టీలోకి వస్తానని కోరారు. అయితే స్థానిక నాయకత్వం నుంచి అభ్యంతరాలు ఉండడంతో చంద్రబాబు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చంద్రబాబు తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.ప్రకాశం జిల్లాలో సీనియర్ మోస్ట్ లీడర్ సిద్దా రాఘవరావు. 1999 నుంచి ఆ పార్టీలో కొనసాగుతున్నారు. 2007లో చంద్రబాబు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. 2014లో దర్శి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచేసరికి తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు రాఘవరావును. ఐదేళ్లపాటు మంత్రి పదవిలో కొనసాగిన ఆయనను 2019 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి ఎదురయ్యేసరికి రాఘవరావు వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడికి వెనక్కి తగ్గారు. దర్శి టిక్కెట్ హామీతో ఆ పార్టీలో చేరారు. కానీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. పార్టీ ఓడిపోయేసరికి రాఘవరావుకు స్వేచ్ఛ లభించింది. అందుకే ఇప్పుడు మాతృ పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నం కూడా ఫలించింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలుగుదేశం పార్టీలోకి రావడం ఖాయమని తెలుస్తోంది. కానీ దర్శికి ఇప్పటికే టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు గొట్టిపాటి లక్ష్మి. మొన్నటి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఇప్పుడు రాఘవరావు వస్తుండడంతో లక్ష్మి పరిస్థితి ఏంటి అనేది తెలియడం లేదు. చంద్రబాబు ఇద్దరికీ న్యాయం చేస్తారని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## శీతాకాల సమావేశాలెప్పుడు...

**విజయవాడ, జనవరి 7, పెన్ పవర్:** చట్టసభల్లో బలమైన వాణిని వినిపించేందుకు ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. అంటే శాసనసభ, శాసనమండలి అన్నమాట. అయితే ఏపీలో మాత్రం చట్టసభల్లో సీరియస్ నెస్ లేదు. రకరకాల కారణాలు చెప్పి సభ్యులు సభకు హాజరు కావడం లేదు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతో శాసనసభకు రామని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతిపక్షం ఉంటేనే శాసనసభకు ఒక ప్రత్యేకత వస్తుంది. అక్కడ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు ప్రజాభిప్రాయం కూడా ప్రతిపక్షం ద్వారా వ్యక్తం అవుతుంది. కానీ దురదృష్టవశాత్తు ఏపీలో ప్రతిపక్షం అంటూ లేకుండా పోయింది. కేవలం 11 అసెంబ్లీ సీట్లు రావడంతో టెక్నికల్ గా ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా రాలేదు. రాజకీయ ఉద్దేశ్యంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్నారు. అయితే గతంలో ఇదే టెక్నికల్ ఇష్యూపై మాట్లాడారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు ఆయనే ప్రతిపక్ష హోదా అడుగుతున్నారు దానిని అధిగమించి.అయితే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో శీతాకాల అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాయి. పొరుగున దాయాది రాష్ట్రమైన తెలంగాణలో సైతం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయి. అయితే ఏపీలో మాత్రం సమావేశాలు జరగలేదు. సాధారణంగా నవంబర్ నుంచి జనవరి వరకు ఈ శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. కానీ ఎందుకో ఏపీలో మాత్రం ఆ పరిస్థితి లేదు. జనవరి రెండో వారంలో సమావేశాలు ఉంటాయని అప్పట్లో వార్తలు వచ్చాయి. స్పీకర్ నుంచి కానీ.. డిప్యూటీ స్పీకర్ నుంచి కానీ ఎటువంటి స్పష్టత లేదు. ఈనెల 18 వరకు ఎలాగూ సంక్రాంతి సెలవులు కొనసాగుతాయి. సమావేశాలు పెట్టడం కుదరదు కూడా. అయితే 25 లోగా సమావేశాలు నిర్వహిస్తారనిడ ఐదు నుంచి ఆరు రోజులు కొనసాగిస్తారని తెలుస్తోంది.గతంలో శాసనసభ అంటే ఒక గౌరవభావంతో చూసేవారు. ఏడాదికి మూడు నుంచి నాలుగు సార్లు శాసనసభ సమావేశాలు జరిగేవి. వేసవి కాల సమావేశాలు, వర్షాకాల సమావేశాలు, చివరిసారిగా శీతాకాల సమావేశాలు జరిపేవారు. అత్యవసర తీర్మానాల కోసండ అత్యవసర సమావేశాలు కూడా నిర్వహించేవారు. కానీ ఎప్పుడైతే అసెంబ్లీకి ప్రతిపక్షం బహిష్కరిస్తుందో.. ఆ సీరియస్ నెస్ తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు కూడా వైసిపి బహిష్కరించడంతో శాసనసభకు పెద్దగా ప్రాధాన్యత లేకుండా పోతోంది. అందుకే సీఎం చంద్రబాబు సొంత పార్టీ ఎమ్మెల్యేలను సైతం ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు. అయితే ప్రతిపక్షం లేనిదే శాసనసభకు అంత హుందాతనం రాదు. బహుశా ఆ కారణంతోనే శాసనసభ సమావేశాల విషయంలో సరైన నిర్ణయాలు రాలేదని తెలుస్తోంది.

## రాజకీయాలకు విష్ణుకుమార్ రాజు గుడ్ బై

**విశాఖపట్టణం, జనవరి 7, పెన్ పవర్:** బిజెపిలోఆయన సీనియర్ మోస్ట్ లీడర్. మొన్నటి ఎన్నికల్లో గెలిచేసరికి మంత్రి పదవి వస్తుందని భావించారు. పాత తరం బిజెపి నాయకుడు కావడంతో ఇట్టే అవకాశం ఇస్తారని అంచనా వేశారు. ఆపై చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యంతో తనకి పదవి తప్పదని నమ్మకం పెట్టుకున్నారు. అయితే వివిధ సమీకరణలో భాగంగా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. బిజెపిలో సైతం తగినంత ప్రాధాన్యం లేదు. అందుకే వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకోవాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. బిజెపిలో ఇది హాట్ టాపిక్ గా మారింది. ఇంతకీ ఎవరు ఆ నేత? అంటే విష్ణుకుమార్ రాజు. విశాఖ ఉత్తర నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే2014 ఎన్నికల్లో గెలిచారు విష్ణుకుమార్ రాజు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి. అప్పట్లో కూడా టిడిపి అధికారంలోకి వచ్చింది. బిజెపి రాష్ట్ర ప్రభుత్వంలో చేరింది. అప్పుడు కూడా రెండు మంత్రి పదవులు వచ్చాయి. ఒకటి కామినేని శ్రీనివాస్ కు ఇచ్చారు. ఇంకొకటి మాణిక్యాలరావు దక్కించుకున్నారు. విష్ణుకుమార్ రాజు శాసనసభ పక్ష నేతగా ఉండేవారు. అయితే టిడిపి భాగస్వామ్య పక్షంగా బిజెపి వ్యవహరించేది. చంద్రబాబు నాయకత్వాన్ని విష్ణుకుమార్ రాజు సమర్థించేవారు. 2018లో ఎన్డీఏ నుంచి బయటకు వెళ్లిపోయింది తెలుగుదేశం. ఆ సమయంలో కూడా చంద్రబాబు పట్ల గౌరవం గానే ఉండేవారు విష్ణుకుమార్ రాజు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది బీజేపీ నేతలు చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రకటనలు చేసేవారు. ఆ సమయంలో సైతం విష్ణుకుమార్ రాజు చంద్రబాబుకు అనుకూలంగానే ప్రకటనలు చేసేవారు. 2024 ఎన్నికల్లో పొత్తు కుదరడం, టిడిపి కూటమి గెలవడంతో తనకు తప్పకుండా మంత్రి పదవి దక్కుతుందని ఆశలు పెట్టుకున్నారు విష్ణుకుమార్ రాజు. అయితే అటువంటిదేమీ లేకపోవడంతో తీవ్ర ఆవేదనతో ఉన్నారటభారతీయ జనతా పార్టీలో సైతం విష్ణుకుమార్ రాజుకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదు. అది ఆయనకు ఇబ్బందికరంగా మారింది. ఒకానొక దశలో బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవికి విష్ణుకుమార్ రాజు పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే ఇప్పుడు పార్టీలో సైతం పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం.. విశాఖకు వస్తున్న మెరుగైన ప్రాజెక్టులన్నీ ఇతర ప్రాంతాలకు పరిమితం కావడంతో ప్రజల నుంచి ఓ రకమైన అసంతృప్తి స్వరం వినిపిస్తోంది. అనుకున్నది సాధించలేకపోతున్నానన్న ఆవేదన ఆయనలో ఉంది. అందుకే 2029 ఎన్నికల్లో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెప్తానని అనుచరుల వద్ద వ్యాఖ్యానిస్తున్నారు. అయితే తన కుమార్తెను రంగంలోకి దించేందుకు రాజుగారు అలా మాట్లాడుతున్నారని అనుచరులు చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# కొత్త లుక్ లో జనసేనాని...

**విజయవాడ, జనవరి 7, పెన్ పవర్:** పొలిటికల్ ట్రెండ్ సెట్టర్ పవన్ కళ్యాణ్. తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక స్టార్ డం ఉన్న హీరో. విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే రాజకీయాల్లోకి వచ్చిన పవన్ విజయం కోసం చాలా రోజులు వెయిట్ చేయాల్సి వచ్చింది. అయితే ఆయన హావభావాలు, వస్త్రధారణ విభిన్నంగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్కో స్టైల్ లో కనిపిస్తున్నారు. అయితే సాధారణంగా రాజకీయ పార్టీల నేతలు దోతి వంటి వాటిలో ఎక్కువగా కనిపిస్తారు. ఖద్దరుదారణ కూడా చేస్తారు కానీ పవన్ కళ్యాణ్ ఇటీవల డిఫరెంట్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాజువల్ డ్రెస్సెస్ తో పాటు కార్పొరేట్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇప్పుడు ఇది అందరిలోనూ ఆశ్చర్యం వేస్తోంది. సహజంగానే సినీ పరిశ్రమ నుంచి రావడంతో ఫుల్ గ్లామర్ పవన్ కళ్యాణ్ ది. అటువంటిది ఇప్పుడు రాజకీయ నాయకుడిగా కాకుండా.. ఓ కార్పొరేట్ ఉద్యోగి తరహాలో కనిపిస్తున్నారు పవన్.సినిమా రంగంలో అగ్ర కథానాయకుడిగా కొనసాగారు పవన్ కళ్యాణ్. ఆయనది చరిష్మ ఉన్న ముఖం. అయితే అంతటి స్టార్ డం ఉన్న పవన్ కళ్యాణ్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసేసరికి ఒక సాధారణ రాజకీయ నాయకుడిగా మారిపోయారు. కుర్తాతో ఎక్కువగా కనిపించేవారు. ఆపై మెరిసిన గడ్డంతో, తల జిత్తుతో ఎక్కువగా బయటకు వచ్చేవారు. అయితే ఇటీవల మాత్రం



ఆయన హెయిర్ స్టైల్ లో మార్పు వచ్చింది. క్యాజువల్ ఫ్యాంట్, షర్ట్ లో అఫీషియల్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాబినెట్ సమావేశాలతో పాటు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు అలానే వస్తున్నారు. ఈ న్యూ లుక్ ను ఆయన ఎంత మజా చేస్తున్నారో తెలియదు కానీ.. జనసైనికులు మాత్రం చాలా ఆనందంతో గడుపుతున్నారు.అయితే ప్రజలతో పాటు జనసైనికులు పవన్ కళ్యాణ్ విషయంలో రెండు పద్ధతుల్లో ఫీల్ అవుతుంటారు. ఒకటి అభిమాన కథానాయకుడు, ఆపై ఇష్టమైన నేత. అందుకే పవన్ కళ్యాణ్ ఎక్కడికి వెళ్లినా అదే క్రేజ్. చివరకు మంత్రివర్గ సమావేశాలు అయినప్పుడు, మంత్రులు ప్రత్యేకంగా కలుసుకున్నప్పుడు పవన్ కళ్యాణ్ తో ఫోటోలు దిగేందుకు తోటి మంత్రులు కూడా ఆసక్తి చూపుతుంటారు. అంతలా ఉంటుంది ఆయన చరిష్మ. ఆపై ప్రజల విషయంలో ఆయన వ్యవహార శైలి కూడా అలానే ఉంటుంది. చాలా అంకితభావంతో పనిచేస్తారు. అయితే గత కొంతకాలం కిందట వరకు ఆయన సాధారణ వస్త్రాలతోనే కనిపించేవారు. కానీ ఇటీవల అఫీషియల్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇది జనసైనికులకు ముమ్మాటికి ఇష్టపడే విషయం కూడా. అయితే పవన్ కళ్యాణ్ ఎలా ఉన్నా ప్రత్యర్థులకు నచ్చదు. ఎందుకంటే ఆయన వారి ఓటమిపై అంతలా ప్రభావం చూపారు కాబట్టి. అందుకే ఆయన అదిరేటి డ్రెస్ వేసినా వారికి నచ్చదు. అభిమానులు మాత్రం పవన్ కళ్యాణ్ ను చూసి ఫిదా అవుతున్నారు.

# 30 ఏళ్ల క్రితం... వణికించిన బ్లోఅవుట్

**8 జనవరి 1995..సాయంత్రం 6:50కి ఎగసిపడిన మంటలు**

**కాకినాడ, జనవరి 7, పెన్ పవర్:** కోనసీమ అంటే ప్రకృతి అందాలు..పండుగలు..రకరకాల వంటకాలు మాత్రమే అనుకునే రోజుల్లో జరిగిన అగ్ని ప్రమాదం దేశాన్నే వణికించింది. ాచీ+జ గ్యాస్ లీక్ వల్ల ఏర్పడిన పాశర్లపూడి బ్లో ఔట్ కోనసీమ పేరును దేశ వ్యాప్తంగా గుర్తుండిపోయేలా చేసింది. మరో భోపాల్ దుర్ఘటనలా మారుతుందా అనే విశ్లేషణలు, భయాలు వెలువడేలా చేసిన పాశర్లపూడి బ్లో ఔట్ ఘటన కు 30 ఏళ్ళు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోనసీమ జిల్లాలో మలికిపురం మండలంలోని ఇరుసమండ గ్రామం వద్ద జరిగిన ాచీ+జ గ్యాస్ లీక్ గురించి అందరూ భయపడుతున్నారు. కానీ దీన్ని మించిన అత్యంత ప్రమాదం 30 ఏళ్ల క్రితమే జరిగింది. అమలాపురానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాశర్లపూడి అనే గ్రామంలో ాచీ+జ గ్యాస్ డ్రిల్లింగ్ పనులు జరుపుతున్నప్పుడు ఒక్కసారిగా లీకేజ్ ఏర్పడి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అందరూ సంక్రాంతి పండుగకు రెడీ అవుతున్న సమయంలో 8 జనవరి 1995 సాయంత్రం 6:50కి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. 19వ నెంబర్ బావి వద్ద జరిగిన బ్లో ఔట్‌తో మొదలైన అగ్ని జ్వాలలు ఏకంగా 65రోజులపాటు కొనసాగి మార్చి 15 నాటికి అదుపులోకి వచ్చాయి. అన్ని రోజులపాటు అగ్ని జ్వాలలు అలా ఎగసిపడుతుండడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా దేశం అంతా భయపడింది. ప్రభుత్వం వెంటనే అలెర్ట్ అయి చుట్టుపక్కల ఉన్న 7 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించింది. ఏదో రెండు మూడు రోజుల్లో మళ్ళీ సొంత ఊరికి వచ్చేస్తామనుకున్న ప్రజలు ఏకంగా రెండు నెలల పాటు తమ ఊళ్లకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు ఆ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు కానీ ప్రమాదం సంభవించిన రిగ్ నెంబర్ 19 మొత్తం నాశనం అయిపోయింది. ఆ రోజుల్లోనే దాని విలువ 9.2 కోట్లు. అది కాకుండా చుట్టుప్రక్కల ఉన్న సామాగ్రి మొత్తం కాలిపోయింది. వాటి విలువ మరో 7కోట్లు.ఎంత ట్రై చేసినా మంటలు అదుపులోకి రాకపోవడంతో అమెరికాలోని హూస్టన్‌కు చెందిన నీల్ ఆడమ్స్ ఫైర్ ఫైటర్స్ సంస్థ ఇంజనీర్లను రప్పించారు. కానీ వారు చేసిన మొదటి ప్రయత్నాలు ఫలించలేదు. తరువాత మంటలను అదుపు చేయడానికి వారు మరో పథకం వేసినా అది మరింత ప్రమాదమంటూ దానికి ాచీ+జ అనుమతి ఇవ్వలేదు. చివరకు ఇంటర్‌నేషనల్ వెల్ కంట్రోల్ సంస్థ ఇంజనీర్లు రంగంలోకి దిగి 15 మార్చ్ 1995న మంటలను అదుపులోనికి తీసుకుని రాగలిగారు. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్లో ఔట్‌గా చరిత్రకెక్కింది. ఏకంగా 200మీటర్ల ఎత్తుకు మంటలు ఎగసిపడ్డాయి.అప్పట్లో బ్లో ఔట్ కారణంగా ఎగడిపడుతున్న మంటలు చాలా కిలోమీటర్ల దూరానికి కనపడేవి. వాటిని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో ప్రజలు కోనసీమ వచ్చేవారు. ప్రస్తుతం అంతా ఒకే అన్నట్టు కనపడుతున్నా 30 ఏళ్ల తర్వాత కూడా బ్లో ఔట్ అన్న మాట వినగానే భయంతో ఉలిక్కిపడుతుంటారు పాశర్లపూడి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు. తాజాగా మలికిపురం బ్లో ఔట్ ప్రమాదంతో ఆనాటి భయంకర పరిస్థితుల గురించి మరోసారి గుర్తు చేసుకుంటున్నారు అప్పటి తరం వారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# మదురో కోసం 200 మందికి పైగా అమెరికా సైనికులు



**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను పట్టుకోవడానికి దాదాపుగా 200మంది అమెరికా సైనికులు వెనిజులా రాజధాని కారకస్‌లో ప్రవేశించారని పెంటగన్ చీఫ్ పీటె హెగ్‌సాథ్ సోమవారం వెల్లడించారు. అమెరికా న్యాయ వ్యవస్థ కోరుకుంటున్న వ్యక్తిని పట్టుకు తీసుకువచ్చేందుకు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు మద్దతుగా దాదాపుగా 200మంది అమెరికన్ సైనికులు రంగంలోకి దిగి ఒక్క అమెరికన్ కూడా చనిపోకుండా పని పూర్తి చేసుకుని వచ్చారని హెగ్‌సాథ్ తెలిపారు. వర్జీనియాలో అమెరికా నావికులు, నౌకా నిర్మాణకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యావత్ ప్రపంచం నివ్వెరపోయేలా జరిగిన ఈ ఆపరేషన్‌లో కారకస్‌లోకి ప్రవేశించిన అమెరికా బలగాల సంఖ్య గురించి ఒక అమెరికా అధికారి వెల్లడించడం ఇదే తొలిసారి. ఈ ఆపరేషన్‌లో 150కి పైగా మిలటరీ హెలికాప్టర్లు వెనిజులా రక్షణ వ్యవస్థలపై దాడులతో సహా వివిధ కార్యకలాపాల్లో పాల్గొన్నాయి.

# గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం కోసం ట్రంప్ యత్నం



**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన ఎంపికలపై అధ్యక్షుడు ట్రంప్, ఆయన బృందం చర్చిస్తోందని వైట్‌హౌస్ మంగళవారం ప్రకటించింది. లక్ష్యాన్ని సాధించేందుకు 'మిలటరీ'ని ప్రయోగించడాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను అడ్డుకునేందుకు గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అమెరికా జాతీయ భద్రతా ప్రాధాన్యతగా ట్రంప్ భావిస్తున్నారని జాతీయ మీడియా ప్రశ్నలకు ప్రతిస్పందనగా వైట్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునే మార్గాల గురించి ఓవల్ కార్యాలయంలో చర్చలు కొనసాగుతున్నాయని మరియు సలహాదారులు వివిధ మార్గాలపై చర్చిస్తున్నారని అమెరికా సీనియర్ అధికారి తెలిపారు. గ్రీన్‌ల్యాండ్‌కు మద్దతుగా నాటో నేతలు చేసిన ప్రకటనలపై ట్రంప్ భయపడటం లేదని అన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా కొనుగోలు చేయడం లేదా ఆ భూభాగంతో స్వేచ్ఛా అనుబంధ ఒప్పందం (సిఒఎఫ్ఎ) ఏర్పరుచుకోవడం కూడా ఉందని పేరు వెల్లడించేందుకు నిరాకరించిన ఒక అధికారి తెలిపారు. సిఒఎఫ్ఐ ఒప్పందం గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో భాగం చేయాలనే ట్రంప్ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని అన్నారు. వెనిజులా అధ్యక్షుడు మదురోను నిర్బంధించిన అనంతరం గ్రీన్‌ల్యాండ్‌పై సుమారు రెండు నెలల్లో నిర్ణయం ప్రకటిస్తానని ట్రంప్ ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఇరాన్‌లో పెరిగిన నిరసనలు.. భద్రతా దళాల కాల్పుల్లో 20 మందికిపైగా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లో పెరిగిన జీవన వ్యయం కారణంగా ప్రజలు నిరసనబాట పట్టారు. దీంతో ఆందోళనకారుల్ని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు భాష్పవాయువుని ప్రయోగించడం, కాల్పులు జరపడం పరిపాటిగా మారింది. తాజాగా ఆందోళనకారులపై భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఐదుగురు మైనర్లతో 27 మంది చనిపోయినట్లు నార్వేకు చెందిన ఎన్‌జివో ఇరాన్ హ్యూమన్ రైట్స్ పేర్కొంది. మంగళవారం కూడా టెహ్రాన్‌లో ఉన్న సినా హాస్పిటల్ పక్క వీధుల్లో జనసమూహాన్ని భద్రతా సిబ్బంది చెదరగొట్టారని ఇరాన్ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఇరాన్‌పై కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం పెరుగుతూనే ఉంది.

# క్రమంగా బలపడుతున్న బంగ్లాదేశ్, పాకిస్థాన్ల మధ్య సంబంధాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాసియాలో వ్యూహాత్మక పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. బంగ్లాదేశ్, పాకిస్థాన్ల మధ్య సంబంధాలు క్రమంగా బలపడుతున్నాయి. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం తొలగిన అనంతరం, మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు దూరంగా, పాకిస్థాన్‌కు దగ్గరయ్యే విధంగా అడుగులు వేస్తోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే పాకిస్థాన్ నుంచి యుద్ధ విమానాలను (జెఎఫ్-17 థండర్ ఫైటర్ జెట్లు) బంగ్లాదేశ్ కొనుగోలు చేయనున్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ సైన్యానికి చెందిన ప్రచార విభాగం ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) అధికారికంగా వెల్లడించింది. బంగ్లాదేశ్‌కు యుద్ధ విమానాల విక్రయంపై ఇరు దేశాల మధ్య చర్చలు జరిగినట్లు తెలిపింది. జెఎఫ్-17 థండర్ యుద్ధ విమానాలను చైనా, పాకిస్థాన్ సంయుక్తంగా తయారు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల బంగ్లాదేశ్ ఎయిర్ చీఫ్ మార్షల్ హసన్ మహమూద్ ఖాన్ ఇస్లామాబాద్‌లో పాక్ ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ జహీర్ అహ్మద్ బాబర్ సిద్ధూతో సమావేశమయ్యారని పాక్ సైన్యం వెల్లడించింది. ఈ సమావేశంలో ఆపరేషనల్ కోఆపరేషన్, సంస్థాగత సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించినట్లు వెల్లడించింది. శిక్షణ, సామర్థ్య నిర్మాణం రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలిపింది. ఇదే సమయంలో బంగ్లాదేశ్ ఎయిర్ ఫోర్స్‌కు శిక్షణ అందించేందుకు పాకిస్థాన్ ఎయిర్ ఫోర్స్ ముందుకు వచ్చినట్లు ఐఎస్‌పీఆర్ పేర్కొంది.

# అసమాన మేధావి స్టీఫెన్ హాకింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయన ఒక విధి వంచితుడు. అయితే ఆ యన పట్టుదల, ఆత్మస్థైర్యం ముందు విధి ఓడి పోయింది. విధి వక్రించినా ఆయన వెరవలేదు. శరీరం కదల్చడానికి వీలు లేని స్థితి లోనూ ఆయన చేసిన పరిశోధనా కృషి ప్రపంచ వ్యాప్తంగా ఆయనకు ప్రఖ్యాతిని తెచ్చిపెట్టింది. అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అందుకు న్న ఘనుడు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ స్థానం పొందిన మేధావి. కనీసం కదలడానికి సహకరించని శరీరం, చక్రాల కుర్చీకి అతుక్కు పోయిన మనిషి, కనీసం మాట్లాడటానికీ కంప్యూటర్ సహాయం... ఇవి ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ ను గుర్తించడానికి ఆనవాళు .. మోటార్ న్యూరాన్ వ్యాధి శరీరాన్ని కబళిస్తున్నా... చేస్తున్న పనికి శరీరం సహకరించక పోయినా...ఆయన పరిశోధనలు ఖగోళ శాస్త్రంలో ఎన్నో ప్రశ్నలకు సమాధానాన్ని చూపాయి. శాస్త్రవేత్తగానే కాక ఆయనపై ఆయనకున్న నమ్మకం, కలసిరాని విధిని తనకు అనుకూలంగా మార్చుకునే తత్వం నేటి యువతకు ఆదర్శం. స్టీఫెన్ హాకింగ్ ఓ సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త. ఎమియోట్రోఫిక్ లేటరల్ స్కెర్లోసిస్ అనే నాడీమండలానికి సంబంధించిన జబ్బు వల్ల క్రమక్రమంగా దశాబ్దాల తరబడి అతని శరీరభాగాలు చచ్చుబడుతూ వచ్చినా, తన మెదడు పనిచేస్తూండడాన్ని దన్నుగా ఉపయోగించుకుని కృష్ణబిలాలకు సంబంధించిన అనేక అంశాలు మొదలుకొని సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో ఎన్నో పరిశోధనలు చేశాడు. హాకింగ్ రాయల్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్‌లో గౌరవ సభ్యుడిగా, పాంటిఫికల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో జీవిత కాల సభ్యునిగా ఉన్నాడు. ఆయన అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అందు కున్నాడు. టైమ్స్ పత్రిక వారి 100 మంది అత్యంత గొప్పవారైన బ్రిటీషర్ల జాబితాలో 25వ స్థానం అతనిదే. ఆయన రాసిన ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ అన్న పుస్తకం ద బ్రిటీష్ సండే టైమ్స్ బెస్ట్ సెల్లర్ల జాబితాలో 237 వారాల పాటు నిలిచి రికార్డులు బద్దలు కొట్టింది, ఈ పుస్తకపు అమ్మకాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ స్థానం సంపాదించాయి. శరీరం చాలావరకూ చచ్చుబడి పోయినా ఆయన జీవితాంతం ఒకే ఒక్క దవడ ఎముక కదులుస్తూ, దానికి అమర్చిన సంభాషణలు-ఉత్పత్తి చేసే పరికరం ఉపయోగించి సంభాషించేవాడు. ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త గెలిలియో మరణించి దాదాపు 300 సంవత్సరాల అనంతరం 1942 జనవరి 8వ తేదీన ఇంగ్లాండు లోని ఆక్స్ ఫర్డ్ లో స్టీఫెన్ హాకింగ్ జన్మించాడు. గణిత ఉపాధ్యాయుని ప్రేరణతో గణిత శాస్త్రంలో స్పెషలైజేషన్ చేద్దామను కున్నాడు స్టీఫెన్. కాని దానికి వ్యతిరేకంగా తండ్రి రసాయన శాస్త్రంలో చేర్పించాడు. తరువాత 1959లో నేచరల్ సైన్స్ విద్య కోసం స్కాలర్ షిప్ పరీక్ష రాశాడు. అందులో సఫలీకృతుడు కాగలిగినా... భౌతిక శాస్త్రంలో స్పెషలైజేషన్ చేశాడు స్టీఫెన్. 1962లో కేవలం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడు కాగలిగాడు. కాస్మాలజి, జనరల్ రిలెటివిటీ పరిశోధనల కోసం ఆక్స్‌ఫర్డ్ కి వెళ్ళాడు. అప్పటి నుంచి స్టీఫెన్ పరిస్థితి పూర్తిగా మారింది. తినాలన్నా... కనీసం బూట్ల లేసు కట్టుకుందా మన్నా... స్టీఫెన్ శరీరం సహకరించేది కాదు. క్రిస్మస్ సెలవులకు ఇంటికి వెళ్ళిన స్టీఫెన్ పరిస్థితి ఆయన తల్లిదండ్రులను కలవర పెట్టింది. భోజనం చేయడానికి ఆయన పడుతున్న ఇబ్బంది... తల్లిని మథనపెట్టింది. ఆ సమయంలోనే ఆసుపత్రిలో చేసిన పరీక్షల్లో ఆయనకు మోటార్ న్యూరాన్ వ్యాధి (ఓనీబినీతీ ఔవబీతీనీని ఆతిబవజీబవ) అనే భయంకర వ్యాధి ఉన్నట్టు తెలిసింది. దీనినే వ్యాధి అని కూడా అంటారు. నాడీ మండలం పై అంటే నరాలు, వెన్నుపూస పై ఇది ప్రభావం చూపుతుంది. భౌతిక శాస్త్రవేత్త వెర్నర్ ఇస్రయిల్ 'మోజట్ కంపోజింగ్ సింఫనీ' తెచ్చి స్టీఫెన్ తలకు అమర్చాడు. దాని వల్ల ఆయనకు తనను తాను వ్యక్తీకరించుకునే అవకాశం కలిగింది. దాన్ని అభ్యసించడానికి ఆయనకు కొంత సమయం పట్టినా, తర్వాత కాలంలో అది ఎంతో ఉపయోగపడుతూ వచ్చింది. 1970 నాటికి మాట పూర్తిగా పడిపోయింది. అతని హావభావాలు కుటుంబ సభ్యులకు, అతి సన్నిహితులకు మాత్రమే అర్థమయ్యేవి. 1985లో ఆయనకు నిమోనియా వచ్చింది , అప్పటి నుంచీ ఒక చక్రాల కుర్చీకి పరిమితమై తన చేతి చిటికెన వేలి కదలికల సాయంతో మాత్రమే దానికి అనుసంధానించి, రూపొందించిన 'వాయిస్ సింథసైజర్'తో తన ఆలోచనలను శాస్త్ర లోకానికి అందిస్తున్నారు. హాకింగ్ చిటికెన వేలు కదలికల్ని ఒక హ్యాండ్ కంట్రోలర్ యంత్రానికి అమర్చిన తెరపై అక్షరాలను స్కాన్ చేసే కర్సర్ నియంత్రిస్తుంది. ఆయన ఎంచుకున్న అక్షరాల్ని, యంత్రంలోని వ్యవస్థ తనంతట తానే పని చేసే 'అల్గారిదమ్' సాయంతో మాటలు వాక్యాల రూపంలో రూపొందించి తెరపై ప్రకటిస్తుంది. కంప్యూటర్ ఇంజనీర్ డేవిడ్, ఒక చిన్న కంప్యూటర్‌ని స్టీఫెన్ హాకింగ్ వీల్‌ఛైర్‌కు అమర్చాడు. అందులోని సింథసైజర్ విషయాన్ని మాటగా మార్చి ఎదుటి వారికి వినిపిస్తుంది. అందుకోసం తన గొంతునే వాడమన్నాడు స్టీఫెన్. మాట పడిపోక ముందున్న తన గొంతు ధ్వనిని అందులో ఉపయోగించ మన్నాడు. దాని వల్ల స్టీఫెన్ హాకింగ్ సాంకేతిక సంభాషణ సహజ సంభాషణలా మారిపోయేది. డాక్టరేట్ సంపాదించేలోపే స్టీఫెన్ మరణిస్తాడని అనుకున్నారంతా... కానీ ఆయన పట్టుదల, ఆత్మస్థైర్యం ముందు మృత్యువు ఓడిపోయింది. మళ్లీ విశ్వవిద్యాలయానికి తిరిగివచ్చిన హాకింగ్ తన పరిశోధనల్లో నిమగ్న మయ్యాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలిసి మిత్రులు సహకరించాలని చూసినా స్టీఫెన్ సున్నితంగా తిరస్కరించేవాడు. ఎన్నో విశ్వవిద్యాలయాల్లో పనిచేసిన స్టీఫెన్ కు, వ్యాధి అడ్డంకిగా మారలేదు. తన నాడీ మండలం పూర్తిగా పాడవుతున్నా, మెదడు సహకరించడాన్ని స్టీఫెన్ గమనించాడు. 1966లో ఆయన సమర్పించిన 'ప్రాపర్టీస్ ఆఫ్ ఎక్స్‌పాండింగ్ యూనివర్సెస్' థీసిస్‌ను ఆన్‌లైన్‌లో ఉంచగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది దానిని చదివేందుకు ఆసక్తి చూపారు. 1970 నుంచి కృష్ణబిలాలపై పరిశోధనలు ప్రారంభించాడు. తీరికలేని స్టీఫెన్ తనకు వ్యాధి వుందన్న విషయాన్ని కూడా మరచి పోయాడు. క్వాంటం థియరి, జనరల్ రిలెటివిటీ లను ఉపయోగించి... కృష్ణబిలాలు కూడా రేడియేషన్ ను వెలువరిస్తాయని కనుగొన్నాడు. 1971నుంచి బిగ్ బ్యాంగ్ పై పరిశోధనలు మొదలు పెట్టిన ఆయన కృష్ణబిలాలకు సంబంధించి ఎన్నో విషయాలను ఆవిష్కరించాడు. 1984లో ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ పుస్తకరచన ప్రారంభించాడు. ఆ సమయంలోనే వ్యాధి వల్ల 1985లో వైద్యుల దగ్గర ఉండాల్సి వచ్చింది. అప్పుడే కంప్యూటరు సాయంతో మాట్లాడ గలిగే పరికరాన్ని స్టీఫెన్ తయారు చేసుకున్నాడు. దాని సాయంతోనే 1988లో పుస్తకాన్ని వెలువ రించాడు. అది అమ్మకాల్లో సృష్టించిన రికార్డు అంతా ఇంతా కాదు. ప్రపంచ వ్యాప్తంగా 40 భాషల్లో ఆ పుస్తకం వెలువడింది. తెలుగులోనూ... కాలం కథ పేరుతో వెలువడింది. ప్రపంచ వ్యాప్తంగా ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ అమ్మకాల్లో సృష్టించిన రికార్డు వల్ల అది 1998 అంటే వెలువడిన 10 సంవత్సరాల తరువాత గిన్నిస్ బుక్ లో స్థానం సంపాదించింది. 2014లో హాకింగ్ జీవిత విశేషాలతో ది థియరీ ఆఫ్ ఎవ్వరిథింగ్ అనే సినిమా తీశారు. దీనికి ఆస్కార్ అవార్డు కూడా వచ్చింది. సోషల్ మీడియాలో చేరిన క్షణాల్లోనే ఆయన మిలియన్ ఫాలోవర్స్‌ను పొందాడు. ఇక స్టీఫెన్ హాకింగ్ చేసిన తొలి పోస్ట్‌కు క్షణాల్లో ఏకంగా ఐదులక్షల లైక్లు వచ్చాయి. 1975 ఎడిటంగ్ మెడల్; 1976 రాయల్ సొసైటి హ్యూగ్స్ మెడల్; 1979 అల్బర్ట్ ఐన్ స్టీన్ మెడల్; 1982 ఆర్డర్ ఆఫ్ బ్రీటీష్ ఎఒపైర్ (కమాండర్); 1985 రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ బంగారు పతకం; 1986 పొంటిఫిషియల్ అకాడమి ఆఫ్ సైన్స్ లో సభ్యత్వం; 1988 భౌతిక శాస్త్రంలో అంతర్జాతీయ బహుమతి; 1989 కన్ కర్డ్ లో ఆస్ట్రియా ప్రిన్స్ అవార్డ్; 1989 కంపానియన్ ఆఫ్ ఆనర్; 1999 అమెరికా భౌతిక శాస్త్ర సమితి వారి జూలియస్ ఎడ్గర్ లిలెన్ ఫెల్డ్ ప్రైజ్; 2003 కేస్ వెస్టెన్ రిజర్వ్ విశ్వ విద్యాలయం వారి మైకెల్ సన్ మోర్లీ అవార్డ్; 2006 రాయల్ సొసైటీ కాప్లి మెడల్ తదితర ఎన్నో అవార్డులను ఆయన సొంతం చేసుకున్నాడు. 2018 మార్చి 14 న బుధవారం ఆయన కేంబ్రిడ్జ్‌లోని తన నివాసంలో మరణించాడు.

# ఆరావళి అస్తిత్వానికి ముప్పు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశ పర్యావరణ చరిత్రలో ఆరావళి పర్వత శ్రేణులు ఒక అపూర్వమైన సహజ వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఇవి కేవలం రాళ్ల గుట్టలు కాదు, ఉత్తర భారతదేశ వాతావరణ సమతుల్యతకు వెన్నెముకలు.గుజరాత్ నుంచి ఢిల్లీ సమీపం వరకూ సుమారు 650 కిలోమీటర్ల పొడవునా విస్తరించిన ఈ పర్వతాలు, భూమి మీద అత్యంత పురాతన పర్వత శ్రేణుల్లో ఒకటిగా భూగోళ శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. సుమారు 250 కోట్ల సంవత్సరాల చరిత్రను మోస్తున్న ఆరావళులు, నేడు మన నిర్లక్ష్యానికి బలై క్రమంగా కనుమరుగవుతున్నాయి. అభివృద్ధి, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల పేరిట ఆరావళి పర్వతాలను పీక్కుతింటున్న దృశ్యం నేడు బహిరంగ రహస్యం. ముఖ్యంగా రియల్ ఎస్టేట్, మైనింగ్ మాఫియా ఆరావళులను లాభాల గనులుగా మార్చాయి. రాజస్థాన్, హర్యానా ప్రాంతాల్లో అక్రమ రాయి గనులు విస్తృతంగా కొనసాగాయి. ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ చట్టాలను, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972ను లెక్కచేయకుండా వేల ఎకరాల అటవీ భూమి, జీవ వైవిధ్యత ధ్వంసం చేశారు. ఢిల్లీ-ఔఅఖీ విస్తరణతో గుర్గావ్ , ఫరీదాబాద్, నోయిడా వంటి ప్రాంతాల్లో ఆరావళి పర్వతాలపై రహదారులు, విలాసవంతమైన భవనాలు, ఫార్మ్ హౌస్‌లు పుట్టుకొచ్చాయి. ఆరావళులకు తీవ్రమైన ముప్పుగా మారింది. ఢిల్లీ జనాభా ఒత్తిడి పెరుగుతుండటంతో నగర విస్తరణ పర్వతాల వైపు సాగుతోంది. ఒకప్పుడు అడవులు, జంతువుల నివాసాలుగా ఉన్న ప్రాంతాలు నేడు కాంక్రీట్ అడవులుగా మారాయి. దీని ప్రభావంగా వర్షపు నీటి నిల్వ తగ్గింది, వరదలు-ఎండల తీవ్రత పెరిగింది. ఢిల్లీ వాయు కాలుష్య సమస్యకు ఒక ప్రధాన కారణం ఆరావళుల అటవీ నాశనమేనని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆరావళుల విధ్వంసాన్ని గమనించిన సుప్రీంకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుంది. ఆరావళి ప్రాంతాల్లో మైనింగ్ నిషేధం, పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయరాదని స్పష్టమైన ఆదేశాలు (1990 - 2009) ఇచ్చింది. తరువాత క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బహుఏజెన్సీ కమిటీ (ఓబీశ్రీబితి-ణవనిఇఎ అనీఎతిబిబివవ) ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీ ఆరావళుల ప్రస్తుత స్థితిని అధ్యయనం చేసి కీలక సిఫార్సులు చేసింది. వాటిని సుప్రీం కోర్టు సమర్థించి, ముఖ్యంగా ఆరావళి ప్రాంతాల్లో వంద మీటర్స్ ఎత్తు దాటిన పర్వతాలను ఆరావళి పర్వత శ్రేణులుగా గుర్తించాలని చెప్పింది. కొత్త మైనింగ్ లీజులు, రెన్యూవల్స్ ఇవ్వకూడదు అని, లీగల్ మైనింగ్ కూడా శాస్త్రీయ పద్ధతిలో చేయాలని, అక్రమ మైనింగ్ కఠినంగా కట్టడి చేయాలని సూచించింది. ఎక్కడ అడవి జీవులు అధికంగా ఉన్నాయో, నీరు ఎక్కడ భూగర్భంలో కలుస్తుందో అక్కడ మైనింగ్ చేయరాదని సూచించింది. సంరక్షిత పర్యావరణ జోన్‌గా ప్రకటించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. కానీ కాగితాల మీద సిఫార్సులు ఉన్నా, క్షేత్రస్థాయిలో అమలు మాత్రం నెమ్మదిగా కొనసాగే అవకాశ మెండుగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2023-24లో 'ఆరావళి గ్రీన్ వాల్ ప్రాజెక్ట్' ను ప్రారంభించింది. గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ ప్రాంతాల్లో విస్తరించిన ఆరావళి శ్రేణుల వెంబడి భారీగా వన సృష్టి చేయడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. సుమారు 26 మిలియన్ హెక్టార్ల ప్రాంతంలో పచ్చదనం పెంచడం ద్వారా ఎడారి విస్తరణను అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కేవలం మొక్కలు నాటడానికే పరిమితం కాకుండా, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో జీవ వైవిధ్యాన్ని పునరుద్ధరించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. అయితే ఇది కూడా కేవలం ప్రకటనలకే పరిమితమవుతుందా అన్న సందేహాలు ప్రజల్లో ఉన్నాయి. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న ప్రభుత్వాలు ఆరావళి ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం విరుద్ధాభాసంగా కనిపిస్తోంది. అభివృద్ధి అవసరం నిజమే. కానీ అది ప్రకృతి విధ్వంసం మీద ఆధారపడితే, ఆ అభివృద్ధి దీర్ఘకాలికంగా నిలవదు. ప్రభుత్వాలు తక్షణ లాభాలకంటే దీర్ఘకాలిక పర్యావరణ భద్రతను దృష్టిలో పెట్టుకోవాలి. చట్టాలను కఠినంగా అమలు చేయాలి. అక్రమ మైనింగ్, ఆక్రమణలపై రాజకీయ రంగు లేకుండా చర్యలు తీసుకోవాలి. ఆరావళుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. పౌర సమాజం, విద్యావేత్తలు, పర్యావరణ కార్యకర్తలు, మీడియా కీలక పాత్ర పోషించాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఆరావళుల ప్రాధాన్యం గురించి అవగాహన కల్పించాలి. స్థానిక ప్రజలను సంరక్షణలో భాగస్వాములుగా మార్చినప్పుడే ఫలితాలు కనిపిస్తాయి. ఆరావళి పర్వతాలు లేకపోతే ఉత్తర భారతదేశం వాతావరణం తీవ్రంగా మారిపోతుంది. నేటి తరం ఒక నిర్ణయం తీసుకోవాలి. తాత్కాలిక లాభాల కోసం శాశ్వత నష్టాన్ని ఆహ్వానించాలా లేక భవిష్యత్తు తరాలకు సురక్షితమైన ప్రకృతిని అందించాలా? ఆరావళి పర్వతాలు ఈ ప్రశ్నకు మౌనంగా ఎదురు చూస్తున్నాయి. వాటి మౌనం మన అంతరాత్మను కదిలించాలి.

# అర్హులైన ఓటర్లను చనిపోయినట్లుగా చూపిస్తోందని మమతా బెనర్జీ మండిపాటు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం బీజేపీ ఐటీ విభాగం అభివృద్ధి చేసిన యాప్‌ను ఎన్నికల సంఘం వినియోగిస్తోందని ఆమె ఆరోపించారు. ఇది చట్టవిరుద్ధమని అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని ఆమె వ్యాఖ్యానించారు. అన్నారు. గంగాసాగర్ మేళా ఏర్పాట్లను సమీక్షించేందుకు దక్షిణ 24 పరగణాల జిల్లాలోని సాగర్ ఐలాండ్‌లో రెండు రోజుల పర్యటన ముగిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘం రాజ్యాంగ విరుద్ధమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక, తప్పుడు పద్ధతులను అనుసరిస్తోందని ఆమె ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఈసీ అన్ని విధాలా తప్పులతడకగా నిర్వహిస్తోందని మండిపడ్డారు. వృద్ధులు, అనారోగ్యంతో బలహీనంగా ఉన్నవారిని విచారణకు రావాలని బలవంతం చేస్తూ వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన ఓటర్లను మరణించినట్లుగా చూపిస్తోందని ఆరోపించారు. మమతా బెనర్జీ చేసిన ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఆమె ఆరోపణలు నిరాధారమని, రాజకీయ ప్రేరేపితమైనవని పేర్కొంది.

# వెనిజులాలో మరోసారి ఉద్రిక్తత అధ్యక్ష భవనం వద్ద కాల్పులు

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులా రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా అత్యంత వేగంగా పరిణామాలు మారుతున్నాయి. అమెరికా దళాల మెరుపు దాడిలో అధ్యక్షుడు నికోలస్ మదురో పట్టుబడిన కొన్ని గంటలకే.. రాజధాని కరాకాస్‌లోని అధ్యక్ష భవనం మిరాఫ్లోర్స్ సమీపంలో సోమవారం రాత్రి భారీగా కాల్పుల శబ్దాలు వినిపించడం అంతర్జాతీయంగా కలకలం రేపింది. దేశంలో కొత్తగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది సేపటికే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 8 గంటల సమయంలో అధ్యక్ష భవనంపై గుర్తు తెలియని డ్రోన్లు ఎగరడాన్ని భద్రతా బలగాలు గుర్తించాయి.

దీనిని తీవ్రమైన ముప్పుగా భావించిన దళాలు వెంటనే అప్రమత్తమై వాటిని కూల్చివేసేందుకు కాల్పులు జరిపాయి. సుమారు నిమిషం పాటు ఈ కాల్పుల శబ్దాలు వినిపించాయని, ఆకాశంలో కొన్ని ఎరుపు రంగు కాంతులు కనిపించాయని అధ్యక్ష భవనానికి సమీపంలో నివసించే వారు వెల్లడించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలలో తూటాలు ఆకాశంలోకి దూసుకెళ్తున్న దృశ్యాలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ఈ కాల్పుల ఘటనపై అమెరికా శ్వేతసౌధం వెంటనే స్పందించింది. వెనిజులా అధ్యక్ష భవనం వద్ద జరుగుతున్న పరిణామాల్లో తమ ప్రమేయం ఏమీ లేదని అమెరికా స్పష్టం చేసింది. అయితే వెనిజులాలోని పరిస్థితులను తాము నిశితంగా గమనిస్తున్నామని అగ్రరాజ్య అధికారులు తెలిపారు. మరోవైపు సీఎన్ఎన్ కథనం ప్రకారం.. అధ్యక్ష భవనం వద్ద భద్రతను పర్యవేక్షించే పారామిలిటరీ దళాల మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్లే ఈ కాల్పులు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని వెనిజులా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. రాజధానిలో మాత్రం ఇంకా ఉద్రిక్తత కొనసాగుతోంది.

# రిలయన్స్ షేరుకు రష్యా చమురు సెగ

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ముడి చమురు దిగుమతి చేసుకుంటోందంటూ వచ్చిన వార్తల సెగ మంగళవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు తగిలింది. ముడిచమురు నుంచి ఉత్పత్తి చేసే పెట్రోల్, డీజిల్ వంటి వాటిని ఐరోపా దేశాలకు ఆర్ఐఎల్ ఎగుమతి చేస్తుంటుంది. ఆయా దేశాల ఆంక్షలను ఆర్ఐఎల్ ఉల్లంఘించినట్లుగా వచ్చిన వార్తలను సంస్థ ఖండించినా, స్టాక్‌మార్కెట్లో షేరు 4 శాతానికి పైగా నష్టపోయి, సంస్థ మార్కెట్ విలువ ఒకేరోజు రూ.94,000 కోట్లకు పైగా క్షీణించింది. ఐరోపా దేశాల ఆంక్షల అనంతరమూ రష్యా నుంచి తాము ముడిచమురును దిగుమతి చేసుకున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. ఐరోపా కూటమి విధించిన ఆంక్షలకు అనుగుణంగా, గుజరాత్‌లోని జామ్‌నగర్ వద్ద ఉన్న తమ రిఫైనరీలో రష్యా ముడిచమురు వాడటాన్ని 2025 నవంబరు 20న ఆపేశామని రిలయన్స్ తెలిపింది. ఇంతకుముందు రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేసే భారతీయ సంస్థగా ఆర్ఐఎల్ ఉంది. జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో రెండు రిఫైనరీలున్నాయి. సెజ్ యూనిట్లో ఉత్పత్తి చేసిన ఇంధనాలను ఐరోపా కూటమి, అమెరికా, ఇతర విపణులకు సంస్థ ఎగుమతి చేస్తోంది. రెండోదైన పాత యూనిట్‌లో ఉత్పత్తి చేసిన ఇంధనాలను భారతీయ విపణికి ఆర్ఐఎల్ సరఫరా చేస్తోంది. 2025 డిసెంబరు 1 నుంచి రష్యాయేతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి చమురునే వాడుతున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది. డేటా అనలటిక్స్ సంస్థ కెప్లెర్ నివేదికను ఉటంకిస్తూ.. 2.2 మిలియన్ బ్యారెళ్ల ఉరాల్స్‌తో (రష్యా ముడి చమురులో ఓ రకం) కూడిన మూడు ట్యాంకర్లు సిక్కా ఓడరేవు దిశగా వెళ్లాయని బ్లూమ్‌బర్గ్ వార్తా కథనం తెలిపింది. జామ్‌నగర్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌కు సరఫరా అయ్యే ముడి చమురులో అత్యధికం ఈ ఓడరేవు ద్వారానే వస్తుందని పేర్కొంది. అయితే సిక్కా ఓడరేవును రిలయన్స్‌తో పాటు మిగతా సంస్థలూ వాడుతుంటాయి. ఈ వార్తా కథనంలో చెబుతున్న మూడు ఓడల ద్వారా వచ్చిన ముడి చమురు, భారత్ పెట్రోలియమ్ కార్పొరేషన్ (బీపీసీఎల్)కు చెందిన బినా రిఫైనరీ కోసమై ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

# 2026-27లో భారత జీడీపీ వృద్ధి 6.9 శాతం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ఆర్థికవ్యవస్థ మెరుగైన వృద్ధిని కొనసాగిస్తుందని ప్రముఖ రేటింగ్ సంస్థ ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్(ఇండ్-రా) అభిప్రాయపడింది. ముఖ్యంగా వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధి 6.9 శాతం వృద్ధిని సాధించగలదని అంచనా వేసింది. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఇందుకు ప్రధానంగా జీఎస్టీ తగ్గింపులతో పాటు ఆదాయపు పన్ను కోత వంటి కీలక సంస్కరణలు, వాణిజ్య ఒప్పందాలు దోహదపడతాయని, ఈ అంశాలు ప్రపంచ అనిశ్చితి నుంచి ఆర్థికవ్యవస్థను రక్షిస్తాయని ఇండ్-రా అభిప్రాయపడింది. దేశ ఆర్థికవ్యవస్థ వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ అధిక వృద్ధిని కొనసాగించగలదని, రిటైల్ ద్రవ్యోల్బణం సైతం సగటున 3.8 శాతం నమోదు అవ్వొచ్చని ఇండ్-రా అభిప్రాయపడింది. భారత్-యూఎస్ వాణిజ్య ఒప్పందం కూడా అధిక జీడీపీ వృద్ధికి తోడ్పడుతుందని ఇండ్-రా ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర కుమార్ పంత్ అన్నారు. ఇదే సమయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశ వాస్తవ జీడీపీ వృద్ధిని 7.4 శాతంగా, నామమాత్రపు జీడీపీని 9 శాతంగా ఇండ్-రా అంచనా వేసింది. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత కరెన్సీ రూపాయి విలువ సగటున డాలర్‌కు రూ. 88.64గా ఉంది. కానీ, 2026-27లో ఇది సగటు డాలర్‌కు రూ. 92.26కి చేరుకోవచ్చని పేర్కొంది.


# నూతన ఆవిష్కరణల రూపకర్త గెలీలియో

**హైదరాబాద్ పెన్ పవర్:** గెలీలియో గెలీల ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలిస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు. గెలీలియో గెలిలి (జన 1564 ఫిబ్రవరి 15..మరణం 1642 జనవరి 8) ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు. గెలీలియో కాలం అనగా 16 వ శతాబ్దం వరకు క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే ప్రాచుర్యంలో ఉండేవి. సృష్టిలోని సత్యాలనన్నిటినీ స్వచ్ఛమైన ఆలోచనల ద్వారా మాత్రమే వివరించ వచ్చును. ప్రయోగాల ప్రమేయం ఏ మాత్రం అవసరం లేదన్నది అరిస్టాటిల్ సిద్ధాంతాల్లోని పెద్ద లోపం. అరిస్టాటిల్ సిద్ధాంతంతో ఏకీభవించని గెలీలియో పీసా గోపురం 180 అడుగుల ఎత్తు పైనుంచి 100 పౌండ్లు, 1 పౌండు బరువు గల రెండు ఇనప గుండ్లను ఒకేసారి క్రిందికి వదలి, అవి రెండూ ఒకే కాలంలో భూమిని చేరుకుంటాయని ప్రయోగం ద్వారా నిరూపించాడు. గురుత్వ త్వరణం గూర్చి ఆ కాలం నాటికే అర్థం చేసుకో గలిగాడు. 20 సంవత్సరాల వయసులో అయన ఒక రోజు ప్రార్థన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళలో చర్చి సేవకుడు దీపాలు వెలి గించగా ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఆ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఆయన డోలన కాలాలను గణించటం విశేషం. వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం గురించి పరిచయం ఉంది కాబట్టి కాల నిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. పాండువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ప్రధానాచార్యునిగా చేరాడు. అక్కడే గెలీలియో యాంత్రిక శాస్త్రం రచించాడు. ఇది సామాన్యులకు కప్పీలు, తులాదండాలు, వాలుతలాల ద్వారా బరువులు సులభంగా ఎత్తడానికి ఉపకరించింది. ఆ సమయంలోనే వాయు థర్మామీటర్ ను, పల్లపు ప్రాంతం నుంచి ఎత్తుకు నీటిని చేరవేసి వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాన్ని, గణితంలో వర్గాలు, వర్గమూలాలు కనుగొనే కంపాస్ పరికరాన్ని కనుగొన్నారు. ఆ సమయంలోనే లోలకాలు, వాయు తలాలపై కూడా కీలకమైన ప్రయోగాలు చేశాడు.గెలీలియో మొట్టమొదటి నాణ్యత గల టెలిస్కోప్ నిర్మాత. ఆయన టెలిస్కోప్ గురించి విని సింగ్ ఆరోరియా మహారాజు వెనిస్ కు రమ్మని కబురు చేశాడు. ఆయన టెలిస్కోప్ చూసి ఎంతోమంది ఆశ్చర్య పడ్డారు. వెనిస్ చర్చి పైభాగానికి వెళ్ళీ ఎంతో దూరంలో ఉన్న నౌకలను పది రెట్లు దగ్గరగా ఎంతో మంది గెలీలియో టెలిస్కోప్ ద్వారా చూడ గలిగారు. ఆయనను ప్రశంసించారు. ఈ టెలిస్కోప్ గెలీలియో పరిశోధనలో ముఖ్యమైనది. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించ గలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు. గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించాడు. పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు. ఈ టెలిస్కోప్ ను ఉపయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతంను బలపరిచాడు. క్రీ.శ 1616 లో గెలీలియో, సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ద్వందంగా ప్రకటించాడు. అప్పటికే మత గ్రంథాలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భూకేంద్రక సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కోపర్నికస్ సిద్ధాంతాన్ని నిషేధించి, కొందరు మతాధికారులు గెలీలియో ప్రయోగాలు మత వ్యతిరేకమైనవని తీర్మానించారు. తన ప్రయోగాలను ఎన్నటికీ బహిర్గతం చేయనని ప్రమాణం తీసుకున్నారు. ఈ ప్రకటనకు ఆగ్రహం చెందిన చర్చి మతాధికారులు గెలీలియో ఎటువంటి ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. దీంతో క్రీ.శ.1630 వరకు గెలీలియో నోరు విప్పలేక పోయాడు. అయినా ఆయన తన వాదాలను విడిచి పెట్టలేదు. వాటిని పుస్తక రూపంలో వెలువరించాడు. 1632లో వెలువడిన ఈ "ఆతిజీశ్రీనీణబీవబ ఇనీనిఇవతీనితినిణ బిష్త్రవ బిలినీ ఇష్త్రతివట లినీతీశ్రీట బఎబబివఎబ" అనే గ్రంథం ఐరోపా ఖండంలో సారస్వత వేదాంత గ్రంథానికి ఉదాహరణగా పేర్కొంటారు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను వెల్లడించాడు. అయితే ఈ గ్రంథాన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్థించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. క్రీ.శ. 1637 లో పాపం గెలీలియో గుడ్డి వాడయ్యాడు. అంతటి మహానుభావుడు శిక్షను అనుభవిస్తూనే 1642, జనవరి 8 తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర్ఖత్వం బలిగొంది.

# వెనుజులా కొత్త అధ్యక్షురాలు కూడా బాబా భక్తురాలే

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం అమెరికా నిర్బంధంలో ఉన్న వెనుజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లే కాదు.. ప్రస్తుతం ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు కూడా భారత్‌తో ఆధ్యాత్మిక అనుబంధం ఏర్పరుచుకున్నారు. తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ సైతం పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబాకు భక్తురాలు కావడం చెప్పుకోదగ్గ విశేషం. ఉపాధ్యక్షురాలి హోదాలో పలుసార్లు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి వచ్చి, సాయికుల్వంత్ మందిరంలో బాబా మహా సమాధిని ఆమె దర్శించుకున్నారు. ఈ వివరాయి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానెల్‌లో ఉన్నాయి. ఆమె ఆగస్టు 2023, తర్వాత అక్టోబరు 2024లో వరుసగా సాయి ప్రశాంతి నిలయానికి వెళ్లి బాబా సమాధిని దర్శించుకోవడం సత్యసాయి పట్ల ఆమెకున్న నమ్మకానికి నిదర్శనం. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం.. వెనుజులాలోని పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రాలు.. సత్యసాయి బాబా, బ్రహ్మ కుమారీలు, రాధా స్వామి వంటి భారతీయ ఆధ్యాత్మికవేత్తలు, సంస్థలతో అనుబంధం ఏర్పరుచుకున్నాయి. ఇక, ఉపాధ్యక్షురాలి హోదాలో భారత్‌కు వచ్చిన డెల్సీ రోడ్రిగ్జ్ అక్టోబరు 26, 2024లో పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి వెళ్లారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. ఆమెతో పాటు భారత్‌లో వెనుజులా రాయబారి కపాయా రోడ్రిగ్జ్ గొంజాలెజ్ కూడా ఆ సమయంలో ఉన్నారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్.. ప్రశాంతి నిలయానికి వచ్చిన రోడ్రిగ్జ్‌కు స్వాగతం పలికి, ఆమెను ఆశ్రమం అంతా చూపించారు. ప్రశాంతి నిలయంలోని రెండు ముఖ్యమైన ఆధ్యాత్మిక ప్రదేశాలైె గర్భగుడి, శాంతి భవన్‌లో ఆమె కొంత సమయం గడిపారు. ఏడాది వ్యవధిలోనే రెండోసారి పుట్టపర్తికి రావడం పట్ల రోడ్రిగ్జ్ ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారని ట్రస్ట్ తెలిపింది. సత్యసాయి బాబా దివ్య సన్నిధిలో ఉండటం తనకు 'శాంతి, ప్రశాంతత'ను ఇచ్చిందని ఆమె చెప్పినట్లు పేర్కొంది. దీనికి ముందు ఆగస్టు 5, 2023న జీ20 శిఖరాగ్ర సమావేశానికి హాజరైన వెనిజులా ప్రతినిధి బృందంలో భాగంగా భారత్‌కు వచ్చిన రోడ్రిగ్జ్.. ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. ఈ పర్యటనను వ్యక్తిగతమైనదిగా ఆమె పేర్కొన్నారు. అలాగే, అక్టోబరు 2019లోనూ పలువురు వెనుజులా మంత్రులతో కలిసి రోడ్రిగ్జ్ పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి వచ్చి, బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఇక, నికోలస్ మదురోకు వివాహానికి ముందే తన భార్య ద్వారా సత్యసాయితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి బాబాకు భక్తుడిగా మారిపోయారు. వెనుజులా విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు 2005లో భారత్‌కు వచ్చిన మదురో దంపతులు.. బాబా ఆశీస్సులు తీసుకున్నారు.

## నాలుగో రోజూ రూపాయి క్షీణత




**హైదరాబాద్ పెన్ పవర్:** ట్రంప్ చర్యలు దలాల్ స్ట్రీట్‌ను బెంబేలెత్తించాయి. వెనిజులాపై అమెరికా అనుహ్య దాడితో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. మరోవైపు భారత్‌పై మరింత టారిఫ్‌లను పెంచుతామని యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ప్రకటించడంతో మదుపర్లను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఈ రెండు పరిణామాల నేపథ్యంలో ముఖ్యంగా ఐటి, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 322 పాయింట్లు లేదా 0.38 శాతం పతనమై 85,439.62కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 78.25 పాయింట్లు లేదా 0.3 శాతం నష్టంతో 26,250 వద్ద ముగిసింది. మార్కెట్లు ఆరంభంలో కాసేపు స్వల్ప లాభాల్లో సాగినప్పటికీ.. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్-30లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్ టెక్, బజాజ్ ఫైనాన్స్, టిసిఎస్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌యుఎల్, టాటా స్టీల్, అల్ట్రాటెక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ఎక్కువ లాభాల్లో ముగిశాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 0.16 శాతం నష్టపోగా.. స్మాల్ క్యాప్ 0.53 శాతం పెరిగింది. ఐటి, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు 1 శాతం చొప్పున అధికంగా నష్టపోయి మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. వరుసగా నాలుగో రోజూ రూపాయి విలువ పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోల్చితే సోమవారం మరో ఎనిమిది పైసలు తగ్గి 90.28కి పరిమితమయ్యింది. ఉదయం ఫారిన్ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో 90.21 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ 90.50 కనిష్ట స్థాయిని తాకింది. నాలుగు సెషన్లలో 53 పైసలు నష్టపోయింది. వెనిజులాలో అమెరికా సైనిక జోక్యంతో భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొనడం రూపాయిని ఒత్తిడికి గురి చేసిందని నిపుణులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో రూపాయి విలువ 90.60కు పడిపోయే అవకాశం ఉందని మిరే అసెట్ షేర్ ఖాన్ కమోడిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనుజ్ చౌదరి అంచనా వేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.76 వద్ద నమోదయ్యింది.

## ఎగుమతిదారుల్లో పెరిగిన ఆందోళన



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌పై ట్రంప్ అధిక టారిఫ్‌ల భయాలు మరింత పెరిగాయి. ఈ ఏడాది వేసవి కాలానికి గాను అమెరికాకు సరుకులను పంపించే ఎగుమతిదారుల్లో ఆందోళన నెలకొంది. భారత ఉత్పత్తులపై 50 శాతం అధిక టారిఫ్‌లతో అటు ఫ్యాక్టరీల్లోనూ, ఇటు కంపెనీ బోర్డు రూముల్లోనూ తీవ్ర ఒత్తిడి నెలకొందని రిపోర్టులు వస్తోన్నాయి.. భారతీయ వస్తువులపై అమెరికా విధించిన భారీ సుంకాలు, పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడంతో రాబోయే సీజన్ ఆర్డర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు.అమెరికా మార్కెట్‌ను వదులుకోలేక, భారతీయ సరఫరాదారులు తమ లాభాలను పణంగా పెడుతున్నారని జాతీయ మీడియాలో కథనాలు వస్తోన్నాయి. చాలా మంది ఎగుమతిదారులు సుమారు 20 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తుండగా, అమెరికా కొనుగోలుదారులు తమ మార్జిన్‌లను 7-8 శాతం తగ్గించుకున్నారని అంచనా. ఇతర దేశాల నుండి వచ్చే వస్తువులపై అమెరికా 15-20 శాతం సుంకాలు విధిస్తుంటే, భారతీయ ఉత్పత్తులపై ఏకంగా 50 శాతం వరకు టారిఫ్‌లను వేస్తోన్న విషయం తెలిసిందే. ఇంతటి భారీ భారాన్ని ఎక్కువ కాలం భరించడం అసాధ్యమని ఎగుమతిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోలు, దుస్తులు, పాదరక్షల రంగాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. ఒకవేళ వాణిజ్య ఒప్పందం కుదరకపోతే అమెరికా కొనుగోలుదారులు వియత్నాం లేదా బంగ్లాదేశ్ వంటి ఇతర దేశాల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఇది లక్షలాది మంది ఉపాధిపై ప్రభావం చూపనుందని వాణిజ్యవేత్తలు, ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు. అమెరికాతో అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఎగుమతిదారులు ఇప్పుడు ఐరోపా వైపు చూస్తున్నారు. యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలు జరుగుతున్నప్పటికీ, అది కార్యరూపం దాల్చడానికి, ప్రయోజనాలు అందడానికి మరికొన్ని నెలల సమయం పట్టవచ్చని ఆ వర్గాలు అంచనా వేస్తోన్నాయి.

## తగ్గనున్న రష్యా చమురు దిగుమతులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది జనవరిలో రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు క్షీణించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ దిగ్గజ రిలయన్స్ ఇండస్ట్రీస్ రష్యా చమురు డెలివరీలు ఉంటాయని అనుకోవట్లేదని ప్రకటన విడుదల చేయడమే ఇందుకు నేపథ్యం. దీంతో ఈ నెలలో చమురు దిగుమతులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఇటీవల రిలయన్స్ సంస్థ రష్యా చమురును దిగుమతి చేసుకుంటోందని గ్లోబల్ మీడియా సంస్థ బ్లూమ్‌బర్గ్ కథనం తెలిపింది. సుమారు 22 లక్షల బ్యారెళ్ల రష్యా చమురు ఉన్న మూడు నౌకలు రిలయన్స్‌కు చెందిన జామ్‌నగర్ రిఫైనరీ వైపు వెళ్లాయని, జనవరిలో డెలివరీ అవుతాయని పేర్కొంది. దీనిపై స్పందించిన సంస్థ, అటువంటిదేమీ లేదని, తమపై తప్పుడు కథనాలు వెలువడుతున్నాయని, అసత్యాలతో సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంగళవారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో వెల్లడించింది. గడిచిన మూడు వారాల్లో జామ్‌నగర్ రిఫైనరీకి ఎలాంటి రష్యా నౌకలు రాలేదని, జనవరి నెలకు సంబంధించిన డెలివరీలను కూడా తిరస్కరించామని స్పష్టం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు వ్యవహారంలో భారత్‌పై అమెరికా అధిక సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. సుంకాలను మరింత పెంచవచ్చని ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో బ్లూమ్‌బర్గ్ కథనం వెలువడం రిలయన్స్ సంస్థ అధికారిక ప్రకటన ద్వారా స్పష్టత ఇచ్చింది.

## 2025లో 8 శాతం పెరిగిన వాహన రిటైల్ అమ్మకాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ వాహన పరిశ్రమలో రిటైల్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయని ఆటోమొబైల్ డీలర్ల సంఘం ఫాడా ప్రకటనలో వెల్లడించింది. 2025లో దేశవ్యాప్తంగా మొత్తం 2,81,61,228 యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి.ఇది 2024లో అమ్ముడైన 2,61,45,445 యూనిట్లతో పోలిస్తే 7.71 శాతం అధికం. దీనికి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ 2.0 సంస్కరణలు భారీ అమ్మకాలకు దోహదపడ్డాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్(ఫాడా) అభిప్రాయపడింది. మొత్తం అమ్మకాల్లో ప్యాసింజర్ కార్ల అమ్మకాలు 40,79,532 యూనిట్లతో 9.7 శాతం వృద్ధి చెందాయి. ఆ తర్వాత టూవీలర్ విభాగంలో 2,02,95,650 యూనిట్లు(7.24 శాతం వృద్ధి), త్రీ-వీలర్ రిటైల్ అమ్మకాలు 13,09,953 యూనిట్లు(7.21 శాతం వృద్ధి), కమర్షియల్ వాహనాల విభాగం 10,09,654 యూనిట్ల(6.71 శాతం వృద్ధి) విక్రయాలు నమోదయ్యాయి. కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యక్ష పన్నుల ఉపశమనం, 2025 ఏడాది పొడవునా ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్ల కోత వంటి కీలక చర్యలు అమ్మకాలకు మద్దతిచ్చాయని ఫాడా అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ అన్నారు. గతేడాది ప్యాసింజర్ వాహనాల విక్రయాలకు గ్రామీణ మార్కెట్ ఎక్కువ సహకారం అందించింది. ఈ విభాగంలో పట్టణ ప్రాంత అమ్మకాలు 8 శాతం పెరగ్గా, గ్రామీణ ప్రాంతాల్లో 12 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాలలో దాదాపు 33 శాతం సీఎన్‌జీ, హైబ్రిడ్లు, ఈవీ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు ఉన్నాయి. సీఎన్‌జీ అమ్మకాలు 18 శాతం నుంచి 21 శాతానికి పెరగ్గా, ఈవీలు 2.4 శాతం నుంచి 4 శాతానికి పెరిగాయి. అయితే హైబ్రిడ్లు 8.7 శాతం నుంచి 8.2 శాతానికి తగ్గాయని ఫాడా పేర్కొంది.

# ఉదయాన్నే తిన్నారనుకోండి..!



శీతాకాలంలో ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది ఫైబర్, ఐరన్ లాంటి ముఖ్య పోషకాలతో నిండి ఉంటుంది. కీళ్ల నొప్పులు, అలసట, జలుబు లాంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. శీతాకాలంలో ఎండు ఖర్జూరం తినొచ్చా.? లేదా.? ఇది అందరిలోనూ ఉండే ప్రశ్న. ఈ వింటర్ సీజన్‌లో ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. ఎండు ఖర్జూరం ఎముకలను బలంగా మార్చడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరిచడంలో సహాయపడుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా చలికాలంలో కొన్ని ప్రత్యేకమైన డ్రై ఫ్రూట్స్ తీసుకుంటే శరీరానికి మరింత శక్తి, రోగనిరోధక శక్తి లభిస్తాయి. అలాంటి వాటిలో ఎండు ఖర్జూరం ఒకటి. ఎండు ఖర్జూరంలో ఫైబర్, పొటాషియం, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి లాంటి కీలక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక రకాల వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా చలికాలంలో వచ్చే ఎముకల నొప్పులు, జీర్ణ సమస్యలు, అలసట లాంటి సమస్యలకు ఎండు ఖర్జూరం మంచి ఔషధంలా పనిచేస్తుంది. చలికాలంలో చాలామందికి నడుము నొప్పి, కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఇలాంటి సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు ఎండు ఖర్జూరం చాలా ఉపయోగపడుతుంది. రాత్రి ఒక గ్లాసు నీటిలో రెండు ఎండు ఖర్జూరాలు, ఒక చెంచా మెంతులు నానబెట్టి ఉంచి.. ఉదయం లేచిన వెంటనే ఖర్జూరాలను నమిలి తిని, ఆ నీటిని వడగట్టి తాగాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేస్తే శరీరంలోని నొప్పులన్నీ క్రమంగా తగ్గుతాయి. ఎప్పుడూ అలసటగా ఉండటం, శరీరంలో శక్తి లేకపోవడం లాంటి సమస్యలు ఉంటే ఎండు ఖర్జూరం మంచి పరిష్కారం. రాత్రి పూట లేదా ఉదయం ఎండు ఖర్జూరం తినడం వల్ల శరీరానికి ఎనర్జీ వస్తుంది. అలాగే ఐరన్ అధికంగా ఉండటం వల్ల రక్తహీనత సమస్య ఉన్నవారికి ఇది ఎంతగానో ఉపయోగకరం. ఇది శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడి, రక్తహీనత లక్షణాలైన అలసటను తగ్గిస్తుంది. చలికాలంలో ఛాతిలో కఫం చేరడం, దగ్గు, జలుబు లాంటి శ్వాస సంబంధిత సమస్యలు సర్వసాధారణం. రెండు ఎండు ఖర్జూరాలను బాగా నమిలి తిని, తర్వాత కొద్దిగా గోరువెచ్చని నీరు తాగితే కఫం కరిగి బయటకు రావడంలో సహాయపడుతుంది. తద్వారా శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఎండు ఖర్జూరంలో ఫైబర్, మెగ్నీషియం అధికంగా ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థ బలపడుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ లాంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. క్రమం తప్పకుండా ఎండు ఖర్జూరం తీసుకోవడం వల్ల పేగులు ఆరోగ్యంగా పనిచేస్తాయి. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ఎండు ఖర్జూరం కీలకపాత్ర పోషిస్తుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె పనితీరును బలోపేతం చేస్తుంది. అలాగే, రోగనిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో సమృద్ధిగా ఉంటాయి. వీటి వల్ల జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధుల నుంచి శరీరం రక్షణ పొందుతుంది. చలికాలంలో ఎండు ఖర్జూరం తీసుకోవడం శరీరానికి చాలా మంచిది. రోజు పరిమిత మోతాదులో తీసుకుంటే శక్తి, ఆరోగ్యం రెండు మెరుగవుతాయి. అయితే, మధుమేహం ఉన్నవారు మాత్రం వైద్యుల సలహాతో మాత్రమే తీసుకోవడం మంచిది.

# ఏ టిఫిన్ బాక్స్ ఆరోగ్యానికి మంచిది..?



మీ ఆరోగ్యాన్ని కాపాడటానికి సరైన టిఫిన్ బాక్స్‌ను ఎంచుకోవడం ముఖ్యం. ప్లాస్టిక్ బాక్స్‌లు హానికరమైన రసాయనాలను విడుదల చేసి దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తాయి. కాబట్టి మంచి టిఫిన్ బాక్సులు ఎంచుకోవడం బెటర్. సాధారణంగా మనం ఆరోగ్యంగా ఉండాలని పోషకాలున్న ఆహారాన్ని వండుకుంటాం. కానీ ఆ ఆహారాన్ని దేనిలో తీసుకెళ్తున్నాం అనే విషయాన్ని మాత్రం పట్టించుకోం. మార్కెట్‌లో దొరికే రంగురంగుల డిజైన్లు, తక్కువ ధర చూసి మనం ఎంచుకునే టిఫిన్ బాక్స్‌లు మన ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా భారతీయ ఇళ్లలో ఎక్కువగా కనిపించే స్టీల్ టిఫిన్లే అత్యంత సురక్షితమైనవి. ఇవి రసాయన రహితం, మన్నికైనవి, తేలికగా ఉంటాయి. ఆహారం రుచిని, పోషకాలను ఇవి మార్చవు. వీటిని మైక్రోవేవ్‌లో పెట్టలేము. ద్రవ పదార్థాల కోసం లీక్-ప్రూఫ్ మూతలు ఉన్న వాటినే ఎంచుకోవాలి. స్కూలుకు వెళ్లే పిల్లలకు, ఆఫీసులకు వెళ్లే వారికి ఇది అత్యంత ఉత్తమమైన ఎంపిక. ఆధునిక జీవనశైలిలో గాజు టిఫిన్ల వినియోగం పెరుగుతోంది. గాజు రసాయన రహితమైనది. ఆహారం వాసన రాకుండా ఉంటుంది. ఆఫీసుల్లో నేరుగా మైక్రోవేవ్‌లో వేడి చేసుకోవడానికి ఇది వీలుగా ఉంటుంది. ఇవి బరువుగా ఉంటాయి. కింద పడితే విరిగిపోయే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా వాడగలిగే పెద్దలకు, ఆఫీసు ఉద్యోగులకు ఇది మంచిది. పాత కాలంలో ఇత్తడి పాత్రలనే వాడేవారు. దీని వెనుక శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. ఇత్తడిలో ఆహారం ఉంచడం వల్ల శరీరానికి అవసరమైన ఖనిజాలు అందుతాయి. ఇది బాక్టీరియా పెరగకుండా చూస్తుంది. నిమ్మకాయ, టమోటా వంటి ఆమ్ల ఆహారాలతో ఇత్తడి ప్రతిచర్య జరుపుతుంది. అలాగే వీటిని శుభ్రం చేయడం, మెరిసేలా చూసుకోవడం కాస్త కష్టమైన పని. ఇంట్లో ఉండేవారికి, చిన్న ప్రయాణాలు చేసే వారికి ఇది అనుకూలం. చౌకగా దొరుకుతాయని ప్లాస్టిక్ బాక్సుల వైపు వెళ్లడం ఆరోగ్యానికి చేటు. బరువు తక్కువ, రంగురంగుల డిజైన్లలో లభిస్తాయి. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్‌లో ఉంచినప్పుడు అది హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుంది. ఇది దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉంది. అత్యవసరమైతే తప్ప ప్లాస్టిక్ వాడకపోవడమే మంచిది.

# పొద్దుతిరుగుడు సూపర్ బెనిఫిట్స్..




మహిళల హార్మోన్ల సమతుల్యత, ఋతుక్రమ నొప్పుల ఉపశమనానికి పొద్దుతిరుగుడు విత్తనాలు అద్భుత ఔషధం. వీటిలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. చిరాకు, కోపాన్ని తగ్గించి, క్యాన్సర్, గుండె జబ్బుల నుండి రక్షణ కల్పిస్తాయి. ఎముకల బలోపేతానికి, డయాబెటిస్ నియంత్రణకు కూడా సహాయపడతాయి. మహిళల శరీరంలో హార్మోన్ల సమతుల్యతలో అనేక హెచ్చుతగ్గులు ఉంటాయి. వయసు పెరిగే కొద్దీ ఈ మార్పులు వారిని చాలా ఇబ్బంది పెట్టడం ప్రారంభిస్తాయి. దీని కారణంగా వారు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. మహిళలు తరచుగా చిరాకుగా కనిపిస్తుంటారు. చిన్న విషయాలకే కోపంగా ఉండటం ప్రారంభిస్తారు. దీంతో పాటు పీరియడ్స్ సమయంలో తీవ్రమైన కడుపు, వెన్నునొప్పి సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది మహిళలకు ఎక్కువ రోజుల ముందుగానే పీరియడ్స్ నొప్పులు రావడం ప్రారంభిస్తాయి.. అలాంటి మహిళలు సమస్యను ఎలా వదిలించుకోవాలో తెలియక చాలా ఆందోళన చెందుతారు. కానీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. ఎందుకంటే..అటువంటి పరిస్థితుల్లో కొన్ని విత్తనాలు మీకు ఆరోగ్యానిస్తాయి. అందులో ఒకటి పొద్దుతిరుగుడు. పొద్దుతిరుగుడు విత్తనాలు చాలా శక్తివంతమైనవి. దీనిలో ప్రోటీన్, కొవ్వు మంచి పరిమాణంలో ఉంటుంది. అంతేకాదు.. అనేక రకాల విటమిన్లు, జింక్, మాంగనీస్, రాగి, మెగ్నీషియం, ఇనుము, పాంతోతేనిక్ ఆమ్లం వంటివి సమృద్ధిగా లభిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఇతర విత్తనాల కంటే ఎక్కువ విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అంతేకాదు..క్యాన్సర్‌ను నివారించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. థైరాయిడ్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు కూడా పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవాలి. ఇది ఎముకలను బలపరుస్తుంది. కణాల పెరుగుదలకు సహాయపడుతుంది. ఈ విత్తనంలో సరైన మొత్తంలో అయోడిన్, సెలీనియం ఉంటాయి. ఇది థైరాయిడ్ హార్మోన్‌ను సమతుల్యం చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలను క్రమం తప్పకుండా తీసుకుంటే అనేక రకాల క్యాన్సర్‌ల నుండి రక్షించుకోవచ్చు. ఈ విత్తనాల్లోని విటమిన్ ఇ క్యాన్సర్ నిరోధకమే కాకుండా గుండెను బలంగా చేయడంలో కూడా చాలా శక్తివంతమైనది. ఇది గుండె నుండి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగిస్తుంది. ట్రైగ్లిజరైడ్‌లను కూడా తగ్గిస్తుంది. గుండెలో మంటను నివారిస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో అనేక రకాల ఖనిజాలు ఉంటాయి. వాటిలో మెగ్నీషియం, పాంటోథెనిక్ ఆమ్లం ఉన్నాయి. ఇవి కండరాల నొప్పులను తగ్గిస్తాయి. అందువల్ల, కండరాల సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. ఇది శరీరం నుండి ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.



# ప్రతి రోజూ టమోటా తింటే ఏమవుతుంది?

టమోటాలతో ప్రత్యేక సూప్‌లు, సాస్‌లు, చట్నీలను కూడా తయారు చేస్తారు. వంటల రుచిని పెంచే ఈ జ్యుసి టమాటాలు పోషకమైన ఆహారంగా పనిచేస్తాయి. మీ ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. కానీ, ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? అన్ని కూరగాయల్లో కెల్లా టమాటాది ప్రత్యేక స్థానం. ఎందుకంటే.. వంట ఏదైనా సరే.. టమాటా లేనిదే అసంపూర్ణం అని చెప్పాలి. వివిధ రకాల కూరగాయలు, సలాడ్‌లతో సహా అనేక వంటలలో ఉపయోగిస్తారు. టమోటాలతో ప్రత్యేక సూప్‌లు, సాస్‌లు, చట్నీలను కూడా తయారు చేస్తారు. వంటల రుచిని పెంచే ఈ జ్యుసి టమాటాలు పోషకమైన ఆహారంగా పనిచేస్తాయి. మీ ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. కానీ, ప్రతిరోజూ టమోటాలు తినడం వల్ల మీ శరీరంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? విటమిన్ సి, పొటాషియం, లైకోపీన్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం, చర్మం, జీర్ణవ్యవస్థకు ఇవి ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో పేరుకుపోయిన మలినాలు బయటకు పోతాయి. రోజూ పచ్చి టమాటా తింటే బీపీ తగ్గడంతో పాటు కొలెస్ట్రాల్ లెవెల్స్ కంట్రోల్ లో ఉంటాయి. ఇమ్యూనిటీ కూడా పెరుగుతుంది. టమాటాలో విటిన్ సి ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరగడానికి ఇది చాలా కీలకం. టమాటా యాంటీ ఆక్సిడెంట్ లా కూడా పని చేస్తుంది. బాడీ సెల్స్ డ్యామేజ్ కాకుండా అడ్డుకుంటుంది. చర్మ ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. స్కిన్ ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. టమాటాతో జీర్ణ శక్తి పెరుగుతుంది. అందుకు కారణం ఏంటంటే..టమాటాలో ఫైబర్ అధికంగా ఉంటుంది. టమాటాలో విటమిన్ కె సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను బలంగా ఉంచుతుంది. బ్లడ్ క్లాటింగ్ లేకుండా చూస్తుంది.

# వంటగదిలో ఈ తప్పులు చేస్తున్నారా..!



హిందూ ధర్మశాస్త్రం ప్రకారం.. ఇల్లు కేవలం నివాసం మాత్రమే కాదు.. అది శక్తి నిలయం. ముఖ్యంగా ఇంట్లోని వంటగది అత్యంత పవిత్రమైన ప్రాంతం. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, ఐశ్వర్యం, శ్రేయస్సుకు మూలమైన అన్నపూర్ణేశ్వరి దేవి కొలువయ్యే స్థానం ఇది. అయితే మనం తెలియకుండా చేసే కొన్ని చిన్న తప్పులు వంటగదిలో వాస్తు దోషాలను కలిగించి, తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు, కుటుంబ కలహాలకు దారితీస్తాయని వాస్తు నిపుణులు హెచ్చరిస్తున్నారు. మురికి పాత్రలు: చాలామంది రాత్రి పూట భోజనం చేసిన తర్వాత పాత్రలను కడగకుండా సింక్‌లోనే వదిలేసి, ఉదయాన్నే శుభ్రం చేస్తుంటారు. వాస్తు ప్రకారం ఇది అత్యంత ప్రమాదకరం. రాత్రంతా ఉండే మురికి పాత్రలు ప్రతికూల శక్తిని పెంచుతాయి. ఇది లక్ష్మీదేవి రాకను అడ్డుకోవడమే కాకుండా, ఇంట్లో అనవసర ఖర్చులను పెంచుతుందని వాస్తు శాస్త్రం చెబుతోంది. అగ్ని - నీరు: వంటగదిలో స్టవ్, సింక్ లేదా వాటర్ ట్యాప్ ఒకదానికొకటి చాలా దగ్గరగా లేదా ఒకే వరుసలో ఉండకూడదు. అగ్ని, నీరు విరుద్ధ అంశాలు కావడం వల్ల ఇవి దగ్గరగా ఉంటే దంపతుల మధ్య గొడవలు, అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మందులు-విరిగిన పాత్రలు: వంటగదిని కేవలం ఆహారానికి మాత్రమే పరిమితం చేయాలి. వంటగదిలో మెడికల్ కిట్‌లు లేదా మందులు ఉంచడం అశుభం. ఇది ఇంట్లోని వారు తరచూ అనారోగ్యం పాలయ్యేలా చేస్తుంది. పగిలిన పాత్రలు ఆర్థిక నష్టానికి, పేదరికానికి సంకేతం. వాటిని వెంటనే తొలగించాలి. స్టవ్ పైన లేదా వంటగదిలో అద్దం, దేవతల ఫోటోలు ఉంచడం వాస్తు విరుద్ధం. శుభప్రదమైన దిశలు: వంట చేసేటప్పుడు ఎల్లప్పుడూ తూర్పు వైపు ముఖం ఉంచడం శ్రేయస్కరం. దక్షిణం వైపు తిరిగి వంట చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. వాస్తు ప్రకారం వంటగది ఆగ్నేయ మూలలో ఉండటం అత్యంత శుభప్రదం. వంటగదిలోకి చెప్పులు ధరించి రావడం వల్ల ఆహార స్వచ్ఛత దెబ్బతింటుంది. వంటగదిని ఎల్లప్పుడూ శుభ్రంగా, గాలి వెలుతురు వచ్చేలా ఉంచుకోవాలి. ప్రతిరోజూ సాయంత్రం వంటగదిలో ఒక చిన్న దీపం లేదా వెలుగు ఉండేలా చూసుకోవడం వల్ల ఇంట్లో సిరిసంపదలు వృద్ధి చెందుతాయని వాస్తు పండితులు సూచిస్తున్నారు.

# ఇటీవల పెరుగుతున్న కొత్త అనారోగ్యం!

సోషల్ మీడియాలో నిమగ్నమైనప్పుడో, వీడియోలు స్క్రోల్ చేస్తున్నప్పుడో ఒక్కసారిగా తలతిరగడం, వికారం, తలనొప్పి వంటి సమస్యలు మీలో తలెత్తుతున్నాయా? అయితే అది సైబర్ సిక్‌నెస్ వల్ల కావచ్చు! అంటున్నారు నిపుణులు. డిజిటల్ పరికరాలను అతిగా ఉపయోగించడంవల్ల వచ్చే మోషన్ సిక్‌నెస్ రకాల్లో ఇదొకటి. మొబైల్, కంప్యూటర్, వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్ వంటివి ఉపయోగిస్తున్నప్పుడు, హెడ్‌సెట్ ధరించి వర్చువల్ ప్రపంచంలో మోషన్ (కదలిక) అనుభవిస్తున్నప్పుడు తలెత్తుతుంది. ఎందుకంటే కళ్లు వర్చువల్‌లో రన్నింగ్, ఫ్లయింగ్ వంటి కదులుతున్న దృశ్యాలను చూస్తుంటాయి. కానీ శరీరం నిజంగా స్థిరంగా ఉంటుంది. ఈ పరిస్థితి మెదడుకు విజువల్ (కళ్లు) అండ్ వెస్టిబ్యులర్ (ఇన్నర్ ఇయర్ బ్యాలెన్స్) సిగ్నల్స్ మధ్య అసమతుల్యతకు, అసమంజసత్వానికి కారణం అవుతుంది. దీనినే స్నరీ కాన్‌ఫ్లిక్ట్ అంటారు.నిజానికి కొవిడ్ మహమ్మారి సమయంలో లాక్ డౌన్, భౌతిక దూరం వంటి కారణాలతో రిమోట్ వర్క్, ఆన్‌లైన్ సోషలైజేషన్ పెరిగింది. దీంతో సహజంగానే స్క్రీన్ టైమ్ కూడా పెరిగింది. ఈ పరిస్థితి సైబర్ సిక్‌నెస్‌ను కూడా మరింత ఎక్కువ చేసింది. మొదట వర్చువల్ రియాలిటీలో గుర్తించబడిన ఈ సమస్య, కళ్లు చూసే విజువల్ మోషన్, శరీరం అనుభవించే స్థిరత్వం మధ్య అసమంజసత్వం వల్ల వస్తుంది. ఈ సందర్భంగా నిపుణులు కనుగొన్నారు. దీనినే సెన్సరీ కాన్ఫ్లక్ట్ థియరీగా పేర్కొన్నారు. అయితే ఇది మరీ కొత్తదేమీ కాదు. పురాతన కాలంలో కూడా మరో రూపంలో మోషన్(కదలిక) సిక్‌నెస్ ఉండేది. ఉదాహరణకు సముద్ర అనారోగ్యం 800 ఃఅఇ నాటిది, కానీ నేటి డిజిటల్ యుగంలో ఇది సోషల్ మీడియా స్క్రోలింగ్, గేమింగ్ వంటి కార్యకలాపాల్లో కనిపిస్తోంది. ఇది నిజమైన కదలిక లేదా స్థానచలనం లేని పరిస్థితుల్లో, కళ్లు మాత్రమే వర్చువల్‌గా కదలికలను చూస్తూ ఉన్నప్పుడు మెదడు గందరగోళానికి గురవుతుంది. దీంతో తలనొప్పి, తల తిరగడం, వికారం వంటివి తలెత్తుతాయి. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లలో నిమగ్నమై పోవడం, సోషల్ మీడియాలో గంటల తరబడి గడపడం ఇందుకు కారణం అవుతున్నదని నిపుణులు చెబుతున్నారు. లాంగ్ స్క్రీన్ టైమ్, ఫాస్ట్ మూవింగ్ కంటెంట్, అలాగే మోషన్ సిక్‌నెస్ హిస్టరీ ఉన్నవారిలో ఈ సమస్య మరింత అధికం అవుతుంది.తలనొప్పి, తల తిరగడం, కళ్లు తిరగడం, కళ్లపై ఒత్తిడి లేదా అలసట, శరీరంపై చెమటలు పట్టడం, వికారం, కొన్నిసార్లు వాంతింగ్స్ అవడం వంటివి సైబర్ సిక్‌నెస్ లేదా మోషన్ సిక్‌నెస్ లక్షణాలుగా పేర్కొనవచ్చు. ఇవి స్క్రీన్ చూడటం ఆపేసిన తర్వాత కూడా కొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చు. సాధారణంగా స్క్రీన్‌టైమ్ తగ్గించడం లేదా లక్షణాలు తగ్గే వరకు డిజిటల్ పరికరాలు, స్క్రీన్‌లకు దూరంగా ఉండటంవంటి నివారణ చర్యలతో సమస్యకు పరిష్కారం లభిస్తుంది. సైబర్‌సిక్‌నెస్‌కు ప్రత్యేక చికిత్స అంటూ ఏదీ లేదు. ఆన్‌లైన్‌లో లేదా సోషల్ మీడియాలో తరచుగా నిమగ్నమయ్యేవారు ప్రతీ 20 లేదా 30 నిమిషాలకు బ్రేక్ తీసుకోవాలి. లేదా 20-20-20 రూల్ ఫాలో కావాలి. అంటే ప్రతీ 20 నిమిషాలకు ఒకసారి 20 సెకన్లు బ్రేక్ తీసుకొని, 20 అడుగుల దూరంలో పరిసరాలను చూడాలి. ముఖ్యంగా స్క్రీన్ టైమ్ తగ్గించంచడం, సరైన దూరం పాటించడం, స్క్రీన్ సెట్టింగ్స్‌లో బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్ తగ్గించడం, మోషన్ స్మూత్‌నెస్ పెంచడం వంటివి నివారణలో భాగమని చెప్పవచ్చు. అలాగే నీళ్లు ఎక్కువగా తాగడంవల్ల బాడీ హైడ్రేటెడ్‌గా ఉండి సిక్‌నెస్ లక్షణాల ప్రభావాన్ని తగ్గిస్తుంది.



# వైభవ్ సూర్యవంశీ విధ్వంసక శతకం.. కేవలం 63 బంతుల్లోనే సెంచరీ

మూడో వన్డేలో చెలరేగిన భారత యువ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ

కేవలం 63 బంతుల్లోనే శతకంతో విధ్వంసం

గత మ్యాచ్‌లోనూ 24 బంతుల్లో 68 పరుగులు చేసిన వైభవ్

ఇప్పటికే 2-0తో సిరీస్ కైవసం చేసుకున్న భారత్

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగిన యంగ్ ఇండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లో భారత యువ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఇప్పటికే 2-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు, క్లీన్‌స్వీప్ లక్ష్యంగా ఆడుతున్న మూడో, చివరి వన్డేలోనూ దుమ్మురేపుతోంది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ వైభవ్ కేవలం 63 బంతుల్లోనే విధ్వంసక శతకం బాదాడు.తన ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 8 సిక్సర్లు కొట్టిన వైభవ్.. దక్షిణాఫ్రికా బౌలర్లకు చుక్కలు చూపించాడు. మొత్తంగా 127 రన్స్ చేసి ఔటయ్యాడు. మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ కూడా రాణిస్తుండటంతో భారత్ వికెట్ నష్టపోకుండా పటిష్ఠ స్థితిలో ఉంది. గత మ్యాచ్‌లోనూ వైభవ్ ఇదే తరహాలో చెలరేగిన విషయం తెలిసిందే.

వర్షం కారణంగా కుదించిన ఆ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 24 బంతుల్లో 10 సిక్సర్లతో 68 పరుగులు చేసి ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. ఆ మ్యాచ్‌లో బౌలర్లు కూడా రాణించారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ కిషన్ సింగ్ 4 వికెట్లు పడగొట్టగా, దక్షిణాఫ్రికా తరపున జాసన్ రౌల్స్ (114) సెంచరీతో పోరాడాడు.

ఈ సిరీస్‌లో కెప్టెన్‌గా, బ్యాటర్‌గా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నాడు. మూడో మ్యాచ్‌లోనూ సెంచరీతో చెలరేగి, 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసే దిశగా జట్టును నడిపిస్తున్నాడు.

# విజయానికి 6 బంతుల్లో 13 పరుగులు.. గెలిపిస్తావనుకుంటే ఇలా చేశావేంటి వార్నర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ వరల్డ్ క్రికెట్ లో ఎలాంటి ముద్ర వేశాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా టీ 20 క్రికెట్ లో వార్నర్ మ్యాచ్ విన్నర్. ఓపెనర్ గా బరిలోకి దిగి భారీ ఇన్నింగ్స్ లు ఆడడంలో ఈ ఆసీస్ మాజీ ఓపెనర్ దిట్ట. ఐపీఎల్ లో రెండు సార్లు ఆరెంజ్ క్యాప్ గెలుచుకోవడమే కాకుండా ఈ మెగా టోర్నీలో వన్ ఆఫ్ ది బెస్ట్ ప్లేయర్ గా నిలిచాడు. అంతర్జాతీయ క్రికెట్ కు ఎప్పుడైతే డేవిడ్ రిటైర్మెంట్ ప్రకటించాడో అప్పటి నుంచి ఫామ్ తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోలోని బిగ్ బాష్ లీగ్ ఆడుతూ తన క్రికెట్ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. వార్నర్ ఎంతటి ప్రమాదకర బ్యాటర్ అయినప్పటికీ ప్రస్తుతం ఆ రేంజ్ లో ఆడలేకపోతున్నాడు. బిగ్ బాష్ లీగ్ లో వేగంగా పరుగులు చేయడంలో తడబడుతున్నాడు. సిడ్నీ థండర్ తరపున ఆడుతున్న వార్నర్ మంగళవారం (జనవరి 6) అడిలైడ్ స్ట్రైకర్స్ తో జరిగిన మ్యాచ్ లో తమ జట్టును గెలిపించడంలో విఫలమయ్యాడు. థండర్ విజయానికి చివరి ఓవర్లో 13 పరుగులు అవసరం అయ్యాయి. వార్నర్ చివరి వరకు క్రీజ్ లో ఉండి జట్టు ఆశలను సజీవంగా ఉంచాడు. వార్నర్ క్రీజ్ లో ఉండడంతో ఫ్యాన్స్ థండర్ విజయం ఖాయమనుకున్నారు. అయితే అనుకున్నది ఏమీ జరగలేదు. స్ట్రైకర్స్ బౌలర్ ల్యాక్ వుడ్ ధాటికి పరుగులు చేయలేకపోయాడు. తొలి మూడు బంతుల్లో వార్నర్ కనీసం సింగిల్ తీయలేకపోయాడు. మూడు డాట్ బాల్స్ కావడంతో చివరి మూడు బంతులకు 12 పరుగులు చేయాల్సిన పరిస్థితి. నాలుగో బంతికి సింగిల్ తీశాడు. దీంతో సమీకరణం 2 బంతుల్లో 12 పరుగులకు చేరింది. నాన్ స్ట్రైకర్ లో ఉన్న మెక్ డోనాల్డ్ సిక్సర్ కొట్టడంలో విఫలం కావడంతో మ్యాచ్ అడిలైడ్ గెలిచింది. చివరి బంతికి సింగిల్ రావడంతో ఈ మ్యాచ్ లో అడిలైడ్ స్ట్రైకర్స్ 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. వార్నర్ 51 బంతుల్లో 67 పరుగులు చేసి అజేయంగా నిలిచినప్పటికీ పరాజయం తప్పలేదు. అప్పటివరకు జట్టుకు హీరోలా చివరి వరకు నిలబడిన వార్నర్.. చివర్లో బ్యాట్ ఝులిపించలేక మ్యాచ్ ఓటమికి కారణమయ్యాడు. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన అడిలైడ్ స్ట్రైకర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. ఛేజింగ్ లో థండర్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 157 పరుగులకే పరిమితమైంది.

## బంగ్లాదేశ్ ట్విస్ట్‌ను కొట్టిపారేసిన ఐసీసీ.. ఇండియాలో వరల్డ్ కప్ ఆడకపోతే పాయింట్లు కోల్పోయినట్టే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026కి ఇండియా, శ్రీలంక ఆతిధ్యం ఇస్తున్నాయి. ఫిబ్రవరి 7 నుంచి జరగనున్న ఈ మెగా టోర్నమెంట్ లో బంగ్లాదేశ్ తమ లీగ్ మ్యాచ్ లన్నీ ఇండియాలోనే ఆడాల్సి ఉంది. అయితే ఇండియా, బంగ్లాదేశ్ దేశాల ఉద్రిక్తల పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇండియాలో వరల్డ్ కప్ ఆడడానికి నిరాకరించింది. భద్రత కారణాలు వంకగా చూపిస్తూ ఇండియా వచ్చి ఆడేది లేదని ఐసీసీకి స్పష్టం చేసింది. తమ మ్యాచ్ లన్నీ శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి వివరించింది. ఐసీసీ మాత్రం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నిర్ణయాన్ని కొట్టిపారేసింది. బంగ్లాకు షాక్ ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

బంగ్లాదేశ్ తమ మ్యాచ్ లన్నీ శ్రీలంకకు మార్చాలనే ట్విస్ట్ ను ఐసీసీ కొట్టి పారేసినట్టు సమాచారం. జుగాుచీజతీఅఎఱఅటశీ నివేదించడంతో ఇది దాదాపు నిజమని స్పష్టమవుతోంది. టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనాలంటే బంగ్లాదేశ్ ఇండియాకి వెళ్లాల్సి ఉంటుందని.. ఒకవేళ మ్యాచ్ లు ఆడలేకపోతే పాయింట్లు కోల్పోయే ప్రమాదం ఉందని బీసీబీకి ఐసీసీ క్లియర్ గా చెప్పినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే ఐసీసీ ఇంకా తమకు అలాంటి అల్టిమేటం ఇవ్వలేదని బీసీబీ చెప్పుకొస్తుంది. మరి ఈ విషయంలో బంగ్లాదేశ్ క్రికెటర్ బోర్డు వెనక్కి తగ్గుతుందో లేదా మ్యాచ్ ఆడకుండా పాయింట్లు కోల్పోతుందేమో చూడాలి.

**అసలేం జరిగిందంటే..?**


2026 టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు ఇండియాకు వెళ్లడం ఇష్టం లేదని ఐసీసీకి బంగ్లాదేశ్ ఈమెయిల్ ద్వారా తెలిపింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను ఐపీఎల్ 2026 నుంచి తొలగించిన తర్వాత బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తక్షణమే ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత ఇండియా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుల మధ్య ఉద్రిక్తతను తగ్గించడానికి ఐసీసీ ప్రయత్నాలు చేసింది. 2026 టీ20 ప్రపంచ కప్ లో బంగ్లాదేశ్ ఆడబోయే మ్యాచ్ లను ఇండియా నుంచి శ్రీలంకకు తరలించాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ట్విస్ట్ ను ఐసీసీ ఒకసారి పునరాలోచించమని కోరింది. బీసీబీ తమ విజ్ఞప్తిని వెనక్కి తీసుకోవడానికి ఐసీసీ నుండి సమయం కోరింది.

**ఇండియాలో నాలుగు లీగ్ మ్యాచ్ లు:**

టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ప్రకారం ఇండియాలో బంగ్లాదేశ్ మొత్తం నాలుగు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. మూడు కోల్‌కతాలో ఒకటి ముంబైలో జరగనుంది. ఫిబ్రవరి 7న వెస్టిండీస్, ఫిబ్రవరి 9న ఇటలీ, ఫిబ్రవరి 14న ఇంగ్లాండ్ తో కోల్‌కతాలో మ్యాచ్ లు ఆడనుంది. ఫిబ్రవరి 17న ముంబైలో నేపాల్ తో మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఈ నాలుగు మ్యాచ్ లను శ్రీలంకలో ఆ దేశ క్రీడా మంత్రిత్వ శాఖతో పాటు బంగ్లా క్రికెట్ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ వివాదంపై అటు ఐసీసీ.. ఇటు బీసీసీఐ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# సింపుల్‌గా క్లాస్ తీస్కున్న అనసూయ


సీనియర్ యాంకర్ గా, నటిగా అనసూయ భరద్వాజ్ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. బుల్లితెర వెండి తెర రెండు చోట్లా రాణిస్తున్న నటి. ముఖ్యంగా హీరోయిన్ ఓరియెంటెడ్ (లేడీ ఓరియెంటెడ్) సినిమాలతోను అనసూయ మెప్పించారు. ఇటీవల వరుసగా పలువురు అగ్ర హీరోల సినిమాల్లో క్యారెక్టర్ నటిగా కనిపిస్తూ, అందరి మన్ననలు పొందారుఅనసూయ గతంలో -కథనం- అనే చిత్రంలో నాయికగా నటించింది. తదుపరి మరికొన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఫ్లాష్ బ్యాక్ అనే చిత్రంలో అనసూయ ఒక పవర్‌ఫుల్ అండ్ బోల్డ్ పాత్రలో నటిస్తున్నారు. ప్రభుదేవా - రెజినా కసాండ్రాతో కలిసి ఆమె నటించిన ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఓటీటీల కోసం రూపొందుతున్న ఓ రెండు వెబ్ సిరీస్ లలోను అనసూయ నటిస్తోంది. ఇవి నాయికా ప్రధాన క్రైమ్ థ్రిల్లర్లు.ఇటీవల -పుష్ప 2: ది రూల్ - చిత్రంలో అత్యంత ప్రభావం చూపే పాత్ర -దాక్షాయణి-గా నటించింది. దాక్షాయని మోస్ట్ పవర్‌ఫుల్ పాత్రతో మెప్పించారు. అనసూయ సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను సైతం లెక్కచేయక తన దారిలో తాను దూసుకుపోతూ ముక్కుసూటి మనిషిగా గుర్తింపు పొందారు. ఇటీవల నటుడు శివాజీతో ఎపిసోడ్స్ లో అనసూయ తీవ్రమైన ఉద్వేగంతో స్పందించారు. తాను కూడా హీరోయిన్ గా నటించాను! అని అనసూయ చేసిన వ్యాఖ్యలకు సోషల్ మీడియాల్లో కౌంటర్లు పడుతున్నాయి. దీనికి అనసూయ క్లాస్ తీస్కుంటూ నిజమైన హీరోయిన్ ఎలా ఉండాలో కూడా చెప్పారు. సత్యం మాట్లాడే ధైర్యం.. సొంత దారిలో నడవడం.. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం నిజమైన హీరోయిన్ లక్షణాలు అని విశ్లేషించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది.నటుడు శివాజీతో ఎపిసోడ్ లో అనసూయపై చాలా ట్రోలింగ్ జరిగింది. కొన్నిసార్లు ఈ ట్రోలింగ్ ఏ రేంజుకు చేరిపోయింది! అంటే అనసూయ ఆల్మోస్ట్ ఎమోషనల్ అయిపోయి కన్నీటిని ఆపుకోవాల్సిన దుస్థితి కూడా వచ్చింది. ఒక బలమైన వ్యక్తిత్వం ఉన్న మహిళగా అనసూయ ట్రోలర్స్ పనిని ఖండించారు.



# టాప్ 2 ప్లేస్ లో నాగార్జున.. ఈసారీ రెస్పాండ్ అవుతారా?

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో స్టార్ యాక్టర్స్ నెట్ వర్త్ పై రీసెంట్ గా వచ్చిన రిపోర్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 2025 వరకు హీరోల ఆస్తుల అంచనాలను ఓ జాతీయ మీడియా సంస్థ విడుదల చేయగా.. అందులో టాలీవుడ్ కు చెందిన పలువురు సీనియర్ నటులు టాప్ 10 జాబితాలో చోటు దక్కించుకోవడం విశేషంగా మారింది.

ముఖ్యంగా అక్కినేని నాగార్జున పేరు రెండో స్థానంలో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అయితే ఆ రిపోర్ట్ ప్రకారం, బాలీవుడ్ స్టార్ హీరో షారుఖ్ ఖాన్ దేశంలోనే అత్యధిక సంపద కలిగిన నటుడిగా మొదటి స్థానంలో నిలిచారు. ఆయన నికర ఆస్తుల విలువ సుమారు రూ.12,931 కోట్లుగా అంచనా.షారుక్ తర్వాతి స్థానంలో టాలీవుడ్ కింగ్ నాగార్జున ఉన్నారు. నాగార్జున మొత్తం సంపద దాదాపు రూ.5000 కోట్లుగా ఆ రిపోర్ట్ పేర్కొంది. అనేక మంది బాలీవుడ్ హీరోలు ఉండగా, నాగార్జున రెండో స్థానంలో ఉండటం గమనార్హం. మూడో స్థానంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ ఉన్నారు. ఆయన సంపద సుమారు రూ.3225 కోట్లుగా అంచనా.ఆ తర్వాత హృతిక్ రోషన్ (రూ.3100 కోట్లు), అక్షయ్ కుమార్ (రూ.2250 కోట్లు), ఆమిర్ ఖాన్ (రూ.1860 కోట్లు) వరుసగా ఉన్నారు. ఏడో స్థానంలో మన మెగాస్టార్ చిరంజీవి నిలిచారు. ఆయన నికర ఆస్తులు సుమారు రూ.1750 కోట్లుగా నివేదిక వెల్లడించింది. ఆ తర్వాత స్థానాల్లో బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్, టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేష్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉన్నారు.అయితే టాప్ 10లో ఇద్దరు సీనియర్ తెలుగు నటులు, ఒక యంగ్ హీరో ఉండటం టాలీవుడ్ స్థాయిని మరోసారి చాటి చెప్పిందని అభిమానులు అంటున్నారు. అదే సమయంలో ఇలాంటి నెట్ వర్త్ అంచనాలపై గతంలో నాగార్జున స్వయంగా స్పందించిన సందర్భాలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే.ఫోర్బ్స్ వంటి సంస్థలు ఇంతకుముందు విడుదల చేసిన సంపద జాబితాలపై నాగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెలబ్రిటీల ఆస్తులపై వచ్చే లెక్కలు పూర్తిగా నిజమైనవి కావని, చాలా అంశాలు బయటకు రాకపోవడం వల్ల ఇవి కేవలం అంచనాలుగానే ఉంటాయని వ్యాఖ్యానించారు. ఈ లెక్కలు తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని అప్పట్లో అన్నారు.ఇప్పుడు అదే నాగార్జున దేశంలో రెండవ అత్యంత ధనవంతుడైన నటుడిగా నిలవడం ఆసక్తికరంగా మారింది. కొందరు ఆ గణాంకాలు నిజమే కావచ్చని భావిస్తుంటే, మరికొందరు ఇవి ఊహాగానాలేనని అంటున్నారు. యాక్టింగ్ తో పాటు వ్యాపారాలు, నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులే నాగార్జున సంపదకు కారణమని చెబుతున్నారు. మరి ఇప్పుడు కూడా నాగ్ రెస్పాండ్ అవుతారేమో చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965